ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 203 పేజీలు: 12 వెల: 6.50

బ్రిక్స్ ప్రతినిధులకు ఘన స్వాగతం 3లో
డిగ్రీ ఉన్నా యువతకు ఏవీ ఉద్యోగాలు? 9లో



శుక్రవారం న్యూఢిల్లీలో యువ పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## ప్రపంచ అంతరిక్ష సాంకేతిక కేంద్రంగా
# భారత్‌ను మార్చండి

**స్పేస్ సెక్టార్ యువ పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోడీ పిలుపు**

**సేవా తీర్థ్‌లో అంతరిక్ష స్టార్టప్‌ల సిఇఒలు, వ్యవస్థాపకులతో భేటీ**

**దేశంలో విస్తరిస్తున్న ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ఇక్కడ సేవా తీర్థంలో 20 భారతీయ అంతరిక్ష స్టార్టప్‌ల సిఇఒలు, వ్యవస్థాపకులతో సంభాషించారు. ఈ సందర్భంగా దేశ ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ పెరుగుతున్న బలాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, అంతరిక్ష సాంకేతికతకు భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా నిలపడానికి మరింత సహకారం అవసరమని పిలుపునిచ్చారు. రాకెట్, పునర్వినియోగ సెమీక్రయోజెనిక్ లాంచ్ వెహికల్ అభివృద్ధి, ఏవియానిక్స్, ఉపగ్రహాలు, అధునాతన ప్రొపల్షన్ వ్యవస్థలు, అంతరిక్ష, రక్షణ నిఘా, అంతరిక్ష శిథిలాల తొలగింపు, ఎఐఆధారిత హైపర్‌లోకల్ వాతావరణ, శీతోష్ణస్థితి నిఘా వంటి అనేక రంగాలలో పనిచేస్తున్న స్టార్టప్‌ల సిఇఒలు హాజరయ్యారు. స్టార్టప్ వ్యవస్థాపకులు

>>2




శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రాహుల్

## ఢిల్లీలో రాహుల్ మెరుపు ధర్నా

2లో

# పరి'శ్రమిస్తున్నాం'!



**పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేలా 28 కొత్త పాలసీలు తెచ్చాం**

**రెండేళ్లలో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు**

**ఎఫ్‌డిఐలు ఆరున్నర రెట్లు పెరిగాయి**

**పరిశ్రమల ఏర్పాటుతో 11లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**సోషల్ మీడియా వేదికగా సిఎం చంద్రబాబు వెల్లడి**

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 28 కొత్త పాలసీలు తీసుకొచ్చిందని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ పాలసీలు సౌలభ్యంగా ఉండటంతో వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి భారీగా పారిశ్రామికవేత్తలు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. వారికి మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం అంటూ 'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు రాష్ట్రంలో పారిశ్రామీకరణ దిశలో తీసుకుంటున్న చర్యలు వివరించారు. "ఇప్పటికి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రూ.14లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. దీంతో 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచింది. రెండేళ్లలో ఎఫ్‌డిఐలు ఆరున్నర రెట్లు పెరిగింది. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమోనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి. రూ.95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టాం. సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. బిసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం. నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నాం. పొగాకు, కోకూ, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నాం' అని సిఎం

>>2

## 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్
# మూడో దశ పనులు ప్రారంభం

**రాజధానిలో యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు**

**'నిర్మాణ నగరం'గా అమరావతి సాక్షాత్కారం**

**పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**

**తుళ్లూరులో శివాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమానికి హాజరు**



**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29న ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. రైతుల త్యాగాలతోనే అమరావతి తిరిగి రాజధానిగా రూపుదిద్దుకుందని, ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులుఎంతో సహకరించారన్నారు.

>>2

## వివేకా హత్య కేసు
# ఇడి సోదాలు



శుక్రవారం ఎంపి అవినాష్ రెడ్డి ఇంటి వద్ద తనిఖీలు చేస్తున్న ఇడి అధికారులు

**పులివెందుల, హైదరాబాద్ సహా ఏడు ప్రాంతాల్లో తనిఖీలు**

**కోకాపేటలో ఎంపి అవినాష్‌రెడ్డి ఇంట్లో రూ.24లక్షలు సీజ్**

**పులివెందులలో కీలక పత్రాలు స్వాధీనం, రసీదులు అందజేత**

**హత్యకు నెల రోజుల ముందే రూ.40కోట్ల ఒప్పందం**

**తనిఖీలు చేసినట్లు అధికారికంగా ఇడి అధికారులు వెల్లడి**

**కడప/పులివెందుల/హైదరాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వెలుగు చూసిన మనీలాండరింగ్ కోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) అధికారులు శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో ఏడు చోట్ల సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో కడప ఎంపి అవినాష్ రెడ్డి ఇంటితో పాటు కడప జిల్లాలోని పులివెందులలో ఆయన ఇంట్లోనూ ఈ సోదాలు జరిగాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఓవైపు సిబిఐ విచారణ తుది దశకు చేరుకుని కోర్టు విచారణ మొదలవగా అనూహ్యంగా ఇడి రంగంలో దిగింది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగా ఇడి అధికారులు ఇసిఐఆర్‌ను నమోదు చేశారు. దీని ఆధారంగా వివేకానంద రెడ్డి హత్య కేసులో ఇడి అధికారులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో మొదట అవినాష్ రెడ్డి ఇంట్లో సోదాలు చేబట్టారు. ఇదే సమయంలో మరో బృందం పులివెందులలో గల మరో ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో పులివెందులలోని అవినాష్ రెడ్డి ఇంటికి తాళం వేసి వుండగా ఆయన చిన్నాన మనోహర్ రెడ్డిని పిలిపించి తాళాలు తీయించారు. దీని తరువాత ఆ ఇంట్లో సోదాలు చేబట్టి కొన్ని పత్రాలను జప్తు చేశారు. తెలూరు తుమ్మలపల్లిలోని ఎర్ర గంగిరెడ్డి నివాసంలో, పులివెందులలోని నారాయణ కళాశాల సమీపంలోని యాదాటి సునీల్ యాదవ్ నివాసంలో, భాకరాపురంలోని షేక్ దస్తగిరి నివాసంలోను, సుజాత హాల్ సమీపంలోని దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలకు సంబంధించిన నివాసాల్లో, అలాగే వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసప్రదేశాల్లోనూ సోదాలు నిర్వ హించారు. ఈ తనిఖీల సందర్భంగా అధికారులు ఇళ్లలోని


>>2

## టర్కీ సంచలన
# నిర్ణయం

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అంతర్జాతీయ అరెస్ట్ వారెంట్**

**అంకారా, ఆగస్టు 21:** గాజా కోసం వెళ్లిన కార్యకర్తలను ఇజ్రాయెల్ అడ్డుకున్న ఘటనపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అంతర్జాతీయ అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు టర్కీ ప్రకటించింది. ఈ విషయాన్ని టర్కీ న్యాయశాఖ మంత్రి అకిన్ గుర్లెక్ శుక్రవారం వెల్లడించారు. గాజాలో హమాస్‌పై ఇజ్రాయెల్ చేపట్టిన యుద్ధంలో మారణహోమంకు పాల్పడిందన్న ఆరోపణలపై

>>2





**చిత్రసీమలో మరో విషాదం**

## షావుకారు జానకి
# ఇక లేరు

**వృద్ధాప్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**రాజమండ్రి నుంచి 'ఆకాశవాణి' ద్వారా వెండితెరకు**

**రేడియో జాకీగా కెరీర్ ప్రారంభం.. 'షావుకార్లు' చిత్రంతో సినీపరిశ్రమకు పరిచయం**

**భాషల సరిహద్దులు దాటిన నటనా ప్రతిభ**

**బుల్లితెర సీరియల్స్‌లోనూ 'షావుకారు' జానకి**

**చివరగా 'అన్నీ మంచి శకునములే' సినిమాలో**

**సినీప్రముఖులతోపాటు సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు సంతాపం**

**నేడు చెన్నైలో అంత్యక్రియలు**

**చెన్నై, ఆగస్టు 21:** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా జానకి శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల మరోసారి ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో జానకిని ఆమె కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది రోజులుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మధ్యాహ్నం 1.59 గంటలకు కన్నుమూశారు. ఈ మేరకు నడియార్ సంఘం అధ్యక్షుడు నాజర్ ఓ ప్రకటన చేశారు. జానకి మృతితో దక్షిణాది సినీపరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. సినీ, రాజకీయ ప్రముఖులు జానకి మృతిపట్ల సంతాపం తెలిపారు. జానకి పార్థివదేహాన్నిసాయంత్రం 5గంటలకు తేనాం పేటలోని సెంటాఫ్ రోడ్‌లోని నివాసానికి తరలించారు. సిని ప్రముఖులంతా

>>2




22-8pg2exHMNWJQE:22-8pg2exHMNWJQE.qxd 22/Aug/26 12:30 AM Page 1





శుక్రవారం న్యూఢిల్లీలో యువపారిశ్రామికవేత్తలతో ప్రధాని మోదీ

# భారత్‌ను మార్చండి

>> భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష రంగం సాధించిన వేగవంతమైన పురోగతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దాని భవిష్యత్తుపై తమ దార్శనికతను పంచుకున్నారు. ప్రధానమంత్రి, ప్రభుత్వం అందించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ కంపెనీలు స్వదేశీంగా సామర్థ్యాలను, సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి గణనీయమైన సమయాన్ని, కృషిని వెచ్చించాయని వారు తెలిపారు. ప్రభుత్వ మద్దతు, కంపెనీల మధ్య సహకారం ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతోందని సిఇఒలు వివరించారు. అంతరిక్ష రంగంలో ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించడానికి తమ బృందాలు అత్యంత ప్రేరణతో, పట్టుదలతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవాలన్న నిర్ణయం గణనీయమైన ఉత్సాహాన్ని రేకెత్తించి, భారత పరిశ్రమకు కొత్త అవకాశాలను సృష్టించిందని వ్యవస్థాపకులు గుర్తుచేసుకున్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ అభివృద్ధి చేసిన సాంకేతికతలను స్వీకరించడానికి, వినియోగించుకోవడానికి ఇప్పుడు అనేక కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని కూడా వారు పేర్కొన్నారు. అంతరిక్ష రంగ నాయకుల ధైర్యాన్ని, పొరవను అభినందిస్తూ, ప్రైవేట్ కంపెనీలు ప్రదర్శించిన విశ్వాసం, ఈ రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవడం వెనుక ఉన్న దార్శనికతను బలోపేతం చేసిందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. అనేక దేశాలకు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టడానికి వనరులు లేవని లేదా అటువంటి పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడటం లేదని, ఇది ప్రపంచ అంతరిక్ష పరిశ్రమలో భారతదేశం తన స్థానాన్ని వేగంగా బలోపేతం చేసుకోవడానికి ఒక పెద్ద అవకాశాన్ని సృష్టిస్తోందని ప్రధానమంత్రి సూచించారు. తమ సాంకేతిక పరిజ్ఞానాలను కొత్త అనువర్తనాలను అన్వేషించాలని, ప్రజల జీవితాలను సులభతరం చేసే పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ అంతరిక్ష సంస్థలను ప్రోత్సహించారు. అంతరిక్ష స్టార్టప్‌లు, ఇతర రంగాలలో పనిచేస్తున్న కంపెనీల మధ్య మరింత సహకారం ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. అంతరిక్ష శిథిలాలపై పనిచేస్తున్న కంపెనీలు తమ సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని విస్తరింపజేసుకోవడానికి పర్యావరణ సంస్థలతో కలిసి పనిచేయవచ్చని ప్రధాని మోదీ సూచించారు. అదేవిధంగా, వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక కంపెనీలు, రైతులు మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు ఉత్పాదకతను మెరుగుపరచుకోవడంలో సహాయపడటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలతో భాగస్వామ్యం కుదుర్చుకోవచ్చని సూచించారు.

# ఢిల్లీలో రాహుల్ మెరుపు ధర్నా

### జంతర్ మంతర్ ఆందోళనల్లో పెల్లెట్ గన్‌ఫైరింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్

### పోలీసులు నిరాకరించండంతో పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఢిల్లీలో గత నెల 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై పోలీసులు చేసిన దాడుల్లో పెల్లెట్ గన్ లను ప్రయోగించారు. దీంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. అయితే దీనిపై ఇప్పటివరకూ పోలీసులు ఎఫ్ఐఆర్ లు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో అలా పెల్లెట్ గన్ ఫైరింగ్ లో గాయపడిన ఓ విద్యార్థిని తీసుకుని ఇవాళ లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ నేరుగా పోలీసు స్టేషన్ కు వెళ్లారు. అక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై పోలీసుల్ని ప్రశ్నించారు. అయినా పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరించారు. దీంతో రాహుల్, ప్రియాంక, మరో కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ తో కలిసి పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ ఆవరణలోనే ధర్నాకు దిగారు. పోలీసులు పెల్లెట్ గన్ ల ప్రయోగాన్ని ఎఫ్ఐఆర్ నమోదు చేసేంతవరకూ కదిలేది లేదంటూ వీరు అక్కడే భైఠాయించారు. దీంతో పోలీసులు ఉన్నతాధికారుల్ని సంప్రదించారు. ఇప్పటికే సుప్రీంకోర్టు ఈ పెల్లెట్ గన్ ల ప్రయోగంపై విచారణ జరుపుతున్న నేపథ్యంలో తాము ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నిబంధనలకు విరుద్ధమని పోలీసులు కాంగ్రెస్ నేతలకు తెలిపారు. దీంతో సంతృప్తి చెందని రాహుల్, ప్రియాంక ధర్నా కొనసాగించారు. మరోవైపు ఒత్తిడి అంతకంతకూ పెరుగుతుండటంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీసులు ఫిర్యాదు దారు అయిన సాహిల్ నుంచి ఫిర్యాదు తీసుకుని ఆమోదించినట్లు ఓ ప్రకటన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్ పెల్లెట్ గన్ ల ప్రయోగంపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయడం లేదని పోలీసుల్ని ప్రశ్నించారు. పోలీసులు తాము పెల్లెట్ గన్ లు వాడలేదని చెప్పడంపై స్పందిస్తూ పోలీసులు కాకపోతే ఇంకెవరు వాడారని నిలదీశారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి ఎవరని రాహుల్ ప్రశ్నించారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఆదేశాలు ఉన్నట్లు పార్లమెంట్ స్ట్రీట్ స్టేషన్ పోలీసులు రాహుల్ గాంధీకి తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్ అసలు ఈ కేసులో హోంమంత్రి అమిత్ షాను ఎందుకు బాధ్యుడిని చేయడం లేదని అడిగారు.

# టర్కీ సంచలన నిర్ణయం

>> నెతన్యాహుతో పాటు పలువురు ఇజ్రాయెల్ ఉన్నతాధికా రులపై టర్కీ ఇప్పటికే అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఇజ్రాయెల్ మాత్రం మారణహో మం ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తోంది. బెంజమిన్ నెతన్యాహు తదితరులపై జారీ చేసిన అరెస్ట్ వారెంట్లకు అనుగుణంగా వారిపై ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు జారీ చేయాలని న్యాయశాఖ, అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖను కోరింది. తద్వారా వారిని అంతర్జాతీయంగా గుర్తించి, వెతికేందుకు వీలు కలుగుతుందని గుర్లెక్ తెలిపారు. సిరియాలో టర్కీ సైనిక స్థావరంపై నెతన్యాహు హెచ్చరికిదిలా ఉండగా, సిరియాలో టర్కీ సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. టర్కీ తన సైనిక ఉనికిని దక్షిణ దిశగా విస్తరించడాన్ని ఇజ్రాయెల్ సహించబోదని హెచ్చరించారు. టర్కీ సైనిక స్థావరం దక్షిణ దిశగా విస్తరించడాన్ని మేం సహించం. అది మాకు ముప్పు కలిగిస్తుంది. ఈ విషయాన్ని మేం స్పష్టంగా తెలియజేశామని నెతన్యాహు ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అలెప్పో సమీపంలోని టర్కీ నియంత్రణ రేఖకు దక్షిణంగా ఉన్న ఓ విమానాశ్రయంలో టర్కీ తన సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకునే ఉద్దేశంతో ఉందన్న సమాచారం తమకు అందిందని ఆయన తెలిపారు. దీంతో టర్కీకి స్పష్టమైన సందేశం పంపినట్లు చెప్పారు. అలెప్పో సమీపంలో టర్కీ తన పరిధికి దక్షిణంగా ఉన్న ఓ విమానాశ్రయంలో స్థావరం ఏర్పాటు చేసుకునే ఉద్దేశంతో ఉందని మాకు తెలిసింద నెతన్యాహు అన్నారు. టర్కీకి ఆ సందేశం చేరిందా అని ప్రశ్నించగా సందేశం చేరింది. కానీ వారు దాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నట్లు కనిపించలేదు. అందుకే వారు మరింత స్పష్టంగా అర్థం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని నెతన్యాహు వ్యాఖ్యానించారు. సిరియా విమానాశ్రయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులునెతన్యాహు వ్యాఖ్యలకు ముందు సిరియాలోని తూర్పు ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో ఉన్న అబు అల్ దుహుర్ సైనిక విమానాశ్రయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. అలెప్పో సమీపంలోని ఓ వైమానిక స్థావరంలో టర్కీ సైనికులను మోహరించే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలోనే ఈ దాడులు జరిగినట్లు నెతన్యాహు కార్యాలయం గతంలో వెల్లడించింది.

### తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత కేసు

# సెప్టెంబర్ 16న హైకోర్టు తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు21:** పార్టీ ఫిరాయింపులకు సంబంధించి ఎమ్మెల్యేలపై దాఖలైన కేసుపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తమ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీచేసి గెలిచాక అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై గురువారం కూడా హైకోర్టులో వాదనలు కొనసాగాయి. ఇరువర్గాల తుది వాదనలు శుక్రవారం పూర్తయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తీర్పును సెప్టెంబర్ 16న వెల్లడిస్తామని ధర్మాసనం ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్లను ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో స్పీకర్ కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.

## అమిత్‌షా పర్యటనతో మెత్తబడిన టివికె, డిఎంకె

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు విషయంలో కేంద్రం ఏం చేయనుందన్న అంశంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు పెడతారన్న అంచనాలు మొదట్లో వెలువడినా పేపర్ లీక్ అంశం వివాదాస్పదం కావడంతో డీలిమిటేషన్ అంశం తెరమరుగైనట్టు కనిపించింది. డీలిమిటేషన్ కోసం కేంద్రం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న అంచనాలు ప్రస్తుతం వెలువడుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అమిత్ షా నియోజకవర్గ పునర్విభజన అంశాన్ని ప్రస్తావించారు. డీలిమిటేషన్‌ను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం ఈ సమావేశం తరువాత మెత్తబడినట్టు ప్రచారం మొదలైంది.

# పరి'శ్రమిస్తున్నాం'!

>>వివరించారు. **మహిళా సాధికారతకు పెద్దపీట:** మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వయం బ్రాండ్ పేరిట వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏపిలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నాం. రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బీచ్‌టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చాం. వారసత్వంగా వచ్చిన ఆస్తులు, భూమిపై హక్కులు కాపాడేలా రెవెన్యూలో సంస్కరణలు తెచ్చాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగాన్ని బలోపేతం చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, నాలా చట్టాన్ని రద్దు చేశాం. ఇవన్నీ రాష్ట్రంలో పరిశ్రమలు అభివృద్ధి దిశలో తీసుకున్న చర్యలు" అని సిఎం చంద్రబాబు వివరించారు. ఎక్స్‌లోనే మరో పోస్టులో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చామని సిఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సిఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ రూ.20 వేలు అందిస్తున్నామని వివరించారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను శరవేగంగా నిర్మిస్తున్నామని తెలిపారు. జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఉప్పాడలో ఆధునిక ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నాం. ఉత్తరాంధ్రలో అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభించాం. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయి. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హార్బర్లు, హైవేలు, రైల్వే లేన్లతో రాష్ట్రం లాజిస్టిక్స్‌కు హబ్ అవుతుంది. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టాం. బ్లూ గ్రీన్ సిటీగా డీప్ టెక్ క్యాపిటల్‌గా, కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీగా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మితం అవుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

**స్థానిక పాలనలో ఏపి దేశానికే ఆదర్శం:** "పల్లెపండుగ, అడవి తల్లి బాట కింద గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టాం. ఏపిని 50శాతం గ్రీన్ కవర్ తెచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. చెత్తపన్ను రద్దు చేసి లెగసీ వేస్ట్ తొలగించాం. స్వచ్ఛ రథం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టాం. విద్యుత్ రంగంలోనూ వెలుగులు తెచ్చాం. ట్రూ డౌన్ చేసి ట్రూ అప్ భారాన్ని భరిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో 112 గిగావాట్ల ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకుని వస్తున్నాం" అని సిఎం చంద్రబాబు వెల్లడించారు.

# వివేకా హత్య కేసు: ఇడి సోదాలు

>>ఆస్తులకు సంబంధించిన వివరాలు, వివిధ డాక్యుమెంట్లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించినట్లు తెలుస్తోంది. సుమారు ఐదు నుంచి ఆరు గంటల పాటు సోదాలు కొనసాగించగా ఒక్క దస్తగిరి ఇంటిలో మాత్రం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దాఖలు చేసిన పత్రాలలోనూ అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలంలో రూ.40 కోట్లకు సంబంధించిన ఒప్పందం/ లావాదేవీ ప్రస్తావన ఆధారంగా రూ.40 కోట్ల సుపారీకి సంబంధించిన విషయాలపై విచారణ చేపట్టి మనీల్యాండరింగ్ జరిగినట్టు చార్జిషీట్‌లో సిబిఐ పేర్కొంది. ఈ ఆర్థిక కోణంపైనే కేసు నమోదు చేసి ఇడి ప్రస్తుతం దర్యాప్తు సాగిస్తోంది. ఈ సందర్భంగా అధికారులు పలు డాక్యుమెంట్లు, ఆస్తుల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. సోదాల సందర్భంగా కోకాపేట్‌లోని అవినాష్ రెడ్డి ఇంట్లో లెక్కలో చూపని రూ.24 లక్షలు సహా కీలక పత్రాలను, రెండు బ్యాంకు లాకర్ల తాళాలను ఇడి అధికారులు జప్తు చేశారు. దీనికి సంబంధించిన రసీదును ఇంట్లోని వారికి ఇచ్చారు.

**ఎటువంటి డాక్యుమెంట్లు తీసుకెళ్ళలేదు: వైయస్ మనోహర్ రెడ్డి:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఉదయం ఎంపి వైయస్ అవినాష్ రెడ్డి ఇంటికి వచ్చారని, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అధికారులు నన్ను పిలిపించగా ఎంపి అవినాష్ రెడ్డితో మాట్లాడి తాళాలను తీశానని వైఎస్ మనోహర్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఇంటి పత్రాలు, భూములకు సంబంధించిన పత్రాలు అధికారులు పరిశీలించారని వివరించారు. అంతేతప్ప ఎటువంటి డాక్యుమెంట్లు తీసుకెళ్ళలేదని తెలిపారు. వివేకా హత్య కేసులో మీ పేరు ఉందా? రూ.40 కోట్లు ఎలా ఇచ్చారు? అని ప్రశ్నించారు, కేసులో నా పేరుంది, అంత డబ్బులు ఎందుకు ఇస్తామని సమాధానం ఇచ్చానని చెప్పారు. అంతకు మించి ఏమి అడగలేదు, ఏమి తీసుకెళ్ల లేదు అని వైయస్ మనోహర్ రెడ్డి తెలిపారు.

వివేకానంద రెడ్డి హత్య 2019 మార్చి 15వ తేదీన జరగగా అంతకు నెల రోజుల ముందుగానే కుట్రదారులు దీనికి పథకం రచించారని ఇడి అధికారులు తెలిపారు. వివేకానంద రెడ్డి హత్యకు రూ.40 కోట్ల డీల్ కుదిరిందని, ఇందుకోసం దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు తేలిందని ఇడి అధికారులు తెలిపారు. రూ.40 కోట్ల డీల్‌లో రూ.5 కోట్లు దస్తగిరికి ఇచ్చేందుకు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి మొగ్గు చూపాడని ఇడి అధికారులు తెలిపారు. సోదాల సందర్భంగా ఆయా ప్రాంతాలలో వున్న వారిని విచారించిన ఇడి వారి వాంగ్మూలం తీసుకుంది. ఈ కేసులో మరోదఫా సోదాలు జరిగే వీలుందని సమాచారం.

# మూడో దశ పనులు ప్రారంభం

>>శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి నిర్మాణ ప్రాంగణాల్లో ఇప్పుడు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పనులు పరుగులు పెడుతున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో వంద మీటర్ల ఎత్తైన భారీ క్రేన్లు, ఆకాశానికే కాంతి తోరణాలు కడుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. జాతరలోని ప్రభలను తల పించే ఈ వెలుగులు రాజధాని పరిధిలోని గ్రామాలకూ స్పష్టంగా కనిపిస్తూ నిర్మాణ జోరును చాటు తున్నాయి. వాతావరణం అనుకూలించడంతో నిర్మాణ సంస్థలు పనుల వేగాన్ని మరింత పెంచాయి. ప్రభుత్వం, సిఆర్‌డిఏ నిర్దేశించిన గడువుల్లో ఐకానిక్ భవనాలను పూర్తి చేయడమే లక్ష్యంగా కాంట్రాక్ట్ సంస్థలు షిఫ్టుల వారీగా పనులు కొనసాగిస్తున్నాయి. జిఏడి టవర్, నాలుగు హెచ్‌ఓడి టవర్ల వద్ద రాత్రివేళల్లోనూ భారీ స్థాయిలో పనులు సాగుతుండటంతో అమరావతి ఇప్పుడు 'నిర్మాణ నగరం'గా కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. అమరావతి ఐకానిక్ సెక్రటేరియట్ టవర్ల నిర్మాణంలో అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కింద నుంచి పైవరకు ఏడు నుంచి తొమ్మిది డైమండ్ ఆకృతులు వచ్చేలా ప్రత్యేక ఇంజినీరింగ్ డిజైన్‌తో ఈ టవర్లను నిర్మిస్తున్నారు. ఏటవాలుగా ఏర్పాటు చేసే డయాగ్రిడ్ పిల్లర్లు ఒకచోట కలసి, మళ్లీ విడిపోయి పక్కనున్న పిల్లర్లతో అనుసంధానమవుతూ భవనానికి అపూర్వమైన బలం, రూపాన్ని అందిస్తాయి. ఒక్కో డైమండ్ నిర్మాణాన్ని ఆధారంగా చేసుకుని ఆరు అంతస్తుల చొప్పున నిర్మాణాన్ని పైకి తీసుకెళ్తున్నారు. అమరావతిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీ, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్డుపై దృష్టి పెట్టామని, 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారికి కలిపే మూడో విడత ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభిస్తామని నారాయణ వెల్లడించారు. రాజధాని నిర్మాణంలోభాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని, తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతి నెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

ఇక తుళ్లూరులో వందల యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి హాజరైన మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు ఇదే ఆలయం నుంచి రైతులు న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్ర ప్రారంభించి విజయం సాధించారని మంత్రి నారాయణ గుర్తు చేశారు.

# షావుకారు జానకి ఇక లేరు

>> ఆమెకు అక్కడే తుది నివాళులు అర్పిస్తున్నారు. అయితే అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ రంగానికి ప్రముఖులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు తేనాంపేట సెంటాఫ్ రోడ్ ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేసారు. షావుకారు జానకి ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో ఆయా పాత్రలు పోషించారు. ఆమె ప్రముఖ నటి కృష్ణకుమారికి చెల్లెలు కూడా. 11ఏళ్లకే రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో జానకి పాల్గొన్నారు. ఇక 1949లో రక్షా రేఖ తెలుగు చిత్రంతో తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత రెండో సినిమా షావుకారుతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. దీంతో ఆ సినిమా టైటిల్‌నే ఇంటి పేరుగా మార్చుకున్నారు జానకి. ఇకతెలుగు, తమిళ, కన్నడభాషల్లో 400కు పైగా చిత్రాల్లో జానకి నటించారు. ఆమె ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్, శివాజీ గణేశన్ సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. జానకి చివరగా 2023లో వచ్చిన అన్నీ మంచి శకునములే సినిమాలో కనిపించారు. కాగా జానకి అంత్యక్రియలను శనివారం చెన్నైలోని బీసెంట్‌నగర్ క్రిమెటోరియంలో నిర్వహిస్తారు.

జానకికి షావుకారు సినిమాలో బీఎన్ రెడ్డి అవకాశం ఇచ్చారు. 73 ఏళ్లుగా తెలుగునాట ప్రేక్షకులకు ఆమె సుపరిచితురాలు. జానకి సినీప్రస్థానం ఓ అద్భుతం. తన డైలాగ్ డెలివరీతో జానకి ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇక సంసారం ఒక చదరంగంలో చిలకమ్మ పాత్ర ఆమె కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రల్లో ఒకటిగా చెప్పవచ్చు. అప్పట్లో జానకి వరుసగా సినిమాలు చేసేవారు. 1955లో ఏకంగా 11 సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. అదే ఏడాది వచ్చిన రోజులు మారాయి సినిమా ఆమె సినీజీవితాన్ని మారిపోయింది. ఇక ఆమె నటించిన ఏది నిజం సినిమాకు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ బహుమతి లభించింది.

1952లో వలయపతితో తమిళ ప్రేక్షకులను కూడా అలరించారు. ఇక 1962 తర్వాత షావుకారు జానకి సహాయ చిత్రాల్లోనే నటిస్తున్నారు. ఆమె చివరిసారిగా 2023లో సంతోశ్ శోభన్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన అన్నీ మంచి శకునములే సినిమాలో కనిపించారు.

సుదీర్ఘ కెరీర్‌లో 400 పైగా సినిమాల్లో నటించిన షావుకారు జానకిని కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. అలాగే ఆమె కళైమామణి, నంది, రాజ్యోత్సవ అవార్డు, సైమా లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ పురస్కారం అందుకున్నారు. జానకి ఒక్కరే కాదు, స్వయానా తన చెల్లెలు కృష్ణకుమారిని కూడా సినిమాల్లోకి తీసుకొచ్చారు. ఆమె 90ల్లో హీరోయిన్‌గా రాణించారు. కెరీర్‌లో 150కి పైగా సినిమాల్లో నటించారు. ఇందులో ఆమె నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వరరావుతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు.



అసోంలో భారీ వరదలలో చిక్కుకున్న బాధితులను రిక్షాలో తరలిస్తున్న దృశ్యం

# తెలంగాణ మంత్రి వినూత్న నిరసన!

### పెంట్లవెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో టాయ్‌లెట్స్ శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

## అధికారుల నిర్లక్ష్యంపై నిరసన చర్య

**కొల్లాపూర్,ఆగస్టు21,ప్రభాతవార్త :** పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల నిర్లక్ష్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కార్యాలయంలోని టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి స్వయంగా తానే దానిని శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు. పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి హితవు పలికారు.



అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి.. సిబ్బంది నిరక్ష్యానికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది అవాక్కయారు. అనంతరం పారిశుద్ధ్య సామగ్రి, టైల్స్ ఏర్పాటుకు తన వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందించారు. కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల స్థితిగతులను స్వయంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇప్పటికే గోడలు నిర్మించుకుని స్లాబ్ వేసుకునే స్థితిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అలాగే, ఇల్లు నిర్మాణంలో బేస్ లెవెల్ వరకు పూర్తి చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిగతా నిర్మాణాన్ని కొనసాగించలేకపోతున్న అర్హులైన లబ్ధిదారులకు రూ.4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిచేకూర్చుతున్నామని వెల్లడించారు. అర్హత, ఇంటి ప్రస్తుత స్థితిగతులు, లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మాజీ సర్పంచ్ రామన్ గౌడ్, హౌసింగ్ డీఈ రాజవర్ధన్ రెడ్డి తదితరులు మండల ప్రజా ప్రతినిధులు, గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు, వివిధ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## జానకి మృతి పట్ల సిఎం చంద్రబాబు సంతాపం

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం నాకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. 400 కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరం అయినా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచి పోతారన్నారు. జానకి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను అని చంద్రబాబు తెలిపారు.

**మరణం లేని మహానటి : డి.సిఎం పవన్ కల్యాణ్**

మరణం లేని మహానటి షావుకారు జానకి అని డి.సిఎం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం "ఎక్స్' సంతాపం వ్యక్తం చేసారు. ఆమె జీవన ప్రస్తానమంతా సినిమా రంగంతో ముడి పడింది. 75యేళ్ళ పాటు ఆమె సినిమాలో నటించారన్నారు. నిన్నా, మొన్నటి వరకు ఆమె నటించారన్నారు. ఆమె అద్భుతమైన నటి అన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

### మంత్రి లోకేష్ సంతాపం

జానకి మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ "ఎక్స్" వేదికగా మంత్రి నారా లోకేష్ పోస్టు చేసారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. షావుకారు సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. సినీ రంగానికి ఆమెఅందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడినిప్రార్థిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### మంత్రి కందుల దుర్గేశ్ సంతాపం

జానకి మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షావుకారు చిత్రంతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆమె షావుకారు జానకి గా తెలుగు సినీ రంగంలో విశేష కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారని మంత్రి పేర్కొన్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వారం - వర్జ్యం

22-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.దశమి రా.2.00
న.జ్యేష్ఠ మ.2.49
వ.లేదు.
దు.తె.5.52-ఉ.7.30
రాహు.ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం:** చెప్పుడు మాటలు విని అయిన వాళ్ళని దూరం చేసుకుంటారు. వ్యాపార పరంగా నూతన నిర్ణయాలు తీసుకుంటారు.

**వృషభం:** నూతన విద్యల పట్ల ఆకర్షితులవుతారు. వ్యాపారాలు ప్రారంభించాలన్న ఆలోచనలు కలిగి ఉంటారు. ప్రయాణాలు.

**మిథునం:** తనఖాలు, మొండిబాకీలు వంటి ఆర్థిక అంశాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. విలువైన ఆభరణాలు, వస్తువులు కొనుగోలు.

**సింహం :** కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** రాజకీయ, కళారంగాలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన అవకాశాలు లభిస్తాయి.

**వృశ్చికం :** గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. శుభకార్యాలలో బంధుమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**ధనుస్సు :** కష్టసుఖాలను సరిసమానంగా చూస్తారు. ఏది కోల్పోయిన మనోధైర్యం మాత్రం కోల్పోరాదు.

**మకరం :** ప్రయాణాలు, బంధుమిత్రుల రాకపోకలు, అధిక ధన వ్యయానికి, ఆనందోత్సాహాలకు కారణం అవుతాయి.

**కుంభం:** మీలో దాగి వున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మీనం:** విద్యా సంబంధమైన విషయాలలో మరింత శ్రద్ధ కనబరచ వలసి ఉంటుంది. ఆర్థిక పరమైన వెసులు బాటు లభిస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నేడు కేరళకు డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం కేరళకు పయనం కానున్నారు. భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. జబీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం లిగమెంట్ కఫ్‌కి గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు. అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు. విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి తేరుకోలేకపోతున్నా

### - విద్యా మంత్రి నారా లోకేశ్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో మరోక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు' అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.

## అంగన్వాడీలకు కొత్త మెనూ

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహార మెనూలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 7 -12 నెలల చిన్నారులకు నెలకు 1.5 కిలోల జూనియర్ బాలామృతం, 13 -36 నెలల పిల్లలకు 2.5 కిలోల సీనియర్ బాలామృతం అందించనున్నారు. 3-6 ఏళ్ల పిల్లలకు వారానికి రెండుసార్లు ఎగ్ ఫ్రైడ్ రైస్, సాయంత్రం ఉడికించిన శనగలు ఇవ్వనున్నారు. అన్ని వంటకాల్లో మునగాకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది.

## రెండు రోజుల పాటు వర్షాలు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో రాగల 48గంటలల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర, దక్షిణకోస్తాతో పాటు రాయలసీమ ప్రాంతాల్లో వానలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో రాబోయే మూడ్రోజులు పాటు రాష్ట్రంలో వానలు పడతాయని అమరావతి వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది.

**629 ఎఇఇ పోస్టులకు 1.05 లక్షల మంది అభ్యర్థులు**

## రేపటి నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష

- ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి వెల్లడి



**విశాఖపట్నం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యుత్ రంగంలో సాంకేతిక సిబ్బందిని మరింత బలోపేతం చేయడంతో పాటు అర్హత కలిగిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఏపీ విద్యుత్ సంస్థల్లో ఎఇఇ నియామకం కోసం నిర్వహిస్తున్న నియామక పరీక్ష2026కు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు విస్తృత ఏర్పాట్లు చేశాయని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్ సంస్థల్లో 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఈ పరీక్షకు 1,05,566 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారన్నారు. ఆగస్టు 23 నుంచి 27 వరకు ఐదు రోజుల పాటు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నామని, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో కలిపి మొత్తం 94 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో 81 కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మరో 13 కేంద్రాలు రాష్ట్రం వెలుపల ఉన్నాయని తెలిపారు. పరీక్షను పారదర్శకంగా, పకడ్బందీగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించేందుకు బహుళస్థాయి భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి అర్హత కలిగిన అభ్యర్థికి సమానమైన, న్యాయమైన అవకాశాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పరీక్ష విశ్వసనీయతను కాపాడేందుకు సాంకేతిక, బయోమెట్రిక్ ధ్రువీకరణ, సిసి కెమెరాల పర్యవేక్షణ, కేంద్రస్థాయి మానిటరింగ్‌తో పాటు పటిష్టమైన పరిపాలనా, భద్రతా చర్యలను చేపట్టామని, పరీక్ష ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, విశ్వసనీయంగా, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని సిఎండి పృథ్వీతేజ్ తెలిపారు.

## ఇక వ్యక్తికి 9 సిమ్‌ల వరకే అనుమతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశంలో మొబైల్ కనెక్షన్ల జారీలో నూతన నిబంధనలు అమలులోకి రానున్నాయి. ఈ నెల 24వ తేదీ నుంచి కేంద్రం దేశవ్యాప్తంగా వీటిని అమల్లోకి తీసుకుని రాబోతోంది దీనికి సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలు సైతం రూపొందించింది. ఒక వ్యక్తి తన పేరు మీద నిర్ణీత పరిమితి కంటే ఎక్కువ మొబైల్ కనెక్షన్లు కలిగి ఉంటే, వారికి నూతనంగా మరో సిమ్ కార్డు జారీ చేయకూడదని కేంద్రం టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. పరిమితి మించిన వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో కూడా నూతన సిమ్ అనేది ఇవ్వరు. వీటిని పూర్తిగా నిలిపివేయనున్నారు. తాజా టెలికాం నిబంధనల ప్రకారం దేశంలో ఒక పౌరుడు తన ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలపై గరిష్ఠంగా తొమ్మిది మొబైల్ కనెక్షన్లను మాత్రమే పొందేందుకు అనుమతి ఉంటుంది. జమ్మూ కాశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రత కారణాల రీత్యా ఈ పరిమితిని గరిష్ఠంగా ఆరు సిమ్ కార్డులుగా నిర్ణయించారు. ఆయా రాష్ట్రాల యూజర్లు ఆరుకు మించి ఎక్కువ సిమ్ కార్డులను పొందలేరు. వేర్వేరు టెలికాం కంపెనీల సిమ్ కార్డులను వాడుతున్నప్పటికీ కూడా మొత్తంగా ఉండాల్సిన కనెక్షన్ల సంఖ్య ఈ లిమిట్ దాట కూడదు. వినియోగదారులకు ఇప్పటికే నెట్వర్క్ లలో ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయనే విషయాన్ని రియల్ టైమ్ లో సరిపోల్చుకోవడానికి టెలికాం కంపెనీలకు కూడా డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ సెంట్రలైజ్డ్ డిజిటల్ డేటాబేస్ ఆధారంగానే నూతన కనెక్షన్ల కోరేవారి అర్హతను ఆపరేటర్లు పరిశీలిస్తారు. ఇప్పటికే గరిష్ఠ పరిమితిని దాటిన వినియోగదారులు మరో సిమ్ కార్డును పొందకుండా అడ్డుకోవడానికి దేశంలోని ప్రైవేట్, ప్రభుత్వ రంగానికి చెందిన టెలికాం సంస్థలు తమ సాంకేతిక, వ్యవస్థాగత మౌలిక వసతులలో మార్పులు చేపట్టాయి.

# బ్రిక్స్ ప్రతినిధులకు ఘనస్వాగతం

- భోగాపురం విమానాశ్రయంలో తెలుగు సంప్రదాయ రీతిలో ఆహ్వానం



**విజయనగరం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** విశాఖపట్నంలో ఆగస్టు 22, 23 తేదీల్లో నిర్వహించనున్న బ్రిక్స్ సదస్సుకు వివిధ దేశాల నుంచి విచ్చేస్తున్న ప్రతినిధులకు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విజయనగరం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా మేళతాళాలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో విదేశీ ప్రతినిధులకు ఆత్మీయ స్వాగతం పలికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పారు. ప్రతినిధుల రాక సందర్భంగా విమానాశ్రయంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బ్రిక్స్ సదస్సుకు సంబంధించి అందుబాటులో ఉన్న ప్రతినిధుల జాబితా ప్రకారం రష్యా, దక్షిణాఫ్రికా, చైనా, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, బ్రెజిల్ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. రష్యా తరఫున క్రీడల ఉప మంత్రి అలెక్సీ మొరోజోవ్, చైనా తరఫున క్రీడల సాధారణ పరిపాలనా సంస్థ ఉప మంత్రి కుయ్ జియాన్, దక్షిణాఫ్రికా తరఫున క్రీడలు, కళలు, సంస్కృతి శాఖ ఉప మంత్రి పీస్ మాబే, ఈజిప్ట్ తరఫున కౌన్సిలర్ మొహమ్మద్ ఖాటర్, ఇండోనేషియా ప్రతినిధి బృందానికి కాన్సుల్ జనరల్ ఎడీ వార్డోయో తదితరులు ఉన్నారు. అలాగే ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, బ్రెజిల్ దేశాల నుంచి కూడా ప్రతినిధులు హాజరవుతున్నారు. భారత దేశం తరఫున కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ, కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, క్రీడల కార్యదర్శి హరి రంజన్ రావు పాల్గొంటున్నారు. భోగాపురం విమానాశ్రయంలో ప్రతినిధులకు జిల్లా హౌసింగ్ పిడి మురళీ మోహన్, జిల్లా టూరిజం అధికారి పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తదితర అధికారులు స్వాగతం పలికారు. విదేశీ ప్రతినిధులకు భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలను పరిచయం చేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా విమానాశ్రయానికి వస్తున్న ప్రతినిధులకు అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టింది.

# తప్పుడు ఆర్థిక లావాదేవీలతో యుబిఐకే టోకరా

- షెల్ కంపెనీల పేరుతో రూ.26 కోట్లు రుణం
- విజయవాడలో ఓ కార్పొరేట్ సంస్థ దురాగతం
- రంగంలోకి సిబిఐ... పలువురిపై కేసు నమోదు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ఓ కార్పొరేట్ సంస్థ తప్పుడు ఆర్థిక లావాదేవిలతో ఏకంగా యుబిఐకే టోకారా వేసింది. రికార్డుల్లో తప్ప ఎటువంటి ఆర్థిక నిధులు లేని షెల్ కంపెనీల పేరుతో రూ.26 కోట్లు యుబిఐ నుంచి రుణంగా తీసకుంది. ఆలస్యంగా ఈ వ్యవహారాన్ని గుర్తించిన యుబిఐకి ఇటీవల సీబీఐకి ఫిర్యాదు చేసింది. పిర్యాదును అనుసరించి వాస్తవాలు విచారించి ఆ సంస్థ బాధ్యులపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో విచారణలో సీబిఐ పలు కీలకంశాలు గుర్తించింది. యూబీఐ ఏజీఎం శ్రీకాంత పాత్రో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ1), డైరెక్టర్లైన కోట భాను ప్రసాద్ (ఏ2), కోట శ్రావణి (ఏ3), కోట పృథ్వీ వెంకట తేజ (ఏ4), కోట రాహుల్ సాయి బాలాజీ (ఏ5)తో పాటు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులను ఇందులో నిందితులుగా సీబీఐ చేర్చింది. ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 2017లో ఏర్పాటైంది. గాల్వనైజ్డ్ పైపులు, ఇతర ఉక్కు ఉత్పత్తులను తయారు చేస్తుంది. 2024లో కంపెనీ డైరెక్టర్లైన కోట భాను ప్రసాద్, కోట శ్రావణి, కోట పృథ్వీ వెంకట తేజ, కోట రాహుల్ సాయి బాలాజీ తప్పుడు ఆర్థిక నివేదికలు, ఇతర పత్రాలతో నగరంలోని సూర్యారావుపేటలోని యూబీఐ శాఖను సంప్రదించారు. గతంలో కరూర్ వైశ్యా బ్యాంకులో తీసుకున్న రుణాన్ని యూబీఐకి బదిలీ చేసుకున్నారు. డైరెక్టర్లు సమర్పించిన దరఖాస్తులు, పత్రాల ఆధారంగా యూబీఐ, 2024, ఫిబ్రవరి 22న రూ. 24 కోట్ల విలువైన రుణం మంజూరు చేసింది. దీనికి హామీగా సరకు, ప్లాంట్, యంత్రాలను పెట్టారు. 2025, మే 17న రుణాన్ని రెన్యువల్ చేశారు. ఆ సమయంలో యూనిట్‌ను తనిఖీ చేయగా, గణనీయమైన తేడా కనిపించింది. రూ.23.85 కోట్ల సరకుకు గాను అక్కడ రూ. 25 లక్షల విలువైన నిల్వలు మాత్రమే ఉన్నాయి. స్టాక్ ఆడిట్‌లోనూ తేడాలను గుర్తించారు. టాటా క్యాపిటల్ ఫైనాన్స్ సర్వీసెస్ నుంచి తీసుకున్న రూ.2.10కోట్ల రుణం గురించి వెల్లడించకుండా దాచిపెట్టారు. రుణం మంజూరైన తేదీ నుంచి ఆరు నెలల్లోనే ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేశారు. యాజమాన్య మార్పునకు సంబంధించి సంబంధిత ముందస్తు అనుమతి కూడా పొందలేదు. ఆ ఇద్దరు డైరెక్టర్లు మెస్సర్స్ నెర్రో స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ఒక కొత్త కంపెనీని ప్రారంభించారు. దీనికి కెనరా బ్యాంకులో రూ. 6 కోట్లు చెల్లించాల్సిన రుణం కూడా ఉంది. అనుమతి లేకుండానే ఆడిటర్లను కూడా మార్చారు.

బ్యాంకుకు సమాచారం ఇవ్వకుండా యూనిట్ నుంచి స్టాక్‌ను తరలించారు. ప్రధాన చెల్లింపులు మారుతీ ట్రేడర్స్ పేరు మీద జరిగాయి. రూ. 67.54 కోట్ల రుణాలలో రూ. 32.19 కోట్ల మేర ఎక్కువ జమలు దుర్గా భవానీ స్టీల్స్ పేరున జరిగాయి. వీటిని వ్యాపారంలో చూపించలేదు. ఈ రెండు సంస్థలు 2024 సంవత్సరంలో ఏర్పాటయ్యాయి.

ఇంకా కార్యకలాపాలు కూడా ప్రారంభించలేదు. కంపెనీ రుణ అర్హతను పెంచుకునేందుకు, నిధులను పక్కదారి పట్టించేందుకు, టర్నోవర్‌ను కృత్రిమంగా పెంచేందుకే వీటిని ఉపయోగించారు.

వడ్డీ చెల్లించకపోవడంతో పెరిగిపోయి రూ.26.05 కోట్లకు బకాయిలు చేరాయి. దీని వల్ల బ్యాంకుకు నష్టం వాటిల్లింది. ఈ ఘటనకు సంబంధించి సిబిఐ జరుపుతున్న విచారణలో పలువురు ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. అయితే వారి వివరాలను సేకరించే పనిలో సిబిఐ ఉంది.

# పరిశోధనలో నాణ్యతే విజయానికి బాట

- ఇస్రోతో అపోలో సాంకేతిక భాగసామ్యం
- వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్



**చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:** అంతరిక్ష పరిశోధనలో భారత్ సాధిస్తున్న విజయాలు దేశ ప్రతిష్టను ప్రపంచ వేదికపై నిలబెడుతున్నాయని, నాణ్యమైన పరిశోధన, నైతిక విలువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతోనే అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధ్యమని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్ పేర్కొన్నారు. పరిశోధన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పరిశోధన నుండి ప్రచురణ వరకు' అనే రెండు రోజుల వర్క్‌షాప్‌ను అపోలో యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నితిన్ ఎం.నాగర్కర్ అపోలో యూనివర్సిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో తన ప్రస్థానంలో అనేక విజయాలు నమోదు చేసుకుని ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. చైనా, అమెరికా దేశాల తరువాత అంతరిక్ష రంగంలో భారత్ మూడవ స్థానంలో నిలవడం విశేషమన్నారు. త్వరలోనే అపోలో విశ్వవిద్యాలయం ఇస్రోతో సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో భారత్ అంతరిక్ష పరిశోధనలో మరింత ముందడుగు వేస్తూ మంగళ, శుక్ర గ్రహాలపై మరిన్ని ప్రయోగాలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇస్రో శాస్త్రవేత్త పూజా సింగ్ చంద్రయాన్-3తో సహా పలు ఉపగ్రహ మిషన్లలో కీలకంగా పనిచేసిన తన అనుభవంను విద్యార్థులతో పంచుకున్నారు. ఉపగ్రహ వ్యవస్థల అభివృద్ధి, కృత్రిమ మేధస్సు ఆధారిత మోడళ్ళ వినియోగం, ఉపగ్రహ పరీక్షల సమయంను తగ్గించే సాకేంతిక పరిష్కారాలపై తాను పని చేశానన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్. ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, డీన్లు ప్రొఫెసర్ కె.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ రామయ్య ఇటుమల్ల, డాక్టర్ డి.జగదీషన్, అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయంతి తదితరులు పాల్గొన్నారు.




# ఆత్మ నిర్భరత, యువత ఆకాంక్షలపై సమన్వయ బైఠక్‌లో చర్చించాం

- దేశం, సమాజం భవిష్యత్ సవాళ్లపై చింతనమంథనం

**విశాఖపట్నం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రేరణతో పనిచేస్తున్న వివిధ సంస్థల మూడు రోజుల అఖిల భారతీయ సమన్వయ బైఠక్ విశాఖపట్నం సమీపంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ ఆవాసీయ విద్యాలయ ప్రాంగణంలో శుక్రవారం సమాప్తమైంది. సమాజం, దేశం కోసం వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘ్ ప్రేరిత సంస్థల ప్రముఖ బాధ్యులు, కార్యకర్తలు ఈ బైఠక్‌లో పాల్గొన్నారు. బైఠక్‌కు మొత్తం 326 మంది ప్రతినిధులను ఆహ్వానించారు. వీరిలో వివిధ సంస్థలకు చెందిన మహిళా నాయకత్వం కూడా ఉంది. మూడు రోజుల బైఠక్‌లో 49 మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైఠక్‌లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబళే ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు సంఘ్ ప్రేరిత వివిధ సంస్థలకు చెందిన జాతీయ స్థాయి ప్రముఖ కార్యకర్తలు, నాయకత్వం బైఠక్‌లో పాల్గొన్నారు. మూడు రోజులపాటు దేశం, సమాజంలోని ప్రస్తుత పరిస్థితులు, వివిధ సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు, వాటి అనుభవాలు, భవిష్యత్ సవాళ్లు, రాబోయే కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది.

### ప్రధాన అంశాలపై చర్చ చింతనమంథనం

ప్రకృతి వైపరీత్యాల సమయంలో సమాజ ఆధారిత సేవా, పునరావాస కార్యక్రమాలను బైఠక్‌లో సమీక్షి ఒచారు. అసోంలో సంభవించిన తీవ్రమైన వరదల సమయంలో రాష్ట్రీయ సేవా భారతి, భారతీయ కిసాన్ సంఘ్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఒ), ఆరోగ్య భారతి సహా వివిధ సంస్థలు, కార్యకర్తలు చేపట్టిన సహాయ, పునరావాస కార్యక్రమాల వివరాలను పంచుకున్నారు. సంత్ రవిదాస్ 650వ జయంతి సందర్భంగా, వారి సందేశం ఆధారంగా సామాజిక సమరసత, సామాజిక సౌహార్దం కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలు, సమాజం నుంచి లభించిన సానుకూల స్పందనను సమీక్షి ఒచారు. ఈ దిశగా పనిని నిరంతరం మరింత విస్తరించడంపై చర్చించారు.

### యువత ఆకాంక్షలు, ఆందోళనలపై ప్రత్యేక చర్చ

యువత ఆలోచనలు, ఆకాంక్షలు, సృజనాత్మక సామర్థ్యం, భవిష్యత్‌కు సంబంధించిన ఆందోళనలు, దేశ నిర్మాణంలో వారి పాత్రపై విస్తృతంగా చర్చ జరిగింది. సంఘ్ కార్యం పెద్ద సంఖ్యలో యువత మధ్య కొనసాగుతోంది. ఈ సంవత్సరం సంఘ్ నిర్వహించిన 21 రోజుల శిక్షణ వర్గల్లో సుమారు 21,000 మంది యువ స్వయంసేవకులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రోజువారీ శాఖలకు హాజరవుతున్న స్వయంసేవకుల్లో 60శాతానికి పైగా యువతే ఉన్నారు. యువతతో కేవలం ఉపదేశాత్మక సంభాషణకు బదులుగా వారితో ప్రత్యక్షంగా అనుసంధానం కావడం, వారి భావాలు, ఆందోళనలను అర్థం చేసుకోవడం, సంభాషణ ద్వారా దేశం, సంస్కృతి, సామాజిక విలువల పట్ల ఆత్మీయతను పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు.

### పంచ పరివర్తన్, కుటుంబ ప్రబోధన

సంఘ్ శతాబ్ది సంవత్సరం నేపథ్యంలో సమాజ పరివర్తన కోసం నిర్దేశించిన 'పంచ పరివర్తన్'లోని వివిధ అంశాలపై బైఠక్‌లో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా కుటుంబ ప్రబోధన్‌లో భాగంగా భారతీయ కుటుంబ వ్యవస్థ, కుటుంబ విలువలు, తరతరాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక సంప్రదాయాలను బలోపేతం చేయాల్సిన అవసరంపై చర్చించారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో కేవలం తీర్మానాలు చేయడానికి పరిమితం కాకుండా ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం రోజువారీ జీవితంలో మార్పులు తీసుకు రావాలని నొక్కిచెప్పారు. నీటిని వివేకవంతంగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి అంశాలు ప్రతి కుటుంబం ఆచరణలో భాగం కావాలని పేర్కొన్నారు.

## నేడు విజయనగరం జిల్లాలో సిఎం పర్యటన

**విజయనగరం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 22వ తేదీన విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు నుండి బయలుదేరి సాయంత్రం 4.10 గంటలకు ఎల్.కోట మండలం ఎల్.కోట గ్రామంలోని హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. అనంతరం 4.15 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో ఎల్.కోట గ్రామంలోని శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి నివాసానికి బయలుదేరి, 4.20 నుంచి 4.40 గంటల వరకు ఆమె నివాసంలో జరుగు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 4.40 గంటలకు ఎమ్మెల్యే నివాసం నుంచి బయలుదేరి 4.45 గంటలకు ఎల్.కోట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 4.50 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం బయలుదేరి, సాయంత్రం 5.05 గంటలకు నేవల్ కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. విశాఖపట్నంలో సాయంత్రం 5.45 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నోవోటెల్ హోటల్‌లో నిర్వహించే 2వ బ్రిక్స్ యూత్ స్పోర్ట్స్ మినిస్టీరియల్ మీటింగ్స్-2026, సాంస్కృతిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం రాత్రి 9.30 గంటలకు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, 9.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని, పర్యటన విజయవంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

### మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా

## పట్టణాభివృద్ధి సంస్థలు ఏర్పాటు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా కొత్తగా మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా పట్టణాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ఏర్పాటు చేసిన మొత్తం 11 యూడీఏల పరిధుల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. తిరుపతి, విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్డీఏ), పుట్టపర్తి, నెల్లూరు, ఒంగోలు, ఏలూరు, కర్నూలు, కాకినాడ, మచిలీపట్నం, కడప, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థల పరిధులను కొత్త జిల్లాలకు అనుగుణంగా సవరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం మరో మూడు యూడీఏల పేర్లను ప్రభుత్వం మార్చింది.

చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ పేరును చిత్తూరు, పలమనేరు, కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ (సీపీకేయూడీఏ)గా, పలమనేరు, కుప్పం, మదనపల్లె యూడీఏను (అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ)గా మార్పు చేశారు. అనంతపురం, హిందూపురం యూడీఏను (అనంతపురం పట్టణాభివృద్ధి సంస్థ)గా నామకరణం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్ల నిర్మాణం, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం మెరుగు తదితర విషయాలపై దృష్టి సారించనుంది. అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సర్కార్ మంజూరు చేయనుంది. అంతేకాక నగర ప్రాంతాల్లో ఉద్యానవనాలు అభివృద్ధి, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

పట్టణాభివృద్ధి సంస్థల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత జిల్లా వ్యవస్థకు అనుగుణంగా, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా యూడీఏల నిర్మాణాన్ని ఆచరణాత్మకంగా మార్చామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో పట్టణాభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని నారాయణ పేర్కొన్నారు.

### ఎస్‌బిఐ సిబ్బంది నివాస గృహ సముదాయం

## సిఆర్‌డిఏతో పూర్తయిన అగ్రిమెంట్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో ఎస్‌బిఐ సిబ్బందికి నివాస గృహ సముదాయం నిర్మించేందుకు ముందడుగు పడింది. దీనికి సంబంధించిన భూ అగ్రిమెంట్ ఎస్‌బిఐ, సీఆర్‌డిఏ(క్రడా) మధ్య పూర్తయింది. ఈ మేరకు సంబంధిత పత్రాలను క్రడా ఎస్టేట్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ జుబిన్ రాయ్, ఎస్‌బిఐ ఏజిఎం అధికారిజి.రామకృష్ణకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేశారు. రాజధాని అమరావతిలో ఎస్‌బిఐ తన ప్రాంతీయ కార్యాలయాన్ని లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం పరిధిలో 3 ఎకరాలలో నిర్మించనుండగా కార్యాలయ నిర్మాణ పనులకు గౌరవ కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ గత ఏడు నవంబర్‌లో శంకుస్థాపన చేసియున్నారు. ఈ మేరకు అమరావతిలోని ఎస్‌బిఐ సిబ్బంది నివసించేందుకు వీలుగా అమరావతిలోని ఐనవోలులో 2.05 ఎకరాలలో ఎస్‌బిఐ నివాస గృహాలను నిర్మించనుంది. దీనికై ఎస్‌బిఐ క్రడా తో తాజాగా అగ్రిమెంట్ కుదుర్చుకుంది. అమరావతిని జాతీయ స్థాయిలో ఆర్థిక పరిపాలనా కేంద్రంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే కార్యాచరణలో, ఈ అగ్రిమెంటుతో కీలకమైన ముందడుగు పడింది. రూ.214 కోట్లతో నిర్మించనున్న ఈ నివాస సముదాయంలో 4.46 లక్షల చదరపు అడుగుల బిల్ట్ అప్ ఏరియాతో నిర్మాణం జరుగుతుందని, జూన్ 2027లో పనులు ప్రారంభించి 2028లోపు నివాస సముదాయాలను పూర్తి చేస్తామని ఎస్‌బిఐ అధికారులు తెలిపారు.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు
(CIN: L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

అది ఇలా ఉండగా, క్రింది సంతకందారుడు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయినందున "సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002" క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002తో చదువబడే సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, రిఫరెన్స్ నం.: **CB/SAR/13-2/ BB/DEC-2025/01** రుణ ఖాతా నం. **240626215831 4262** ప్రకారం రుణగ్రహీత/హామీదారు/ తనఖాదారులు **M/s అభినవ్ ఏజెన్సీస్ దాని యజమాని శ్రీ ఏచెర్ల మాధవ వర్మ (రుణగ్రహీత) ద్వారా, శ్రీ ఏచెర్ల మాధవ వర్మ S/o శ్రీ అప్పలరాజు ఏచెర్ల (హామీదారులు/తనఖాదారు) శ్రీమతి ఏచెర్ల ప్రేమకుమారి W/o శ్రీ అప్పలరాజు ఏచెర్ల (హామీదారు)** రుణ ఖాతా నం.**2406262158314262**కు **రూ.93,23,561/- (రూపాయలు తొంభై మూడు లక్షల ఇరవై మూడు వేల ఐదు వందల అరవై ఒకటి మాత్రమే) 29.11.2025** మొత్తంగా కూడుకున్న బకాయి మొత్తం (ప్రిన్సిపల్, వడ్డీ, పెనాల్టీలు మరియు అన్ని ఇతర ఛార్జీలు కలుపుకొని) సదరు నోటీస్ అందిన తేదీ/నోటీస్ యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా పూర్తి చెల్లింపు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో నోటీసులో పేర్కొనబడిన సొమ్ము తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ **01.12.2025** తేదీ గల డిమాండ్ నోటీస్ జారీ చేసారు.

రుణగ్రహీత/హామీదారు/తనఖాదారుడు సొమ్ము తిరిగి చెల్లించటంలో విఫలమైనందున **2026 సంవత్సరం యొక్క ఆగస్టు యొక్క ఈ 17వ రోజున** సదరు నిబంధనలు యొక్క నిబంధన 8 తో చదువబడు సదరు చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఇక్కడ క్రింద వివరింపబడిన ఆస్తి దిగువ సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నట్లు రుణగ్రహీత/తనఖాదారునకు, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించడమైనది.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందటానికి లభ్యమయ్యే సమయానికి సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాట్లు గురించి రుణగ్రహీత/హామీదారు దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీత/హామీదారుడు/తనఖాదారులు ప్రత్యేకంగాను, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదు. మరియు ఆస్తితో ఏమైనా లావాదేవీలు జరిపినట్లయితే రుణ ఖాతా నం. **2406262158314262 రూ. 1,02,40,043/- (రూపాయలు ఒక కోటి రెండు లక్షల నలభై వేల నలభై మూడు మాత్రమే) 14-08-2026** నాటికి మరియు తదుపరి వడ్డీ మరియు దానిపై ఖర్చులు పూర్తి చెల్లింపు వరకు **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క చార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

**స్థిరాస్తుల యొక్క వివరణ**

ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా, కొత్త వలస జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం యొక్క పరిధిలో "లియో రిసార్ట్స్" ఫేజ్-2 యొక్క పేరిట ఫైల్ నం.1167/0038/LP/VMRDA/2021 తేది: 02.07.2021 మరియు L.P. No.33/2021/1167/VMRDA/DPMS, వైస్ ఛైర్మన్ VMRDA యొక్క ప్రొసీడింగ్ ప్రకారం- విజయనగరం జిల్లా, కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ పరిధి, లక్కవరపుకోట మండలం, లక్కవరపుకోట తలారి గ్రామం, తలారి గ్రామ పంచాయతీలో సర్వే నం. 100/11Pలో, 253 సం. కలిగిన ప్లాట్, 533.33 చ.గ. లేదా 445.86 చ.మీ. ఖాళీ స్థలం యొక్క ప్లాట్ స్థిరాస్తి యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ కట్టడాలతోసహా, మొత్తం అదంతా. శ్రీ ఏచెర్ల మాధవ వర్మచే స్వంతం.

సరిహద్దులు: తూర్పు: కంపెనీ భూమి, పడమర: 40 అ. రోడ్, ఉత్తరం: ప్లాట్ నం.254, దక్షిణం: ప్లాట్ నం.252.

తేది : 17.08.2026 — అధీకృత అధికారి
ప్రదేశం : విజయనగరం జిల్లా, ఆం.ప్ర — AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

మనుషుల్ని యథాతథంగా అంగీకరించాలి, ఫలానా రకంగా ఉంటేనే అంగీకరిద్దాం అనికాదు.

- న- ఫ్రాంజ్ స్క్యూబర్ట్

# ఖజానాకు 'ఉచిత' కుదుపులు!

దేశంలో పేదరికం తగ్గిందని చెప్తున్న లెక్కలు విస్తుపోయేలా ఉన్నాయి. స్వాతంత్య్రం వచ్చి 79ఏళ్లనిండిన పరిస్థితుల్లో పేదరికం తగ్గిందని చెప్పుకోకపోతే నవ్వులాటగా ఉంటుంది. కనుక వాటిని కాసేపు ఒప్పుకుంటేనే మంచిది. కాగా దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి అభ్యున్నతికి చేసే ఏ ప్రయత్నమైనా హర్షిందగినదే. నిజమైన నిరుపేదలకు అందాల్సిన ఉచిత వరాలకు ఊపిరిపోస్తే చాలీచాలని బతుకులకు కడుపునింపినట్లే అవుతుంది. ఒకనొక దశ వరకే ఉచితాలని, లబ్ధికలిగించే ఏ ప్రయోజనాన్ని అందించి వారిప్రగతికి బాటలు వేయడాన్నిఎవరూ కాదనలేరు. కానీ కారులో వచ్చి రేషన్ బియ్యంతీసుకునే వారికి ఇక అలాంటి సౌకర్యాలు పొడిగిస్తేసమంజసమా? అసమంజసమా తేల్చాల్సింది ఏలినవారే. కానీ అలాంటి వారు అత్యున్నత స్థాయికి ఎదిగినా వారికి ఇప్పటికీ ఉచితాలు అందుతూ ఉండటమే ఆశ్చర్య కరమైన విషయం. పేదరికం తగ్గిందంటూ ప్రకటన లిచ్చే విశ్లేషణలు కొనసాగించే ప్రస్తుత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పేదరికం నుంచి బయటపడిన వారికి ఇంకా లబ్ధి చేకూ ర్చడమే అనుచితంగా చెప్పుకోవాలి. ఒకప్పటి ఇరవై సూత్రాల కార్యక్రమం వంటి గరీబీ హఠావో పథకాలన్నీ పేదలను ద్దేశించి పెట్టుకున్న లక్ష్యాలే. అప్పట్లోనూ కొన్నిఅక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నా కాస్త తక్కువేనని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లోనూ దాదాపు 40 శాతం వరకు అనర్హుల పేర్లు జాబితాలో చోటుచేసుకున్నాయన్న విశ్లేషణలున్నాయి. ఆ తరువాత దాదాపు అన్నిపథకాలు గబ్బుపట్టిపోయాయి. ఈ నేపథ్యంలోనే ఉచితానుచితాల ప్రస్తావన, విశ్లేషణ విస్తృతంగా జరుగుతోంది. ఎంతో మంది మేధావులు సైతం ఉచితాలన్నీ అనుచితాలేనని అవేవీ సముచితాలు కావని చెప్పారు. ఇవన్నీ ఎలాఉన్నా ఉచితాలకోసం నిధులుమళ్లింపు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ఉచితాలు ఉచితమేనా? అన్న మీమాంసపైతెలంగాణ హైకోర్టు సమక్షంలో మరో చర్చ, విశ్లేషణ మొదలైంది. తెలంగాణ అమలవుతున్న కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధులు మళ్లింపు, నిధుల వినియోగంపై కాస్త అర్థవంతమైన విశ్లేషణలు బయటికొచ్చాయి. ఇందుకు సంబంధించిన అంశాలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం నిధుల నిర్వహణపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం పలు అభిప్రాయాలను వ్యక్తం చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయని, అందుచే పరిమితి లేకుండా ఇతరత్రా ఉచిత పథకాలకు మళ్లించడం వలన రాష్ట్ర ఆర్థికపరిస్థితి గందరగోళంలో పడటమేకాకుండా అట్టడుగు వర్గాలకు కేటాయించిన నిధుల వ్యవహారంలో మరింత విమర్శలకు గురవుతున్నాయి. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లతరబడి పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. పైగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించక పోవడానికి కారణం వారి సొమ్ము ఉచితాల పంపిణీకోసం మళ్లించడమే. ఈకారణం చేతనే అలా ఇబ్బందులు పడిన బాధితులు కూడా కోర్టులనాశ్రయిస్తున్నారు. అర్హులైన భూబాధితులకు చెల్లించేందుకు మొండి చెయ్యి చూపి శాసనసభ, ఆమోదం లేని ఉచితపథకాలకు వందల కోట్లు కేటాయించడం సరికాదంటూ కోర్టుఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాధనం మళ్లింపు కారణంగానే ఉండాలని, అనుచిత వ్యవహారాలను ప్రయారిటీగా భావించి ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటే చివరాఖరుగా నష్టపోయేది ప్రజలే. ప్రభుత్వ ఖజానాను ఇబ్బంది పెట్టే విధంగా విచ్చలవిడి ఉచితపథకాలకు నిధులుమళ్లించటంలో ఒక సక్రమమైన ఆలోచన ఉన్నట్లు కనపడదు. 40ఏళ్ల పాటుప్రభుత్వ సర్వీసు చేసిన రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజినీర్ తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేదని వేసిన పిటీషన్ విచారణలో జస్టిస్ నాగేష్ భీమపాక కొన్ని వ్యాఖ్యలు చేశారు. సంక్షేమ పథకాలు, ఆర్థికపరఅంశాలు ప్రభుత్వ విధానపర అంశాలే అయినా వాటి వలన కలిగే దుష్ప్రభావాలను గురించి పునరాలోచించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఉచిత కరెంటు, ఉచిత నీరు, ఉచిత బస్సు ప్రయాణం రైతు రుణమాఫీలు, సబ్సిడీలిచ్చే పథకాలపై విపరీత ఖర్చు చేస్తూ, దీర్ఘకాలపు సేవలందించిన ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడం దురదృష్టకరం. వెంటనే బకాయిలు విడుదల చేయాల్సిన ప్రయారిటీస్ పాటించాలని అవసర ముందని న్యాయమూర్తి హెచ్చరించారు. తాజా ప్రస్తావనలో ఉచితానుచితాల అర్హతలు అనర్హతలు కన్నా ఉచితాల కోసం మరోఅభివృద్ధికి కేటాయించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ చెల్లింపునిధులను దారిమళ్లిస్తే భూ సేకరణ పరిహారానికి సంబంధించి 19 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా నిధుల సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని న్యాయమూర్తి చెప్పడం చూస్తే ప్రభుత్వం నిధుల మళ్లింపులో సమంజసమైన రీతిలో వ్యవహరించలేదని అర్థమౌతుంది. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై ప్రభుత్వం 2014నుంచి జారీ చేసిన ఎనిమిది జీవోలను ప్రశ్నిస్తూ దాఖలైన పిటీషన్‌పై జస్టిస్ ఎన్‌వి శ్రవణ్‌కుమార్ విచారించారు. ప్రజల సొమ్మునే సంక్షేమ పథకాలకు వెచ్చిస్తూ చట్టబద్ధంగా చెల్లించాల్సిన బకాయిలను చెల్లించలేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రజల హక్కులను పరిరక్షిం చడంతోపాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలను కాపాడేవిధంగా ప్రభుత్వ విధానాలను విశాలదృక్పథంతో నిర్ణయించాల్సి ఉంటుంది తప్ప అప్పు చేసి పథకాలనుఅమలు చేసే దుస్థితి కొనసాగకూడదని ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. చట్టబద్ధమైన విధానాల అమలులో నిర్ణయాలు తగు విధంగా ఉండకపోతే విమర్శలు తలకెత్తుకోవడమంటే ఇదేనేమో!



అతిగా జాగ్రత్త పడడం దౌర్భాగ్యుని లక్షణమైతే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అవివేకి లక్షణం.

సెసిల్



నీ తప్పులను, నీ తెలివి తక్కువ పనులను నీ ముందు నిదానంగా నివేదించేవాడే నిజమైన స్నేహితుడు.

జాన్ రస్కిన్

# ప్రజావాక్కు

## అగ్నిమాపక సదుపాయాలు కల్పించాలి

దైవదర్శనం కోసం పుణ్యక్షేత్రాలకు వెళ్లిన భక్తులు దేవుడిని దర్శించకముందే ప్రాణాలు కోల్పోవడం కంటే విషాదకరమైన ఘటన మరొకటి ఉండదు. పశ్చిమ బెంగాల్‌లోని తారాపీఠ్ ఆలయం సమీపంలోని హోటల్‌లో అగ్ని ప్రమాదంలో ఏడుగురు భక్తులు సజీవదహనం కావడం, బిహార్‌లోని అశోక్‌ధామ్ ఆలయం సమీపంలో తొక్కిసలాటలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, పుణ్యక్షేత్రాల్లో భద్రతా ప్రమాణాలపైమరోసారితీవ్రంగా ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. దేశంలోని ప్రముఖ ఆలయాలు, పుణ్యక్షేత్రాలకు ఏడాదిపొడవునా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాలు, జాతరల సమయంలో ఈ రద్దీ అనూహ్యంగా పెరుగుతుంది. ఇంతటి జనసందోహాన్ని నిర్వహించేందుకు తగిన ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, అత్యవసర స్పందనా వ్యవస్థలు, అగ్నిమాపకసదుపాయాలు, వైద్యసేవలు, శిక్షణ పొందినసిబ్బంది అందుబాటులోఉన్నదాన్నదేకీలక ప్రశ్న.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

## జీవో 97ను రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి స్కీమ్ వల్లమొదటగా పాలిటెక్నిక్‌విద్యార్థులు మోసపోతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతీ యువకులకు ఉద్యోగాలు లేక నిరుద్యోగంతో అల్లాడుతున్నారు. పేద మధ్య తరగతి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలోపెట్టుకుని వృతివిద్యాకోర్సులు చేసి త్వరగా స్థిరపడి కుటుంబానికి అండగా నిలబడాలని పాలిటెక్నిక్‌లాంటికోర్సులు చదివిప్రభుత్వ,ప్రైవేటురంగ సంస్థలలో ఉద్యోగాలు చేయాలని తాపత్రయ పడుతూ పాలిటెక్నిక్ విద్యనుఅభ్యసించి ఇంజనీర్‌లుగాసేవలు అందిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఫీజురాయితీ ఇవ్వకుండా పాలిటెక్నిక్‌లో 140శాతం ఫీజులు పెంచింది. ఇప్పటికైనా ప్రభుత్వం పునర్‌ఆలోచించి శక్తిస్కీమ్ రద్దు చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## సాంకేతికత పట్ల అవగాహన అవసరం

నేడు సమాజంలో ప్రతి పనికి సాంకేతికత వినియోగం ఎక్కువైంది. కావున ప్రతి విషయంలో సాంకేతికత పట్ల అవగాహన పెంచుకుని మన పనులకు ఇతరులపై ఎక్కువగా ఆధారపడకుండా మనమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

## మత్తు పదార్థాలు మానివేస్తే మంచి భవిష్యత్తు

చిన్నా పెద్దా తేడాలేదు, మంచీచెడు తారతమ్యత లేదు. గురుశిష్యుల సంబంధాలు దెబ్బతింటున్నాయి. తండ్రీ కొడుకులకు తగాదాలుపెడుతున్నాయి. అన్నదమ్ముల ఆప్యాయతలు నశిస్తున్నాయి. కుటుంబాలు వికలమోతున్నాయి. వీటికి ప్రధాన కారణం మత్తు పదార్థాలు. సభ్యసమాజం ఛీత్కరించుకున్నా భూతంలా వెంటాడుతన్నవి. నేడు మత్తు పదార్థాల (డ్రగ్స్) వినియోగం యువతను, విద్యార్థులనుతీవ్రంగా నాశనం చేస్తోంది. ఇది సమాజంలో నేరాలకు, అనారోగ్యానికి, కుటుంబాల ఛిన్నాభిన్నానికి ప్రధాన కారణమవుతున్నాయి. వీటిని నివారించడానికి కుటుంబం, పాఠశాలలు, ప్రభుత్వం, సమాజం కలిసికట్టుగా బలమైన చర్యలు తీసుకున్నప్ప టికీ చెదురు మదురు సంఘటనలు జరుగుతునే ఉన్నాయి. కావునచట్టాలను కఠినంగా అమలు చేయడం, యువతకు సరైన అవగాహన కల్పించడంద్వారానేఈమహమ్మారిని అరికట్టవచ్చు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## రచయితలను ఆదుకోవాలి

ఒక అక్షరం వేయి గుండెలను మేలుకొలుపుతుంది. ఒకపాట ఒక నియంతను గద్దె దింపుతుంది. ఒక పుస్తకం సమాజాన్ని జాగతృతంచేసి దేశ ప్రగతికి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బాటలు వేస్తుంది. పుస్తకాన్ని ఎటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంసహాయం లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా పాఠకుడు చదవబానికి అవకాశం ఉంది. అదే డిజిటల్ మాధ్యమానికి ఆ సౌలభ్యంలేదు. సమాజాన్ని సరైన పంథాలో పెట్టడానికి రాబోయే కాలంలో ప్రజలకు ఎదురయ్యే కష్టాలను ఏకరువు పెట్టడానికి రచయిత తన కాలాన్ని కత్తిలా ఉపయోగించి అక్షరయజ్ఞం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా తన విజ్ఞానాన్ని ఆర్థిక స్థోమతను వినియోగించి రచనలు చేసి ముద్రించి గ్రంథాలను విపణివీధిలోకి తెస్తున్నాడు.

- జి. నరసింహప్రసాద్, నాగారం

## పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష ్యంగా పారేయడంవల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేక వ్యాధులు వ్యాపించే ప్రమాదంఉంది. మన ఇల్లు ఎంత శుభ్రం గా ఉంచుకుంటామో, మన వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలు కూడా అంతే శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవద్దు!

**కోట్లాది రూపాయల ప్రజాధనం వ్యయమయ్యే పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చలకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని ప్రజాస్వామ్యవాదులే ఆవేదన చెందుతున్నారు. పాలకులు ప్రజాప్రతినిధులమనుకునేవారు ప్రజాధనానికి కాపలాదారులమనే విషయాన్ని విస్మరించకూడదు. సమావేశాలకు ఒక్క నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల ప్రజాధనం వ్యయం అవుతున్న విషయం పెద్దలు గుర్తుపెట్టుకోవాలి. పార్లమెంటు ఉభయ సభల్లో జరుగుతున్న తీరు ప్రజాస్వామ్యవాదులకు ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. దేశంలో ఎన్నో రాష్ట్రాల శాసన, మండళ్ల సమావేశాలకు అనుకరణీయంగా, ఆదర్శంగా ఉండాల్సిన పార్లమెంట్ సమావేశాల పరిస్థితి ఇలా దిగజారడం అత్యంత దురదృష్టకరం. రాజకీయ వ్యవస్థపై విరక్తి కలుగుతున్నది. పరిపాలనా వ్యవస్థ పట్ల అవిశ్వాసం పెరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదకరం.**

దామెర్ల సాయిబాబ

ఎన్నో ప్రజాసమస్యలు, ప్రభుత్వ విధానాలు కూలంకషంగా చర్చించి నిర్ణయాలు తీసుకొని దేశ ప్రజలకు దిశ, దశ నిర్దేశించాల్సిన, ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మగా రాజ్యాంగానికి పుట్టినిల్లుగా భావిస్తున్న దేశ అత్యున్నతసభా సమావేశాలు ఎలాంటి చర్చలు జరగకుండానే గతవారంలో నిరవధికంగా వాయిదాపడడం ప్రజాస్వామ్య వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. భారత్ ప్రస్తుతం అనేక సమస్యలతో అట్టుడికిపోతున్నది. ముఖ్యంగా మొన్నటి కరోనా రక్కసి విలయతాండవాన్ని ఎదురొడ్డి నిలిచిన వ్యవసాయరంగం ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. దేశంలో కొన్నిచోట్ల కుంభవృష్టి, వరదలతోప్రజలు అల్లాడుతుంటే మరికొన్ని చోట్ల వర్షాలులేక వరుణ యాగాలు చేస్తూ పంటలను దక్కించుకునేందుకు అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇంకొకపక్క అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలతో నిరుపేదలే కాదు, సామాన్యలను, మధ్యతరగతి వర్గాలు అతలాకుతలమౌతున్నాయి. ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో తెలియని నల్ల ధన స్వాములకు ఏ వస్తువ ధర ఎంత పెరిగినా చీకుచింతా లేదు కానీ రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు, మధ్య తరగతి, జీతాల మీదనే ఆధారపడే వర్గాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ఇంకొక పక్క దేశంలో నిరుద్యోగ సమస్య విలయతాండం చేసున్నది. పరీక్షలు సమర్థవంతంగా ప్రభుత్వం నిర్వహించలేకపోవడంతో యువత ఉద్యమాల బాట పట్టింది. కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఇలాంటి ఎన్నో సమస్యలతో దేశం అతలాకుతలం అవుతుంటే మొన్న పంతొమ్మిది రోజులపాటు జరిగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ సమస్యల ప్రస్తావనే లేకుండా అధికార విపక్షాలు ఆందోళనల మధ్య పుణ్యకాలం గడిచిపోయింది. ఒక్కటంటే ఒక్క అంశం కూడా సమగ్రంగా సజావుగా చర్చలు లేకుండానే సమావేశాలు ముగిసిపోయాయి. సమావేశాల కాలం కూడా యేడాదియేడాదికి కుదించుకుపోతున్నది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగాతక్కువ సమయం ఈసారి సభలు జరిగాయి. చర్చలు లేకుండానే పది బిల్లులకు ఆమోదముద్ర వేస్తే కేవలం రెండు బిల్లుల పైన మాత్రమే కొంతలోకొంత చర్చ జరిగింది. ఒక బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అప్పగించారు. ముఖ్యమైన ప్రశ్నోత్తరాల సమయం ఒక్క రోజు కూడా నిర్వహించలేకపోయారు. పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనలపై పోలీసులు వ్యవహరించిన తీరు, అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగంపైఉభయ సభల్లో తీవ్రస్థాయిలో గందరగోళం జరిగింది. ప్రతిపక్షాల నినాదాలు, వాదోపవాదాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయ సభల కార్యకలాపాలకు రోజూ అంతరాయమే. వాయిదాలపర్వంతోనే సమావేశాలు కొనసాగాయి. రాజ్యసభలో చివరి రోజు జీరో అవర్ ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించిన అనంతరం ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగిన తీరుపై ఆందోళన వ్యక్తంచేశారు. సభ్యులు ఈ మహోన్నత సభా గౌరవాన్ని నిలబెట్టాలని భారత ప్రజాస్వామ్య అత్యున్నత సంప్రదాయాలకు అనుగుణంగా తమ పార్లమెంటరీ బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాలు నిరంతరం, గందరగోళం, తరచూ అంతరాయాలతో నిండిపోయి సభా కార్యకలాపాలు పదేపదే పట్టాలు తప్పడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ సమష్టిగా సభా కార్యక్రమాల్లో పాల్గొని విలువైన సూచనలు ఇచ్చి అర్థవంతమైన చర్చలు జరిపి ఉంటే పరిస్థితి కచ్చితంగా భిన్నంగా ఉండేదని ఛైర్మన్ వెల్లడించిన అభిప్రాయం ఎంతో ఆలోచించదగింది. ఇప్పుడేకాదు ఇంతకుముందు కూడా దేశ అత్యున్నత సభాసమావేశాలు ఇలా వాయిదాలతో కాలం గడవడం తరచుగా జరుగుతూనే ఉన్నది. రాష్ట్రాల్లో శాసన మండళ్ల సభాసమావేశాలు కూడా ఇందుకు భిన్నంగా జరగడం లేదు. కేవలం గుప్పెడు మంది సభ్యులు సమావేశానికి అంతరాయం కలిగించాలనుకుంటే వాయిదాలు వేయించడం పెద్ద సమస్యగా కన్పించడంలేదు. ఇక ప్రజాస్వామ్యంలో సమావేశాలకు సంబంధించి సర్వాధికారి స్పీకరే. ఇందుకు సభ్యులతోపాటు స్పీకర్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏ కోణంలో చూసినా అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన కుర్చీ అది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎందరో పెద్దలు ఆ పదవిని అధిష్టించి ఆ పీఠానికి వన్నె తెచ్చారు. ఏదో ఒకరిద్దరు తప్ప, ఒకటి, రెండు సందర్భాల్లో తప్ప ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిం చారు. సామాన్య ప్రజల్లో కూడా స్పీకరంటే ఇప్పటికీ ఎంతో గౌరవభావాలున్నాయి. పాలక పక్షాన్ని ఇబ్బంది పెట్టకుండా ఇటు ప్రతిపక్షాన్ని అసంతృప్తికి గురిచేయకుండా స్పీకర్ నిష్పక్షపాతంగా, చాకచక్యంగా వ్యవహరించాలి. ఇది కత్తిమీద సాములాంటిదే. సొంత పార్టీ ఆగ్రహానికి గురికాకుండా ప్రజాసమస్యలను సమగ్రంగా చర్చించేందుకు అవకాశం ఇస్తూ ప్రజాప్రయోజనాలను కాపాడుతూ అదేసమయంలో స్పీకర్ పదవికి పక్షపాత దృష్టి సోకకుండా వ్యవహరించాల్సిన చాలా క్లిష్టమైన బాధ్యత అది. చెప్పినంత సులభం కాదు. దీనికి ఎంతో ఓర్పు, నేర్పు, విషయ అవగాహన, అన్నింటికంటే మించి సమయస్ఫూర్తి ఎంతో అవసరం. ఇప్పటివరకు లోక్‌సభ స్పీకర్లుగా వ్యవహరించిన వారందరూ ఆ స్థాయిలో వ్యవహరించారని చెప్పలేం కానీ అధిక శాతం ఆ పదవికి వన్నె తెచ్చిన వారే. ప్రస్తుత స్పీకర్ ఓంబిర్లా బాధ్యతాయుతంగా సభ హుందాతనాన్ని నిలబెడుతూ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నా అటు ప్రతిపక్ష, ఇటు అధికార పక్ష నేతలను సమన్వయంతో నడిపించలేకపోతున్నారనేది ప్రజాస్వామ్యవాదుల ఆవేదన. ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు అధికార, ప్రతిపక్ష పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించి సామరస్యపూర్వకమైన పరిష్కారం కనుగొనే ప్రయత్నం త్రికరణశుద్ధిగా జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు స్పీకర్‌కు ఎన్నో అధికారాలున్నాయి. గతంలో సభానిర్వహణకు తరుచుగా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేకపోలేదు. సభా కార్యక్రమాల అజెండాకు ఎంత ప్రాముఖ్యత ఉందో వేరే చెప్పక్కర్లేదు. కోడెల కొట్లాటల్లో దూడల కాళ్లు విరిగినట్లు ఈ వ్యూహప్రతివ్యూహాల్లో నష్టపోయింది, పోతున్నది దేశప్రజలే. లోక్‌సభలో చర్చ జరిగినంత మాత్రాన ఈ సమస్యలన్నిటికి పరిష్కారం దొరుకుతుందని ఆశించడం లేదు. పార్లమెంటులో తమ ప్రతినిధులు తమ సమస్యల గూర్చి చర్చించారని ప్రజలకు కొంత ఊరట కలుగుతుంది. అసలు సమావేశాలే జరగన్వి కపోతే ఏమనుకోవాలి? ఎందుకోఏమోకానీ, కారణాలు ఎవరో, కారకులు ఎవరో కానీ దేశంలో సమావేశాల కాలం క్రమేణా తగ్గిపోతున్నది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత మొదటిలోక్‌సభ సగటున యేడాదికి 175రోజుల పాటు భేటీ జరిగింది. రెండో లోక్‌సభ 116కు, తొమ్మిదో లోక్‌సభ 85కు, పదిహేడోవ లోక్‌సభకు వచ్చేసరికి ఆ సంఖ్య 55కు పడిపోయింది. ఆ కొద్దిరోజులు కూడా ప్రజాసమస్యలపై నూతన విధానాలపై సమగ్ర చర్చ జరగకపోవడం బాధాకరం. కోట్లాది రూపాయల ప్రజాధనం వ్యయమయ్యే పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చలకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని ప్రజాస్వామ్యవాదులే ఆవేదన చెందుతున్నారు. పాలకులు ప్రజాప్రతినిధులమనుకునేవారు ప్రజాధనానికి కాపలాదారులమనే విషయాన్ని విస్మరించకూడదు. సమావేశాలకు ఒక్క నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల ప్రజాధనం వ్యయం అవుతున్న విషయం పెద్దలు గుర్తుపెట్టుకోవాలి. పార్లమెంటు ఉభయ సభల్లో జరుగుతున్న తీరు ప్రజాస్వామ్యవాదులకు ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. దేశంలో ఎన్నో రాష్ట్రాల శాసన, మండళ్ల సమావేశాలకు అనుకరణీయంగా, ఆదర్శంగా ఉండాల్సిన పార్లమెంట్ సమావేశాల పరిస్థితి ఇలా దిగజారడం అత్యంత దురదృష్టకరం. రాజకీయ వ్యవస్థపై విరక్తి కలుగుతున్నది. పరిపాలనా వ్యవస్థ పట్ల అవిశ్వాసం పెరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదకరం. ●

## ఒక్క మాట

# వరదలూ వస్తున్నాయి, నదులూ ఎండుతున్నాయి!

సి.హెచ్.ప్రతాప్

నది అంటే కేవలం ఒక చోటు నుంచి మరో చోటుకు ప్రవహించే నీరు కాదు, అది మనిషి జీవనానికి ఆధారం, వ్యవసాయానికి జీవనాడి, పరిశ్రమలకు వనరు, భూగర్భజలాల పునరుత్పత్తికి కీలక ఆధారం, పర్యావరణ సమతుల్యతకు ప్రాణధార. అయితే నదుల విషయంలో నేడు ఒక విచిత్రమైన విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. ఒక వైపు కొన్ని నదుల్లో ప్రవాహం క్రమంగా తగ్గుతుండగా, మరోవైపు అదే దేశంలో మరికొన్ని ప్రాంతాలు ఆకస్మిక భారీ వర్షాలు, వరదలతో మునిగిపోతున్నాయి. ఒకవైపు నీటి కొరత.. మరోవైపు నీటి విధ్వంసం ఈ వైరుధ్యం ప్రకృతి సృష్టించిన సమస్య మాత్రమేనా, లేక వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, సమర్థంగా వినియోగించడం, సమానంగా పంచడం, నదుల సహజ ప్రవాహాన్ని కాపాడటంలో మన లోపాలను కూడా ప్రతిబింబిస్తోందా? భారతదేశంలో నదుల పరిస్థితి ఒకే విధంగా లేదు. కేంద్ర జల సంఘం గణాంకాల ప్రకారం 2001-2011తోపోలిస్తే 2011-2021లో కృష్ణా నది సగటు ప్రవాహం 18.76 నుంచి 12.99 బిలియన్ క్యూబిక్ మీటర్లకు, కావేరి 6.97 నుంచి 4.35 బిలియన్ క్యూబిక్ మీటర్లకు తగ్గాయి. మరో వైపు గోదావరి ప్రవాహం 80.83 నుంచి 86.22 బిలియన్ క్యూబిక్ మీటర్లకు, నర్మద 18.95 నుంచి 23.34 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పెరిగాయి. కాబట్టి ప్రాంతాల వారీగా నీటి లభ్యత, వర్షపాతం, వినియోగం, ప్రవాహ మార్పులను అర్థం చేసుకోవడం అవసరం. అయితే ప్రమాద సంకేతాలు స్పష్టంగానే ఉన్నాయి. 2024 అంచనాప్రకారం భారత నదీ పరివాహక ప్రాంతాల్లో సగటువార్షిక జల వనరులు సుమారు 2,115.95 బిలియన్ క్యూబిక్ మీటర్లు. కానీ వినియోగానికి అందుబాటులో ఉండే నీరు సుమారు 1,137 బిలియన్ క్యూబిక్ మీటర్లకే పరిమితమవుతోంది. 2025లో తలసరి వార్షిక నీటి లభ్యత ఇప్పటికే నీటిఒత్తిడి సూచికగా పరిగణించే 1,700 క్యూబిక్ మీటర్లస్థాయి కంటే తక్కువగా ఉంది. ఈ పరిస్థితికి ఒకే కారణం లేదు. వాతావరణ మార్పు, అనిశ్చిత వర్షపాతం, అడవుల క్షీ ణత, నదీ పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాల పెరుగుదల, చెరువులు- కుంటల ఆక్రమణలు, భూగర్భజలాల అధిక వినియోగం, నీటి వృథా, కాలుష్యం పరస్పరం సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యంగా వర్షంపడే విధానం మారుతోంది. తక్కువ వ్యవధిలో అత్యంత భారీ వర్షం కురిసి వరదలు రావచ్చు. ఆ తర్వాత సుదీర్ఘ విరామం ఏర్పడి నదిలో ప్రవాహం తగ్గిపోవచ్చు. అంటే నీటి పరిమాణం కంటే దాని సమయం, స్థలం, నిల్వ సామర్థ్యం కూడా కీలకమవుతున్నాయి. భూగర్భజలాల పరిస్థితి ఈ సమస్యకు మరో అద్దం. 2025లో దేశంలో వార్షిక భూగర్భజలపునరుత్పత్తి 448.52 బిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా, వెలికితీయదగిన వనరు 407.75 బిలియన్ క్యూబిక్ మీటర్లు, మొత్తం వార్షిక వెలికితీత 247.22 బిలియన్ క్యూబిక్ మీటర్లు. దేశవ్యాప్తంగా భూగర్భజల వినియోగ స్థాయి 60.63 శాతంగా ఉంది. 6,762 అంచనా యూనిట్లలో730 యూనిట్లు ఇప్పటికే ఓవర్ ఎక్స్‌ప్లోయిటెడ్‌గా గుర్తించబడ్డాయి. అయితే భూగర్భజలం, నదులు వేర్వేరు వ్యవస్థలు కావు. నేలలోకి చేరే వర్షపు నీరు భూగర్భజలాలను పునరుత్పత్తి చేయడమే కాకుండా, ఎండాకాలంలో నదులకు చేరే సహజ బేస్‌ఫ్లోకు కూడా తోడ్పడుతుంది. కాబట్టి బోర్లు లోతుగా తవ్వడం మాత్రమే పరిష్కారం కాదు, నీరు నేలలోకి చేరే అవకాశాలను పెంచడమే అసలు పరిష్కారం. అందుకేనీటి నిర్వహణలో దృష్టి భారీప్రాజెక్టులపైనే కాకుండా పరివాహక ప్రాంతాల సమగ్ర సంరక్షణపై ఉండాలి. చెరువులు, కుంటలు, సరస్సులు, వాగులు పునరుద్ధరించాలి. వరద మైదానాలను రక్షి ంచాలి. పట్టణాల్లో వర్షపు నీరునేరుగా కాలువ ల్లోకి వెళ్లకుండా రీచార్జ్ వ్యవస్థలను విస్తరించాలి. వ్యవసా యంలో తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పద్ధతులను ప్రోత్సహించాలి. పరిశ్రమలు, నగరాలు శుద్ధిచేసిన వ్యర్థ జలాన్ని తిరిగి వినియోగించే విధానాన్ని విస్తరించాలి. అత్యంత ముఖ్యంగా వరద నిర్వహణ, కరవు నిర్వహణను రెండు వేర్వేరు సమస్యలుగా చూడటం మానాలి. ఒకేనీటి చక్రంలో భాగమైన ఈ రెండు పరిస్థితులకు ఒకే సమగ్ర పరిష్కారం అవసరం. వర్షం వచ్చినప్పుడు వరదగా పోకుం డా నిల్వచేయాలి. ఎండాకాలంలో అదే నీరునదులు, చెరువులు, భూగర్భజలాల ద్వారా అందుబాటులో ఉండేలా చూడాలి. నీటి సంక్షోభం ప్రకృతి వైపరీత్యంకాదు. నిర్వహణకు ఎదురైన పరీక్ష అని జలవనరుల శాస్త్రవేత్తలు అభిప్రా

# చట్ట సభల్లో బిసిలకు సాధికారత ఇంకెప్పుడు?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో చాలా రాష్ట్రాల్లో తరచుగా బీసీల సాధికారత పై చర్చ జరుగుతున్నది. ప్రధానంగా విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో చట్టసభల్లో రాజ్యాధికారం తోపాటు ఆర్థిక సామాజిక అనేక రంగాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బీసీ సామాజిక వర్గాలు ఎంతో కొంత వెనుకకు నెట్టివేయపడుతున్నాయనే సంశయం బీసీ వర్గాల్లో కొనసాగుతూ వస్తున్నది. దేశంలో ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా ప్రధాన రాజకీయ పార్టీలలో ఎక్కువగా ఉన్నత సంపన్న వర్గాల వారే అభ్యర్థులుగా ఉండడంతో చట్టసభల్లోకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు తగినంతగా రాలేకపోతున్నారని, దాదాపు అన్ని నియోజకవర్గాల్లో అత్యధిక శాతం ఉన్న బీసీలు కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. కారణాలేవైనా చట్ట సభల్లోకి వెళ్లాలంటే ప్రజల ఆదరణతో పాటు ఆర్థిక స్తోమత కలిగి ఉంటే సరిపోతుందనే రీతిలో ఎలక్షన్లు కూడా జరుగుతున్నాయానే అనుమానాలు సమాజంలో లేకపోలేదు. ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా ఓట్లు నోట్లతో కాకుండా స్వచ్ఛందంగా ఓటర్లు సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే రీతిలో ఉండాలి కానీ ఎన్నికల్లో కొందరు ఓటర్లు నోట్లతో తడబడుతున్నారేమో అనిపిస్తుంటుంది. సాధారణంగా దేశంలో అనేక రంగాల్లో శ్రామిక జీవనం గడుపుతున్న వాళ్లలో బీసీ, ఎస్సీ ఎస్టీలు మైనార్టీలతో పాటు వివిధ కులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారే ఉంటున్నారన్న భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, దేశంలో కుల ప్రాతిపదికన మిగతా కులాలతో పోలిస్తే ఉన్నత సంపన్న వర్గాలు ఎంతో కొంత పారిశ్రామిక రంగంలో ఆర్థిక వ్యవస్థలో మాత్రం బలోపేతంగా ఉంటున్నారనే భిన్న అభిప్రాయాలు తరచుగా వినిపిస్తుంటాయి. అడపా దడపా ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కూడా వివిధ సామాజిక వర్గాల అవసరాలను, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు రాష్ట్రాలలో ఏర్పాటు అవుతున్న ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పటికీ బీసీ వర్గాల స్థితిగతులు ఆశించిన స్థాయిలో లేవనే వాదనలు వినిపిస్తుండడంశోచనీయం. అందుకు చట్టసభల్లో వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన నాయకత్వం సరిపడా లేకపోవడం కూడా ఒకలోపంగా మారుతుందేమో. దీనివల్ల చట్టసభల్లో కొంత ఉన్నత వర్గాల నుండి గెలుపొందిన వారి ప్రాబల్యం ఉండడం ఒక ఎత్తైతే వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాలకు కావాల్సిన విధివిధానాలు రూపొందించాల్సి వచ్చే సందర్భాల్లో బీసీ సామాజిక వర్గాల ప్రాధాన్యత తగినంత ఉంటే బీసీకులాల వారికి మేలు జరుగుతుందనే నమ్మకం బీసీ సామాజిక వర్గాలలో ఉండడం మరోఎత్తు అవుతున్నది. అయితే ఒక వేళ




చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అనివార్యమైనా, కాకపోయినా మునుముందు బీసీ సామాజిక వర్గంవారు ఎలక్షన్లు వచ్చినప్పుడు రాజకీయ పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులకు మాత్రమే ఓట్లువేసి, గెలిపిస్తే తద్వారా చట్టసభల్లోకి బీసీలు అధిక సంఖ్యలో రాగలుగుతారని, రిజర్వేషన్ల గురించి వేచిచూడడం కన్నా బీసీలు ఐక్యంగా ఎలక్షన్లలో రాజకీయాలతో సంబంధం లేకుండా బీసీతరఫు నుండి పోటీ చేసే అభ్యర్థులకే ప్రాధాన్యత ఇచ్చే విధంగా బీసీ ఓటర్లు బీసీ అభ్యర్థులను చట్ట సభల్లోకి తీసుకుపోవాల్సిన ఆవశ్యకత ఉంటుందనే విషయమై కొంతమంది బీసీవర్గాల మేధావుల్లో, ప్రజల్లో చర్చ లేకపోలేదు. తెలంగాణ ప్రభుత్వం కూడా విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయఅంశాల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు విషయమై సానుకూలంగా ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనాభా లెక్కలు, కులగణన లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఎలక్షన్లు వచ్చేవరకైనా కుల ప్రాతిపదికన రిజర్వేషన్ల ప్రక్రియను చట్టసభలు ఆమోదించే విధంగా రాజకీయా లకతీతంగా అన్నిపార్టీలలో ఉన్న బీసీ ప్రతినిధులు మరింత ఐక్యతతో ప్రయత్నిస్తే కచ్చితంగా దేశవ్యాప్తంగా జనాభా కనుగుణంగా ఉన్నటు వంటి వెనుకబడిన తరగతుల కులాల వారి ప్రాతినిధ్యం చట్టసభల్లో మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసేవారు లేకపోలేదు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో రాబోవు కాలంలో బీసీల ప్రాధాన్యతను అన్ని రాజకీయ పార్టీలుమరింతగా గుర్తించేందుకు సాధికారత కోసం బీసీ సామాజిక వర్గంలోని కొంతమంది ప్రయత్నాలు ముమ్మరం చేస్తూనే, బీసీ రిజ ర్వేషన్ పెంపు బిల్లుపై ప్రధాన పార్టీలపై ఒత్తిడి పెంచుతూ బీసీ సామాజిక వర్గంలోని నాయకులనే ఆయా సామాజిక వర్గం ఓటర్లు ఎన్నుకునే విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడం గమనార్హం. రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ ఎలక్షన్లలోపు పూర్తిస్థాయిలో రిజర్వేషన్‌పెంపు బిల్లు సఫలీ కృతం అయితే దేశంలో బీసీ ప్రజలు ఓటు బ్యాంకుగానే కాకుండా రాజ్యాధికారంలో తమవంతు పాత్రను పోషించడంతోపాటు, వెనుకబడిన తరగతుల కులాలసాధి కారత దిశగా బీసీ ప్రజల అభ్యున్నతికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనిఅంచనా. ఏదిఏమైనప్పటికీ వాస్తవ పరిస్థితులు ఎలాఉన్నా వెనుకబడిన తరగతుల కులాలు చట్టసభలో రాజకీయంగా బలపడేందుకు ప్రయత్నిస్తుండడంతో రాజకీయపార్టీలు కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర సామాజిక వర్గాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యత కల్పించేదిశగా ప్రత్యేక దృష్టి సారిస్తుండడం గమనార్హం. తద్వారా జనాభా ప్రాతిపదికన ఆయా సామాజిక వర్గాలకు చెందిన కులాలకు సాధ్యమైనంతగా చట్టసభలతో పాటు అన్నిరంగాల్లో కావాల్సినంత రిజర్వేషన్ కల్పిస్తూ అన్ని సామాజిక వర్గాల ప్రాతినిధ్యం ఉండేలా చేస్తే అన్ని వర్గాల ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుంది. ●

MN 5 PAGE-GNT :MN 5 PAGE-GNT 01/01/2001 10:42 Page 1



గుంటూరు వార్త



గుంటూరు నగరంలో కార్డన్ సెర్చ్ 10

## కంపోస్ట్ యార్డును పరిశీలించిన మంత్రి మనోహార్

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 21(ప్రభాతవార్త):** స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ శుక్రవారం పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో గల మున్సిపల్ డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపోస్ట్ తయారీ ప్రక్రియతో పాటు కోకోపీట్ తయారీ మరియు నిర్వహణను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు కంపోస్ట్ మరియు కోకోపీట్ నిర్వహణ, నాణ్యత, వినియోగం తదితర అంశాలపై తగిన సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి వెంట వివిధ శాఖల అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన నాదెండ్ల:**

స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## తెనాలి డంపింగ్ యార్డు ఆధునీకరణ : మంత్రి నాదెండ్ల

**తెనాలి,ఆగస్ట్ 21,(ప్రభాతవార్త):** దశాబ్దాలుగా పేరుకుపోయిన వ్యర్థాలతో సమస్యగా మారిన తెనాలి డంపింగ్ యార్డు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ తెలిపారు. రు.1.40 కోట్ల వ్యయంతో డంపింగ్ యార్డు ప్రక్షాళన పనులు చేపట్టామని, సుమారు 4 ఎకరాల స్థలాన్ని పూర్తిగా శుభ్రపరిచి మైదానంగా తీర్చిదిద్దామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కార్యక్రమం ద్వారా నిధులు సమీకరించి వ్యర్థాలను తొలగించామని, తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్, కిచెన్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగానికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని, డంపింగ్ యార్డును భవిష్యత్తులో గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. డ్రెయిన్, ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు 2 ఎంఎల్డీ సామర్థంతో ఎస్టీపి ఏర్పాటు చేయనున్నామని, శుద్ధి చేసిన నీటిని అవసరమైన విధంగా వ్యవసాయానికి వినియోగించేలా చర్యలు తీసుకుంటా



మన్నారు. తెనాలి మున్సిపాలిటీలో ప్రతిరోజూ సుమారు 10 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నామని, దీనిని శాస్త్రీయంగా నిర్వహించి కంపోస్ట్‌గా మార్చే విధానం అమలు చేస్తామన్నారు, డంపింగ్ యార్డు సమీపంలోని ప్రైవేట్ స్థలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను కూడా యజమానుల సహకారంతో తొలగిస్తామని, ఆధార్ కార్డుతో మున్సిపాలిటీని సంప్రదిస్తే, చెత్త తరలింపునకు మున్సిపాలిటీ తరఫున ఉచిత జెసిబి సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజలు తమ వాహనాల ద్వారా చెత్తను తరలించుకునేలా సహకారం అందిస్తామని, రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, రక్షిత మంచినీటి సరఫరా, కొత్తగా విస్తరిస్తున్న కాలనీల్లో మౌలిక వసతులు వంటి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. 2010లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా డంపింగ్ యార్డు శుభ్రత కోసం చర్యలు చేపట్టిన విషయాన్ని మంత్రి మనోహార్ గుర్తుచేశారు. డంపింగ్ యార్డు ప్రక్షాళనలో కీలకంగా పనిచేసిన మున్సిపల్ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రజల సహకారంతో తెనాలిని పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని మంత్రి నాదెండ్ల మనోహార్ స్పష్టం చేశారు.

## రెండు గ్రామాల్లో ఇంటింటికి తెదేపా

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 21, ప్రభాతవార్త :** మండలంలోని శివారు గ్రామాలైన కోవెలమూడి, కారంపూడిపాడు గ్రామాలలో శుక్రవారం 26వ రోజు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలను సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**కోవెలమూడి గ్రామంలో..**


ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోలుమూడి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడారు. టిడిపి పార్టీ ముద్రించిన



ప్రారంభించారు. కారంపూడిపాడు గ్రామంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి సంక్షేమం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రూ.10లక్షల ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులతో సిసి రోడ్డు మరియు కాల్వల నిర్మాణ పనులు, రూ.10లక్షల ఎంపి నిధులతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులతో పాటు హిందూ స్మశాన వాటిక అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో మౌలిక కరపత్రాలను పంపిణీ చేశారు ఎంఐడిహెచ్ సహకారంతో రైతులకు రూ.పదివేలు సబ్సిడీతో 12 స్ప్రేర్లను ఎమ్మెల్యే తన చేతులు మీదుగా అందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..బీసీ రిజర్వేషన్లు అమలతో ప్రజాస్వామ్య పాలనలో బీసీల భాగస్వామ్యం మరింత పెరిగిందని తెలియజేశారు. టిడిపి ఆవిర్భావం నుండి సంక్షేమం రాజకీయ ప్రాతినిధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని వివరించారు. ఈ రిజర్వేషన్ కేవలం ఒక్క ఎన్నికల హామీ కాదని బీసీలకు రాజకీయంగా సాధికారత కల్పించాలనే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. బీసీలకు న్యాయం, అవకాశం, అధికారం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పై ప్రజల్లో నమ్మకం : ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, ఆగస్ట్ 21 ప్రభాతవార్త : ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజల నమ్మకాన్ని చూరగొందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గుర్తు చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గడపగడపకు వెళ్లిన సందర్భంగా ప్రజలు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి తమ



శుక్రవారం సాయంత్రం 15వ వార్డులోని వరవకట్ట, కొండలరావుపేట, కూరగాయల మార్కెట్, అన్న క్యాంటీన్ ప్రాంతాల్లో నిర్వహించిన "నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ సూపర్‌హిట్‌గా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బీసీలకు అసెంబ్లీలో రాజ్యాధికారంలో వాటా కల్పించే దిశగా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకువచ్చామని ఎమ్మెల్యే సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి, సాంకేతికపరమైన సమస్యలను అధిగమించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. గడపగడపకు కార్యక్రమం ప్రజల నుంచి మంచి స్పందనతో విజయవంతంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నల్లపాటి రాము, పార్టీ సీనియర్ నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, అల్లంశెట్టి మోహన్‌రావు, నాగజ్యోతి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంగీత ప్రియుల హృదయాల్లో చెరగనిముద్ర జమునారాణి

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 21,ప్రభాతవార్త :** వైవిధ్యమైన తన గాత్రంతో దక్షిణాదిలో ప్రముఖ నేపథ్యగాయనిగా ఎదిగి వేలాది పాటలతో వివిధ భాషల ప్రేక్షకులను అలరించిన జమునారాణి సంగీత ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అవగాహన మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు నివాళులర్పించారు. అవగాహన సంస్థ కార్యాలయంలో సుప్రసిద్ధ నేపథ్య గాయని కోకా జమునారాణి సంస్మరణ కార్యక్రమాన్ని గాయనీ గాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకురాలు వి.రాజేశ్వరీ దేవి మాట్లాడుతూ జానపద గీతాలతో ఒకతరం ప్రేక్షకులు ఉర్రూతలూగించిన సుప్రసిద్ధ గాయని జమునారాణి మరణం సంగీత ప్రియులందరినీ కలచివేసిందన్నారు. మావ,మావ, అంటూ తెలుగు శ్రోతల్ని ఉర్రూతలూగించిన స్వరం, ముక్కుమీద కోసం నీ ముఖానికే అందం అంటూ హుషారెత్తించి ఆమె గాత్రాన్ని తెలుగు వారెప్పుడు మర్చిపోలేరన్నారు. తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ, సింహాళ, హిందీ 6భాషల్లో 22మంది సంగీత దర్శకుల స్వరసారథ్యంలో 6వేల పైగా పాటలు పాడడం జమునారాణికే సాధ్యమన్నారు. సీనియర్ గాయకులు వి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జమునారాణి ఎక్కువగా మెలోడి పాటల కంటే జానపద, చలాకీపాటలకు ఎక్కువగా గొంతు అందించారన్నారు. గాయనీ గాయకులు రాజ్యలక్ష్మీ రాజశేఖర్, సుభద్రాలక్ష్మి, సుగుణ తదితరులు జమునారాణి పాటలు ఆలాపించారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అదే విధముగా జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ



సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అదే విధంగా గురువారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయటం పాటు, వారి సమస్యలను పరిష్కరించాలని కోరటం పై హర్షం వ్యక్తం చేస్తూ పలు జర్నలిస్ట్ సంఘాల ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలుసుకొని ధన్యవాదాలు తెలిపి, సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటుండటంతో ప్రజలు సంతృప్తిగా వెళ్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రతి వర్గం, ప్రతి వృత్తి, ప్రతి సంస్థ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో జర్నలిస్టుల సంక్షేమంపై తాను ప్రస్తావించిన అంశాన్ని వివరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఎన్నో కష్టాలు, ప్రమాదాలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమం అవసరమని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. జర్నలిస్టులు చాలా తక్కువ వేతనాలతో, నిరంతర ఒత్తిడిలో పనిచేస్తున్నప్పటికీ సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా గృహ వసతి, ఆరోగ్య భద్రత అందించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని, జర్నలిస్టు కాలనీల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. జర్నలిస్టుల కోసం గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసి, వారి సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

గత ఐదేళ్లలో అనేక వర్గాల మాదిరిగానే జర్నలిస్టుల సమస్యలు కూడా నిరక్ష్యాన్లికి గురయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతి వర్గం సమస్యలపై దృష్టి సారిస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయాలు లేదా ఇంటి స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో హౌసింగ్ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉందని, రానున్న రోజుల్లో జర్నలిస్టుల హౌసింగ్, హెల్త్ కార్డుల అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అనే మూడు లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరించి కొంత సమయం ఇస్తే ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రజాదర్బార్‌కు 46 అర్జీలు

### త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు చీఫ్‌విప్ జీ.వీ ఆదేశం

**వినుకొండ,ఆగస్ట్21,ప్రభాతవార్త:** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరిగే పరిస్థితి ఉండకూడదని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ



ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కొత్తపేట నందు గల ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కాగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 46 అర్జీలను జీ.వీ స్వీకరించారు. ప్రతి అర్జీదారుడితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న జీవీ అవసరమైన సందర్భాల్లో సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. పలు అర్జీలను అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, వెబ్‌ల్యాండ్ నమోదు, 22ఏ సమస్యలు, రోడ్లు-డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు-వైర్లు, పింఛన్లు, రేషన్, గృహనిర్మాణం, తాగునీరు, ట్రాఫిక్, గ్రామీణ మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలు అందాయి.

ఆశావాహుల ఆశలపై నీళ్లు 7




ఏఈఈ పోస్టుల భర్తీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు 8

రోడ్డు ప్రమాదంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి మృతి

## ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో పరిశీలించుకునేందుకు అవకాశం

### నగర కమిషనర్ కే. మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 21, (ప్రభాతవార్త) :** నగర ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో పరిశీలించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కలిపిస్తూ ఆదేశాలు జారీ చేసిందని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ తెలిపారు. ఈనెల 22, 23 అంటే శని, ఆదివారాలతో పాటు 29, 30వ తేదీలలో గుంటూరు నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో " ప్రత్యేక స్పెషల్ క్యాంపెయిన్ డేస్ " నిర్వహించడం జరుగుతుందన్నారు.



ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ముసాయిదా ఓటర్ జాబితాతో పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ జాబితాలో

**22,23,29.30న నగరంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో " ప్రత్యేక స్పెషల్ క్యాంపెయిన్ డేస్ "**

**బూత్ లెవెల్ అధికారులు ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ**

**ఓటర్ జాబితాలో కొత్తగా పేరు నమోదు..**

**మార్పులు, చేర్పులు, సవరణలకు ఎన్నికల సంఘం ఆదేశాలు**

కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు, పేరు, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలనుకునేవారు, అలాగే ముసాయిదా ఓటర్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న బిఎల్ఓలను సంప్రదించి తమ దరఖాస్తులను అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని, ఓటర్ జాబితాలో ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బిఎల్ఓలు నిర్దేశిత సమయంలో పోలింగ్ కేంద్రాల్లో ఉండి, ప్రజల నుండి అర్జీలు, దరఖాస్తులను తీసుకునేలా సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్ఓలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 21,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కళావేదికపై అమ్మవారిని వరలక్ష్మిగా విశేషంగా అలంకరించి ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో ప్రధాన పూజారులు మాధవస్వామి, కృష్ణస్వామి పూజా కార్యక్రమం భక్తులకు మంత్రార్థాలను వివరిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజానంతరం తీర్థప్రసాదాలను అందించారు.

అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వ్యవస్థాపకులు, ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటికుంకుమార్చనలో భాగంగా శ్రావణ మాస రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కనుల పండువగా జరిగింది. తొలుత అష్టదళ బంగారు పద్మాలతో అమ్మవార్లకు విశేష పూజ, వరలక్ష్మీ అమ్మవారి కథా విశేషాలను వివరించి, అమ్మవారి తోరణ పూజ విశేషాలను వివరించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు.



స్థానిక సిద్దార్థ నగర్ శ్రీకనకమహాలక్ష్మి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపకులు ఘంసాల విజయస్వామి ఆధ్వర్యంలో విశేషంగా పాల్గొన్న సువాసినులతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించి, విశేషహారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.

22PLD 6ffffff.qxd:22PLD 6.qxd 01/01/2001 10:10 Page 1



# సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త): సత్తెనపల్లి డీఎ స్పీ ఎం .వి.కె. చైతన్య స త్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసు ఫైల్స్, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, కేసు డైరీలు, స్టేషన్ రికార్డులు తదితరాలను పరిశీలించి వెరిఫై చేశారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు నాణ్యత, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు అంశాలు, కోర్టు కేసులకు సంబంధించిన రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, అవసరమైన ఆధారాలను సేకరించి, చట్టపరమైన ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డు గది, సిబ్బంది పని ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రతను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా భద్రపరచాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టపరంగా, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, రౌడీషీటర్లు, ఇతర నేరస్తులపై నిరంతర నిఘా, బీట్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంపై సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సందర్భంగా గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని, పై అధికారుల ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ పోలీస్ స్టేషన్ పనితీరును మరింత మెరుగుపరచాలని డీఎస్పీ ఎం.వి.కె. చైతన్య సిబ్బందిని ఆదేశించారు.





# సమాజాన్ని యువతే మార్చాలి

**పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భూగ్రహం మనుగడ ప్రశ్నార్థకం: అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు**

సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త): సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని, పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భూగ్రహం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఇస్రో, నాసాలలో పనిచేసిన ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సత్తెనపల్లి పట్టణంలోని ఎస్‌బీజీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చందు సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచంలో సుమారు 40 కోట్ల మంది యువత ఉన్న దేశంగా భారత్ ఉందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు యువత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రకృతిని కాపాడుకోకపోతే భవిష్యత్ తరాల మనుగడ తీవ్రంగా ప్రభావితమవుతుందని తెలిపారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న సమయంలో పురుషులు వెనుకబడిపోవడం సమాజానికి శ్రేయస్కరం కాదని అన్నారు. మహిళలను గౌరవించడంతో పాటు వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణమైన జ్ఞాన సంపదతో దేశానికి సేవలందించిన మహనీయుడని అన్నారు. ఆయన వ్యక్తిత్వం, క్రమశిక్షణ, జ్ఞానాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ భారత అంతరిక్ష రంగానికి చేసిన సేవలను వివరించి, ఆయన దేశానికి గర్వకారణమైన శాస్త్రవేత్తగా ఎదిగారని తెలిపారు. ఉపగ్రహాలను శ్రీహరికోట నుంచే ప్రయోగించడానికి గల కారణాలను విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్ ప్రయోగ విధానాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. వేల సంవత్సరాల క్రితమే భారతదేశంలో అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కలిగిన వారు ఉన్నారని గుర్తుచేశారు. చంద్రుడి ప్రభావం భూమిపై జీవరాశి మనుగడపై ఉందని, పర్యావరణ పరిరక్షణపై యువత మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమం ప్రారంభంలో కళాశాల విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వామి వివేకానంద చైతన్య భారతి సభ్యులు మెమెంటోలు అందజేశారు. శ్రీ బాబా గురుదేవ్ విద్యాసంస్థలలో స్వామి వివేకానంద చైతన్య భారతి సత్తెనపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎం.వి. సుబ్బారెడ్డి, పుట్టి సాంబశివరావు, రామిరెడ్డి, పోతుగంటి రామకోటేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ మట్టా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ దేవరాజ్, ప్రముఖులు చెన్నకేశవరావు, శ్రీను, అబ్బూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పేరేచర్లలో దీన స్థితిలో వృద్ధురాలు

**స్పందించని మానవత్వం**

**నిస్సహాయురాలికి ఆశ్రయం, వైద్య సహాయం అందించాలని స్థానికుల విజ్ఞప్తి**



**సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త):** పేరేచర్ల గ్రామంలో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారి పై ఓ వృద్ధురాలు దీనస్థితిలో పడి ఉండటం స్థానికులను కలచివేసింది. చుట్టూ నిత్యం వందలాది మంది ప్రజలు సంచరిస్తూ, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఆమె రోడ్డు పక్కన దుమ్ము, ధూళిలోనే దీనంగా కనిపించింది. తల కింద ఓ పాత సంచిని దిండుగా పెట్టుకుని, తీవ్ర ఆకలితోనో లేదా అనారోగ్యంతోనో ముడుచుకుని పడుకున్న ఆమెకు కనీసం తాగేందుకు నీరు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. పక్కనే వాహనాలు పార్క్ చేసి ఉండగా, వందలాది మంది ఆమెను దాటుకుంటూ వెళ్తున్నప్పటికీ ఆమె పరిస్థితిని పట్టించుకుని ఆరా తీసే వారు లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది. "ఈమె ఎవరు? ఎందుకు ఇలా రోడ్డుపై ఉంది?" అని తెలుసుకునే నాథుడు లేకపోవడం సమాజంలో మానవత్వం ఏ స్థాయికి చేరిందో తెలియజేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిస్సహాయులు రోడ్లపై దీనస్థితిలో ఉండకుండా సంబంధిత ప్రభుత్వ అధికారులు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు వెంటనే స్పందించి వారికి ఆశ్రయం, ఆహారం, వైద్య సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా చుట్టుపక్కల ఉన్న నిస్సహాయుల పట్ల మానవత్వంతో స్పందించి వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## సత్తెనపల్లి ధోబీ ఘాట్‌కు శాశ్వత పరిష్కారం కావాలి

**మురుగు కాలువలతో ప్రజలకు ఇబ్బందులు**

**సైడ్ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి**





**సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని ధోబీ ఘాట్ పరిసరాల్లో మురుగు కాలువలు, నిల్వ నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాలువలను అప్పుడప్పుడు శుభ్రం చేయడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని, ధోబీ ఘాట్ ప్రాంతంలో ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మించి, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీరు సక్రమంగా వెళ్లేలా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ధోబీ ఘాట్ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సైడ్ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

## సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం



**సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణం గుంటూరు రోడ్డులోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమంలో కొలువుదీరిన బాలా త్రిపురసుందరి అమ్మవారు, గోవిందమాంబ అమ్మవారు, ఈశ్వరమ్మవారు, రమాదేవి అమ్మవారు, అన్నపూర్ణాదేవి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి శ్రావణ లక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అదేవిధంగా దుర్గాదేవి అమ్మవారికి, శ్రీచక్ర సహిత మేరువుకు మహిళలు ప్రత్యేకంగా కుంకుమార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రావణమాసం సందర్భంగా ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక ప్రచార దినాలు

**_ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో**



**సత్తెనపల్లి, ఆగస్టు 21:** భారత ఎన్నికల సంఘం (నిఈ) మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026-2026)లో భాగంగా అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు కొనసాగుతుందని 98-సత్తెనపల్లి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీ కె. గోపాలకృష్ణ తెలిపారు. ఓటర్లకు మరింత సౌకర్యం కల్పించేందుకు ఆగస్టు 22, 23, 29, 30 తేదీలను ప్రత్యేక ప్రచార దినాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజుల్లో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల నుంచి కొత్తగా నమోదు, తొలగింపు, అభ్యంతరాలు, ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను బీఎల్‌వోలు స్వీకరిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి భారతీయ పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా మార్పులు, చేర్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత దరఖాస్తులను గడువులోగా సమర్పించాలని ఓటర్ల నమోదు అధికారి, 98-సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి, సత్తెనపల్లి కోరారు.

## నూతన వధూవరులకు జొన్నలగడ్డ ఆశీస్సులు



**సత్తెనపల్లి, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో శుక్రవారం అన్నదాసు వారి వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ హాజరై నూతన వధూవరులు రాజరాజేశ్వరి, బాల శ్రీ సాయి మనోజ్‌లను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నూతన దంపతుల వైవాహిక జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అన్నదాసు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో శ్రీ వాసవి



**సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా రెండో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి ప్రత్యేక అలంకరణను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

## వరలక్ష్మీ వ్రతం రోజున నిరుపేదలకు అన్నప్రసాద వితరణ

**భరతమాత అన్నప్రసాద వితరణ పథకం ద్వారా 836వ రోజు సేవలు**



**సత్తెనపల్లి (ఆగస్టు 21, ప్రభాతవార్త):** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని యానాది కాలనీలో నిరుపేదలకు ఉచితంగా అన్నప్రసాదం అందించారు. దాతల సహకారంతో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా శుక్రవారం 836వ రోజు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. యూఎస్‌ఏలో ఉన్న దేవతి వెంకటలక్ష్మీ శ్రావ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు దేవతి వెంకటేశ్వరరావు, గీతా సుధ దంపతులు అందించిన ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం 12.30 గంటలకు నిరుపేదలకు ఉచితంగా భోజనం అందించారు. వరలక్ష్మీ వ్రతం రోజున ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం విశేషమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దమ్మాలపాటి బాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దాతల సహకారంతో సుదీర్ఘకాలంగా భరతమాత అన్నప్రసాద వితరణ పథకం ద్వారా నిరుపేదలకు సేవలు అందిస్తున్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావును హృదయ పూర్వకంగా అభినందించారు. దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి సేవా కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన దాతలకు, వారి కుటుంబ సభ్యులకు, ప్రతిరోజూ సేవా కార్యక్రమాల్లో

## శ్రీ అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**కారంపూడి(ఆగస్టు 21, ప్రభాతవార్త):** మండలం కేంద్రంలో కొలువుదీరిన శ్రీ అంకాలమ్మ తల్లి దేవస్థానంలో శ్రావణ మాసం పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న అమ్మవారి కొలుపులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం పూజా కార్యక్రమాల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు, టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కట్టిన కుంకుమ బండ్లను ప్రారంభించి, పురవీధుల్లో కుంకుమ బండి ట్రాక్టర్‌ను నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రజల ఆరాధ్యదైవం అంకాలమ్మ తల్లి చల్లని దయ అందరిపై ఉండి, పాడి పంటలు సుభిక్షంగా ఉండేలా దీవించాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పంగులూరి అంజయ్య, ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, పార్టీ మండల అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, మస్తాన్ జానీ, పార్టీ పట్టణ అధ్యక్షులు బొమ్మిన శేషగిరిరావు, తంగిరెడ్డి బాలకృష్ణ, హరి తదతరులు పాల్గొన్నారు.

## మాచర్లలో ప్రత్యేక ప్రచార దినాలు



**మాచర్ల టౌన్ ఆగస్టు 21 ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఆగష్టు 22,23,29,30 తేదీలను ప్రత్యేక ప్రచార దినాలుగా ఎన్నికల కమిషన్ ప్రకటించినట్లు 101మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి కె.అద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ప్రచార దినాల్లో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాలను ఓటర్లు సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని ఎన్నికల నమోదు అధికారి కె.అద్దయ్య కోరారు. ఏవైనా తప్పులు, మార్పులు లేదా చేర్పులు అవసరమైతే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి సవరణలు చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా వరలక్ష్మి పూజలు




**గురజాల, ఆగస్టు 21 ప్రభాతవార్త :** పట్టణంలో శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మి పూజలను అమ్మవారి దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణ గ్రామ దేవత శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ చీతిరాల సుబ్బారావు పర్యవేక్షించారు. వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన వంద మందికి అన్నదానం చేశారు. అలాగే ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యాన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే కనకదుర్గమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపారు.

## బోయపాలెంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం ప్రత్యేక పూజలు



**యడ్లపాడు, అగస్టు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని శ్రీ పార్వతి దేవి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం, శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులచే కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ పూజారి స్వర్ణ రమణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## ఘనంగా నిర్వహించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి 34వ తిరుణాల మహోత్సవం



**యడ్లపాడు, అగస్టు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి 34వ తిరుణాల మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరుణాల సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి చందనాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిరుణాల మహోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమానికి బీఎల్ఓలు హాజరు కావాలి



*యడ్లపాడు, ఆగస్టు 21, ప్రభాతవార్త :* జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, పల్నాడు జిల్లా వారి ఆదేశాల మేరకు ఆగస్టు 22, 23 తేదీలలో నిర్వహించే ఎస్ఐఆర్‌కు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అందరు బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన రికార్డులతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అలాగే ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన బీఎల్ఏలు కూడా కార్యక్రమానికి హాజరయ్యే విధంగా సంబంధిత బీఎల్ఓలు వారికి సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ కోరారు.

## అచ్చేపాలెం మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన టీడీపీ నాయకులు



**నరసరావుపేట టౌన్ , ఆగస్టు 21 ప్రభాతవార్త:** అచ్చేపాలెం మాజీ సర్పంచ్ మండలపు వెంకట్రావును తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, నీటి సంఘం అధ్యక్షులు హనుమ ప్రసాద్ లు శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సూచన మేరకు వారు వెంకట్రావు కుటుంబ సభ్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. వెంకట్రావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటారని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వెంకట్రావు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికి టీడీపీకి మంచి ప్రజా స్పందన

**- మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు**



**నరసరావుపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడంతో పాటు, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అన్నారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయ సాధన కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

## వీర్లఅంకాలమ్మకు ఘనంగా బోనాలు



**.కారంపూడి(ఆగస్టు 21, ప్రభాతవార్త):**" పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం కోరిన కోరికలు తీర్చే తల్లి వీర్ల అంకాలమ్మ కు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం, కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. శ్రావణమాసంలో అంకాలమ్మ తల్లికి బోనాల సమర్పించడం ఆనవాయితీ. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ప్రతి ఏటా పట్టణంలో ఉన్న వివిధ సామాజిక వర్గాలు ప్రతి శుక్రవారం శ్రావణ మాసంలో వీలంకాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కుబడి తీర్చుకుంటారు. ఏడాది శ్రావణమాసంలో రెండవ శుక్రవారం రావడం తోఆర్యవైశ్య సంఘం, కాపు సంఘంల సామాజిక వర్గాలు అంకాలమ్మ తల్లికి బోనాల సమర్పించారు. డప్పు వాయి ద్యాలు, డిజె సౌండ్లు తో కుంకుమబండితో బోనాలను తీసుకొని అమ్మవారి దేవాలయానికి చేరుకొని ముక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసంలో వర్షాలు సానుకూలంగా కురిసి పంటలు సమృద్ధిగా పండి, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని కోరుకున్నారు మండలంలోని గ్రామాలలో ప్రతి ఇంట వరలక్ష్మి దేవి పూజా కార్యక్రమాలు, వ్రతాలు జరుపుకున్నారు. ఉదయం నుండే గృహాలు పూజా కార్యక్రమాలతో నిండిపోయాయి. వర లక్ష్మి అమ్మవారి కటాక్షం ప్రతి ఇంట నిండాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖ సంతోషాలు, పాడి పంటలు తో వెల్లి విరియాలని కోరుకుంటూ మహిళా మూర్తులు వ్రతాలను చేశారు."

MN 7 PAGE-GNTv:MN 7 PAGE-GNTv 01/01/2001 10:47 Page 1



# పల్నాడు జిల్లా వార్త



## అసెంబ్లీని ఎదుర్కోనే ధైర్యంలేకే వైకాపా ముఖం చాటేసింది

### -ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

**వినుకొండ, ఆగస్ట్ 21, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో గెలిచి జీతాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సరికాదన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు అర్థవంతమైన చర్చలకు వేదికగా నిలిచాయని జీవీ తెలిపారు. మొత్తం 25 గంటల 15 నిమిషాల పాటు సభ కొనసాగగా 103 మంది సభ్యులు ప్రసంగించారని చెప్పారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సభకు హాజరై ఉంటే మరో 11 మంది సభ్యులు ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండేదన్నారు. సభను ఎదుర్కోనే దమ్ము లేకే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని జీవీ ఆంజనేయులు విమర్శించారు. అసెంబ్లీ నుంచి పారిపోయి పులివెందుల పిల్లుల్లా మారారు అంటూ సెటైర్ వేశారు. దేవాలయం లాంటి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోవడం వైసీపీ నేతల వైఖరికి నిదర్శనమన్నారు. తమ బండారం బయటపడుతుందనే భయంతోనే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరంగా ఉన్నారని ఆరోపించారు. మరోవైపు మండలిలో గందరగోళం సృష్టిస్తూ ప్రజా సమస్యలపై చర్చకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. డీఎస్సీ విషయంలో మంత్రి నారా లోకేష్ బయటపెట్టిన వాస్తవాలతో వైసీపీ నేతలకు మైండ్ బ్లాక్ అయిందని అన్నారు. డీఎస్సీ,ఏపీపీఎస్సీ మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేయడం విడ్డూరంగా ఉందని



జగన్‌పై విమర్శలు గుప్పించారు. ఏపీపీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయంతోనే జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాల్సిన బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతి ఎమ్మెల్యేపైనా ఉందని హితవు పలికారు.

## ఎమ్మెల్యే చదలవాడ ప్రజా వేదికకు 23 ఫిర్యాదులు

**నరసరావుపేట, ఆగస్టు 21 (ప్రభాతవార్త): :** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమం శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 23 ఫిర్యాదులు అందగా, ప్రధానంగా పింఛన్లు, నివేశన స్థలాలు, పారిశుద్ధం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు ప్రతి వినతిని ఓపికగా విని, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ పరిష్కారం అవసరమైన కొన్ని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు.



## మిలాద్ ఉన్ నబీ వేడుకలను జయప్రదం చేయాలి : గోపిరెడ్డి

**నరసరావుపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త ::** ఈ నెల 25న మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌తో పాటు నసరావుపేటలో ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో




నిర్వహించనున్న మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారంస్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నరసరావుపేట ఏఐఎంఐఎం నాయకులు షేక్ మోలాలి అధ్యక్షతన"చలో దారుసలాం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషకమన్నారు. ఏఐఎంఐఎం అధినేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అసదుద్దీన్ ఓవైసీ గత మూడు ఎన్నికల్లో మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఏఐఎంఐఎం కలిసి ముందుకు సాగాలని డా. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా ముస్లిం మైనార్టీ సోదరులందరికీ మిలాద్‌ఉన్‌నబీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ విభాగం నాకులు, మాజీ కౌన్సిలర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** హైదరాబాద్, జూబ్లీహిల్స్ నందు ప్రాజెక్ట్స్ అధినేత అల్లూరి శ్రీనివాసరావు కుమారుని వివాహం ఇటీవల జరగగా ఈరోజు సత్యనారాయణ స్వామి వ్రతం సందర్భంగా అక్కడకి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రివర్యులు, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు



## యువతలో పెచ్చుమీరిన హింసపై ప్రముఖుల ఆందోళన

**నరసరావుపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త :** యువత, హైస్కూల్ విద్యార్థుల్లో పెరుగుతున్న హింసాత్మక ధోరణులు ఆందోళనకరంగా మారాయని ఆంధ్రా చైతన్య గ్రూప్ వ్యవస్థాపకులు స్వర్ణ చిన్న రామిరెడ్డి అన్నారు. "యువతలో పెడ ధోరణులు-విపరీత హింసా ప్రవృత్తి" అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రూపారెడ్డి, ఏ.ఈ. నూకరాజు, సౌజన్య, ప్రియాంక, స్పందనల దారుణ మరణాలను ప్రస్తావిస్తూ నివాళులర్పించారు. ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి చూక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత నేర సంస్కృతికి ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ కలాలు పట్టే చేతులతో కత్తులు పట్టి హత్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఎస్.చలమారెడ్డి మాట్లాడుతూ ఏ.ఈ. నూకరాజు కుటుంబం మృతి బాధాకరమన్నారు. ఏపీజీఈఏ జాయింట్ సెక్రటరీ షేక్ బాజీ మాట్లాడుతూ డా. ప్రియాంక మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు. రాఘేంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పూనూరి కృష్ణకుమారి డ్రగ్స్ బారి నుంచి పిల్లలను కాపాడాలని కోరారు.

## ఎన్.ఈ.సీ కళాశాలలో విజయవంతమైన 3రోజుల శిబిరం

**నరసరావుపేట, ఆగస్టు 21ప్రభాత వార్త :** నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆగస్టు 17 నుంచి 19 వరకు మూడు రోజుల , ఆగస్టు 20న 24 గంటల నిర్వహించారు. సమస్య పరిష్కారం, సృజనాత్మక ఆలోచన, టీమ్ వర్క్, ఇన్నోవేషన్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డా. సోము వెంకటేశ్వర్లు సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి, మెంటర్లు, అధ్యాపకులు, నిర్వాహక బృందాన్ని అభినందించారు.

## పేటలో 5 రోజుల పాటు ట్యాంకర్ల ద్వారానే తాగునీటి సరఫరా

### మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు

**చిలకలూరిపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలోని 9 లీలిదీ వాటర్ ప్లాంట్ నుంచి కబేళా రోడ్డులోని వాటర్ ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన పంపింగ్ పైప్‌లైన్‌ను పూర్తిగా మార్చనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు తెలిపారు. సంజీవనగర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వద్ద ఈ పైప్‌లైన్‌కు తరచూ లీకేజీలు ఏర్పడి తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పైప్‌లైన్ మార్పిడి పనులు పూర్తి కావడానికి సుమారు 5 రోజుల సమయం పడుతుందని కమిషనర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కబేళా రోడ్డు వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా జరిగే మోమిన్ బజార్, ఇస్లాంపేట,



గుర్రాలచావడి, తూర్పుమాలపల్లి, కబేళా బజార్ మరియు పాక్షికంగా రూత్ డైక్మెన్ కాలనీ ప్రాంతాల ప్రజలకు పనులు పూర్తయ్యేంత వరకు మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తామని స్పష్టం చేశారు. పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరా యథావిధిగా పునరుద్ధరించబడుతుందని, అప్పటివరకు పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## కంచర్ల శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన ఆర్టీసీ ఈడీ

**చిలకలూరిపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** టీడీపీ సీనియర్ నాయకులు, గివిగిగేది రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల మృతి. ఈ నేపథ్యంలో కంచర్ల స్వగృహానికి చేరుకున్న ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి. కంచర్ల కుటుంబ



సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పావులూరి వెంకటేశ్వరరావు, కరణం శివ, గివిగిగేది పట్టణ అధ్యక్షులు అద్దంకి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## 15 మంది పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

నకరికల్లు, ఆగస్టు 21 ప్రభాతవార్త : స్థానిక పల్నాడు రోడ్డులోని శ్రీ త్రికోటేశ్వర స్కాన్ సెంటర్ లో ఆంధ్రా హాస్పిటల్స్ మరియు మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ డి. లింగస్వామి హాజరై, 15 మంది చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగస్వామి మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు ఉన్న చిన్న పిల్లల తల్లితండ్రులు ఎవరు డబ్బుల గురించి ఆలోచించకుండా వారి పిల్లలను ఇలా వైద్యశిబిరం ఏర్పాటు చేసినప్పుడు తీసుకొని వస్తే వాళ్లను పరీక్షించి అవసరమైన వారికి హీరో మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఎండీ. ఫారూఖ్ బాబు, చిన్ని కృష్ణ, షేక్. సుభాని, డి. నాగేశ్వరరావు, షేక్. బాజీ, కోటేశ్వరరావు, జి. బుచ్చిబాబు, ఆంధ్రా హాస్పిటల్స్ రిలేషన్ మేనేజర్ ప్రసాద్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## మాచర్ల మున్సిపోల్ చైర్మన్ పదవి..!

# ఆశావాహుల ఆశలపై నీళ్లు

**మాచర్ల టౌన్.. ఆగష్టు 21 ప్రభాతవార్త:**

ఎలాగైనా కౌన్సిలర్‌గా గెలిచి, ఆ తర్వాత మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోవచ్చన్న ఆశతో గత రెండేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్న పలువురు నాయకుల ఆశలపై నూతన ఎన్నికల విధానం నీళ్లు చల్లినట్లయింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగే అవకాశం ఉండటంతో ఇప్పటివరకు పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో కొత్త చర్చ మొదలైంది. మాచర్ల పట్టణంలో ఆర్యవైశ్య, మాదిగ, వడ్డెర, ముస్లిం తదితర సామాజిక వర్గాల ప్రభావం గణనీయంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలువురు టీడీపీ కూటమి నాయకులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టిలో పడేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, సమావేశాలకు జన సమీకరణ చేయడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వంటి కార్యక్రమాలతో అధిష్టానం దృష్టిని ఆకర్షించి భవిష్యత్తులో కీలక పదవి దక్కించుకోవాలని పలువురు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కో వర్గం నుంచి పలువురు ఆశావహులుమున్సిపల్ చైర్మన్ పదవిపై ఒక్కో సామాజిక వర్గం నుంచి సుమారు 10 నుంచి 15 మంది వరకు ఆశావహులు ఉన్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కౌన్సిలర్‌గా గెలిస్తే కుల సమీకరణాలు, పార్టీ నిర్ణయం ఆధారంగా కనీసం కొంతకాలమైనా చైర్మన్‌గా అవకాశం లభించవచ్చన్న అంచనాలతో పలువురు ముందుకు సాగారు. అయితే చైర్మన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగితే పరిస్థితి పూర్తిగా మారే అవకాశం ఉంది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉండటంతో ఐదేళ్ల పాటు ఒకే వ్యక్తి పదవిలో కొనసాగే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో




ఇప్పటివరకు కౌన్సిలర్ పదవితో చైర్మన్ పదవిపై కన్నేసిన ఆశావహుల లెక్కలు తారుమారయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**జనసేన, బీజేపీలోనూ ఆశలు..**

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నాయకుల్లో నూ మున్సిపల్ ఎన్నికలపై ఆశలు పెరిగాయి. ప్రస్తుతం పట్టణస్థాయిలో క్యాడర్‌ను బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్న జనసేన నాయకులు కూడా ప్రత్యక్ష ఎన్నికలను తమ రాజకీయ బలాన్ని చాటుకునే అవకాశంగా భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఎలా ఉంటుంది? ఏ పార్టీకి ఎన్ని వార్డులు కేటాయిస్తారు? చైర్మన్ పదవిపై ఏకాభిప్రాయం ఎలా కుదురుతుంది? అన్న అంశాలపై ఆయా పార్టీల నాయకుల్లో ఆసక్తి నెలకొంది.

- -ఫ్లెక్సీల నుంచి చైర్మన్ కుర్చీ దాకా.. ఆశావహులకు అడ్డుకట్ట...
- -గత రెండేళ్లుగా పదవి కోసం ఆరాటం ...
- -అధిష్టానం దృష్టిలో పడేందుకు ఫ్లెక్సీలు,జన సమీకరణలు..
- -ఒక్కో సామాజిక వర్గం నుంచి పది నుంచి పదిహేను మంది ఆశావహులు...
- -చైర్మన్ ప్రత్యక్ష ఎన్నికలతో మారనున్న రాజకీయ సమీకరణాలు...
- -కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఎలా ఉంటుంది? ..
- -ఏ పార్టీకి ఎన్ని వార్డులు కేటాయిస్తారు? ...
- -చైర్మన్ పదవిపై ఏకాభిప్రాయం ఎలా కుదురుతుంది?...
- -ఆర్థిక బలమా.. కార్యకర్తల సేవా?

**ఆర్థిక బలమా.. కార్యకర్తల సేవా?**

ప్రత్యక్ష ఎన్నికల్లో ఆర్థికంగా బలంగా ఉన్నవారికే ఎక్కువ అవకాశాలు ఉండొచ్చన్న ప్రచారం నేపథ్యంలో ఇప్పటివరకు చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న కొందరు నాయకులు నిరుత్సాహానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన సాధారణ కార్యకర్తకు అవకాశం కల్పిస్తారా? లేక ఆర్థికంగా, సామాజికంగా బలమైన వ్యక్తిని బరిలోకి దింపుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా మాచర్ల మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి కోసం ఇప్పటి నుంచే రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లోకి వస్తే ప్రస్తుత ఆశావహుల్లో ఎంతమంది బరిలో నిలుస్తారు? కూటమి పార్టీల వ్యూహం ఎలా ఉండబోతోంది? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. దీంతో మాచర్ల మున్సిపల్ రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బిసి సెల్ నాయకులు

**చిలకలూరిపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి చిలకలూరిపేట నియోజకవర్గ బీసీ సెల్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్. సవిత గారు, చిలకలూరిపేట యోజకవర్గ మాజీ మంత్రి, శాసనసభ్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 34 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో మరోసారి నిరూపించిందన్నారు. అదేవిధంగా బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో భాగంగా రెండు ఎమ్మెల్సీ పదవుల్లో ఒకదానిని బీసీ వర్గానికి చెందిన వడ్డెర కులానికి చెందిన రమాదేవికి, మరో ఎమ్మెల్సీ పదవిని దళిత వర్గానికి చెందిన సీనియర్ నాయకులు వర్ల రామయ్యకి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడం సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లను తగ్గించడం ద్వారా సుమారు 16 వేల మంది బీసీ బిడ్డలు ప్రజా పదవులకు దూరమయ్యే పరిస్థితి కల్పించిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం బీసీలకు న్యాయం జరిగేలా 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరించడం ద్వారా బీసీల రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించిందన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. "బీసీలకు అండగా కూటమి ప్రభుత్వం – బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని తన్నీరు పుల్లారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ..చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా , పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్ , మద్దుమాల రవి, నియోజకవర్గ తీ.ది సెల్ అధ్యక్షులు తన్నీరు పుల్లారావు, పట్టణ తీ.ది సెల్ అధ్యక్షులు అవ్వారు లక్ష్మణ్, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అద్దంకి అనిత బాయ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అనంత వీర కుమారి, క్లస్టర్ ఇంచార్జీ ముల్లా కరీముల్లా , కో క్లస్టర్ ఇంచార్జీ నందం చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జీ అమ్మనబ్రోలు మాధవ సింగ్ , కాటాబత్తిన శ్రీనివాసరావు గారు, తెప్పలి కాసులమ్మ, మిద్దెల పూర్ణ సింగ్, ఉదయ్ సింగ్ బీసీ సెల్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

## మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

**నరసరావుపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త :** పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని మెగా యూత్ ఫోర్స్, చిరంజీవి యువత ఆధ్వర్యంలో శుక్రవారం నరసరావుపేట అరండల్‌పేటలోని విజయ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ రాయల శ్రీనివాస్ రావు, ఎలక్ట్రికల్ ఈఈ వై. ఏడు కొండలు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు అచ్యుత్ హాజరై రక్తదానం చేసిన అభిమానులను అభినందించారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరంజీవి తన నటనతో అంచెలంచెలుగా ఎదిగి తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని అన్నారు. అభిమానులను సేవా కార్యక్రమాల వైపు నడిపిస్తూ రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాలకు ప్రోత్సహిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్లు అందించి ఎంతోమందికి అండగా నిలిచారని గుర్తుచేశారు. చిరంజీవి అడుగుజాడల్లో అభిమానులు నడుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలనిపిలు పునిచ్చారు .కార్యక్రమంలో చిరంజీవి యువత అధ్యక్షుడు అద్దేపల్లి ఆనందబాబు, ఆర్.వి. బ్రహ్మం, కృష్ణంశెట్టి గోవిందరావు, గుప్తా శ్రీకాంత్, ధమలం కొండలు, అడపాల శేషు, పోతంశెట్టి రాము, గోపి, బీమా సాంబయ్య, రామాంజనేయులు, రాయల అభి, వెంకటనారాయణ, దుర్గా నారాయణ, జక్క నిర్మల తదితర చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కూకట్‌పల్లిలో చిలకలూరిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని యామిని మృతి

**చిలకలూరిపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** కేపీహెచ్‌బీ పరిధిలోని ఓ ప్రైవేట్ లేడీస్ హాస్టల్‌లో ఘటతోటి స్నేహితురాళ్లు బయటకు వెళ్లగా హాస్టల్ గదిలోనే యామినితిరిగి వచ్చేసరికి గది తలుపులు లోపల నుంచి గడియపెట్టి ఉండటంతో అనుమానంతలుపులు తెరిచి చూడగా యామిని మృతి చెందినట్లు గుర్తింపుసమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరమృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలింపుయామిని కుటుంబానికి చిలకలూరిపేట ప్రాంతంతో అనుబంధంగతంలో చిలకలూరిపేట పండరీపురంలో నివాసం.. ప్రస్తుతం కావూరు గ్రామంలో కుటుంబంయామిని తల్లిదండ్రులు లక్ష్మి, సుబ్బారావుహైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి సుబ్బారావుకుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారుఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తుయామిని మృతికి దారితీసిన కారణాలపై పోలీసులు ఆరావివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులుపోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించనున్న కుటుంబ సభ్యులు

## అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**చిలకలూరిపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన మద్ది జగదీష్ ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో లైజాల్ తాగిన జగదీష్‌కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గుర్తించి జగదీష్ బాబును ఆస్పత్రికి తరలింపువైద్యులు చికిత్స అందించి నప్పటికీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి అప్పుల బాధ కారణంగానే జగదీష్ బాబు ఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులు కు ఫిర్యాదుఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.



MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 10:12 Page 1





# బాపట్ల జిల్లా వార్త

## విద్యా సంస్థల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన

**రేపల్లె, ఆగస్టు 21, ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని చైతన్య,నారాయణ విద్యా సంస్థల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.పండుగ రోజుల్లో కుటుంబ సభ్యులతో ప్రశాంత వాతావరణంలో గడపాల్సిన విద్యార్థులకు తరగతులు నిర్వహించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం.సూర్యప్రకాశ్, డివైఎఫ్ఐ వై.నవీన్,ప్రవీణ్,మున్నా,సుమంత్, ప్రేమ్‌కుమార్, ఆనంద్,ప్రశాంత్ ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన అగ్నిమాపక శకటం ప్రారంభం

**రేపల్లె, ఆగస్టు 21, ప్రభాతవార్త:** కాలం చెల్లిన రేపల్లె అగ్నిమాపక శకటం స్థానంలో నూతన అగ్నిమాపక వాహనాన్ని శుక్రవారం తెలుగుదేశం పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త అనగాని శివప్రసాద్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పి.శ్రీనివాసరావు, రేపల్లె రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు,అనగాని శ్రీనివాసమూర్తి,కేసన గోపాలరావు, పంతాని సాయికుమార్,అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా శ్రీ సీతారామస్వామి మందిర ప్రతిష్ఠా మహోత్సవం

**పిట్లవానిపాలెం,ఆగస్టు21,ప్రభాతవార్త. :** మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి మందిర ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవోపేతంగా, కన్నులపండువగా జరిగింది. గత మూడు రోజులుగా వైఖానస ఆగమశాస్త్రోక్తంగా కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ధ్యానాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు.శుక్రవారం ఉదయం 11:31 గంటల శుభ ముహూర్తాన ప్రతిష్టాచార్యుల బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణలు,మంగళవాయిద్యాల నడుమ శ్రీ సీతారామస్వామివార్ల దివ్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు.ఆలయంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని తరించారు.ఈ మహోత్సవంలో గ్రామ పెద్దలు కొత్తపల్లి ధనుంజయ రాజు,గోకరాజు వాసుదేవరాజు,కృష్ణంరాజు,మంతెన నరసింహ మూర్తి రాజు,పొన్నపల్లి సత్యనారాయణ,కొట్రా రామకృష్ణ,బుర్ర జై రామకృష్ణ,జుజ్జవరపు సురేష్,యేమినేని డానియలుతో పాటు గ్రామ పురప్రముఖులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## రోడ్డు ప్రమాదంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి మృతి

**రేపల్లె, ఆగస్టు 21, ప్రభాతవార్త:** గుంటూరు పట్టణంలోని గోరంట్లకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మాలెంపాటి రవికుమార్(62) రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఉదంతమిది.పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం రవికుమార్,ఉప్పులూరి శ్రీకృష్ణ శ్రీనివాస్,కొమ్మినేని శ్యాంబాబులు ఎపి27 బిసి 4735 నెంబరు గల హోండా అమేజ్ కారులో రేపల్లెలోని నేతాజీనగర్‌కు చేరుకున్నారు.ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఫ్లాట్‌ను కొనుగోలు చేయడానికి చూసుకున్నారు. గుంటూరుకు తిరిగి వెళ్ళే క్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో రేపల్లె నుండి భట్టి ప్రోలు వైపుకు వెళ్ళే ఎన్‌హెచ్ 216 రహదారిలో కాలభైరవ స్వామి గుడి దాటాక అతివేగంగా అజాగ్రత్తగా కారును నడుపుతూ మురుగుకాల్వ వంతెనను ఢీకొట్టడంతో రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.గాయపడిన శ్రీకృష్ణ శ్రీనివాస్,శ్యాంబాబులను వైద్య చికిత్స నిమిత్తం 108 వాహనంలో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.రేపల్లె సిఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







## బాపట్లలో దళితుల ధర్నాను జయప్రదం చేయాలి

**రేపల్లె, ఆగస్టు 21, ప్రభాతవార్త:** దళితుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీ బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు.శుక్రవారం రేపల్లె మండలంలోని బొబ్బర్లంక,నల్లూరిపాలెం,పెనుమూడి,రేపల్లె పట్టణంలోని దళిత వార్డుల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు.దళిత గ్రామాల అభివృద్ధికి ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు.దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలని చనిపోతే ఖననం చేసుకునేందుకు స్మశాన స్థలం కేటాయించాలని,ఉన్న స్మశాన స్థలాలకు ప్రహరీ గోడ నిర్మించాలని,దళితవాడల్లో రోడ్లు,డ్రెయినేజీలు,కమ్యూనిటీ హాల్స్ ,మంచినీటి వాటర్ ట్యాంక్స్ నిర్మించాలని,ఎస్సీ ,ఎస్టీ కార్పొరేషన్ రుణాలు,కౌలు రైతు రుణాలు మంజూరు చేయించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.దానియేలు,రాహేలు,ప్రకాశం,దున్న బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



## ఏఈఈ పోస్టుల భర్తీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### -ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు

**బాపట్ల,ఆగస్టు21,ప్రభాతవార్త.ప్రతినిధి:** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల నియామక పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ పోస్టుల కోసం రాష్ట్రవ్యాప్తంగా1.05 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌విధానంలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలను రోజుకు రెండు షిఫ్టుల్లో నిర్వహించటం జరుగుతుందన్నారు.మొదటి షిఫ్ట్ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఉంటుందన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద నిఘా కట్టుదిట్టం చేశామని,అభ్యర్థులకు ఫేస్ వెరిఫికేషన్‌తో పాటు మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు.అభ్యర్థులు తమ ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు,పాన్ కార్డు,ఓటర్ ఐడీ,పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదైనా ఒక అసలు ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, కాలిక్యులేటర్లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ఎలాంటి పుస్తకాలు,కాగితాలను అనుమతించబోమని హెచ్చరించారు.ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసపూరిత మాటలు చెప్పే దళారులను,మధ్యవర్తులను అభ్యర్థులు అస్సలు నమ్మవద్దని, కేవలం విద్యుత్ సంస్థల అధికారిక ప్రకటనలనే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు.



## అర్హులకు నేతన్న సేవ పథకం అమలుచేయాలి

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 21, ప్రభాతవార్త:** నేతన్న సేవ పథకం ద్వారా లబ్ధిపొందని అర్హులైన చేనేత కార్మికులకు తక్షణమే వారి బ్యాంకు ఖాతాలో రూ.25 వేలు జమచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు గొట్టుముక్కల బాలాజీ,సత్యనారాయణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భట్టి ప్రోలు ఎఐటియుసి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.అర్హత కలిగిన చాలా మంది కార్మికులకు నేటికీ నగదు జమకాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో చేనేత నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు,కె.వీర మోహనరావు,బట్టు నాగమల్లేశ్వరరావు,వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




## అగ్ని బాధితులకు దుస్తులు,నిత్యావసర సరుకులు,బియ్యం అందజేత

**కర్లపాలెం,ఆగస్టు21,ప్రభాతవార్త :** సంయోచితమైన సహాయాన్ని అందిస్తున్న కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇనకొల్లు పోలీసురావు. ఈరోజు కంకటపాలెం గ్రామంలో ఇల్లు కాలిపోయిన వారికి దుస్తులు, నిత్యవసర సరుకులు, బియ్యం మొదలగునవి అందించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ రావు మాట్లాడుతూ స్నేహితుడు బొంత శామ్యూల్ త్యాగరాజు సహకారంతో ఈ సహాయాన్ని అందించామని తెలిపారు. ఇల్లు కాలిపోయిన జుట్టురి శ్రీనివాసరావు, ఓ చూరి పిచ్చయ్య రెండు కుటుంబాలకు చేయూత నందించ్చారు.ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరు బాధ్యత పోలీస్ రావు అన్నారు. బాపట్ల జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగిన శామ్యూల్ త్యాగరాజ్ తనవంతు సహకారాన్ని అందిస్తున్నారని అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణ జీవన్ మినిస్ట్రీస్ కోశాధికారి కనపర్తి రాజారావు,శ్రీనివాసరావు,కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



## కొల్లిపరలో భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

**కొల్లిపర,అగస్టు 21 ప్రభాతవార్త:** శ్రావణ శుక్రవారం కావటంతో మండలంలోని దేవాలయాల్లో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.దీనిలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయం అమ్మవారి దర్శనం కోసం భక్తులతో నిండి పోయింది.ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు పర్యవేక్షణ లో లక్ష్మీదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు చేసారు.పాడిపంటలు సమృద్ధిగా పండాలని..సకాలంలో వర్షాలు పడి గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు పూజలు చేసారు.అనంతరం భక్తులకు పులిహోర, ప్రసాదం వితరణ గావించారు.ఇదే విధంగా శ్రీగంగా పార్వతీ సమేత ముక్కేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో,శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం, శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో పండితులు జగన్నాధాచార్యులు, కుమారస్వామి,పిచ్చయ్యశర్మ,నిరంజన్‌శర్మలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేసారు.



## సమగ్ర తెగుళ్ళ యాజమాన్య పద్ధతులను పాటించాలి

### -బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు

**కొల్లివర,అగష్టు 21 ప్రభాతవార్త:** రైతులు సమగ్ర తెగుళ్ళ యాజమాన్య పద్ధతులను పాటించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో వాణిజ్య పంటలైన పసుపు,అరటి,కంద,కూరగాయల పంటలతో పాటు మాగాణీ భూముల్లో వెద పద్ధతి ద్వారా వేసిన వరి పంటలను బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరిశీలించారు.అధిక ఉష్ణోగ్రతలపై..తెగుళ్ళపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.అనంతరం ఆరిమండ వారి కళ్యాణ మండపం వద్ద జరిగిన సమావేశంలో విద్యార్థులు మాట్లాడుతూ ఉష్ణోగ్రతల వల్ల పంటలకు తెగుళ్ళు వచ్చే అవకాశం ఉందన్నారు.ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు..నేలలో తేమశాతం తగ్గటం వల్ల పంటలు వత్తిడికి గురై దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.పసుపు పంటలో మెల్చింగ్ సమయానుకూల నీటిపారుదల,సమతుల్య పోషక యాజమాన్యం చేపట్టాలన్నారు.సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో శ్రేష్ఠ ఏఫ్‌పేసీ చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి,డైరెక్టర్లు ఉయ్యూరు సాంబిరెడ్డి,దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి,బొంతు వేణుగోపాలరెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాలో తపులను సవరించుకోవాలి

**వేమూరు ఆగస్టు 21 (ప్రభాతవార్త) :** ఓటరు ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న తప్పు సవరణ, ఓటర్ మ్యాపింగ్‌పై శుక్రవారం సచివాలయం వద్ద క్లైములను పరిశీలించారు. ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో 104 బూత్‌లో ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న తపులను సవరించేందుకు నోటీసులు అందుకున్న ఓటర్లను పిలిపించి విచారించారు. వారి వద్ద తగిన ఆధారాలు తీసుకుని సవరణ చేయడం జరుగుతుందని ఎంపీడీవో రవికుమార్ తెలియజేశారు. ఆయనతో పాటు ఎన్నిల సిబ్బంది శ్రీనివాసరావు, బిఎల్‌వోలు ఉన్నారు.



## వార్డు డీలిమిటేషన్ ప్రతులు విడుదల

**తెనాలి మున్సిపాలిటీ, ఆగస్ట 21,(ప్రభాతవార్త):** ప్రస్తుతమున్న తెనాలి పురపాలక సంఘవార్డుల సంఖ్యను 40 నుండి 52వార్డులకు పెంచుచు ప్రభుత్వము వారు అమోదించిన డిలీమిటేషన్ (పునర్వ్యభజన)ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ గజిట్ నందు ప్రచురించుట జరిగిందని, సదరు ప్రచురించిన ప్రతులు నకళ్ళును పురపాలక సంఘ కార్యాలయం నోటీసు బోర్డు నందు ప్రజల పరిశీలనార్థం ఉంచబడిందని మున్సిపల్ కమీషనర్ రామ అప్పల నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఇంజనీర్ పి శ్రీకాంత్, మునిసిపల్ మేనేజర్ విల్సన్ జయకర్ మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



**ఓటరు వివరాలు పక్కాగా నిర్వహించండి.**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ సూచనలతో మున్సిపల్ ఎలక్షన్స్ లో భాగంగా స్వర్ణ వార్డు సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సూచనలు సలహాలు తెలియజేసియున్నారు. సిబ్బంది అందరు కూడా ఓటరు వెరిఫికేషన్ చాలా బాధ్యతగా చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ,ఓసీ ఓటర్స్ వెరిఫికేషన్ లో సమాచారం పక్కాగా సేకరించాలన్నారు.

## ఘనంగా ఏపీ ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ మాస సమావేశం

**తెనాలి ఆగస్ట 21(ప్రభాతవార్త):** ఏపీ ఇండిపెండెట్ పాస్టర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆగస్టు మాస సమావేశాన్ని పట్టణంలోని సుల్తానాబాద్ లో గల బైబిల్ రీడింగ్ సెంటర్ నిర్వాహకులు, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఆర్ డేనియల్ అధ్యక్షతన రీడింగ్, వర్షిప్ సెంటర్లో జరిగింది. శుక్రవారం జరిగిన ఆ సమావేశానికి 60 మంది సేవకులు, సేవకురాండ్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రసంగికులుగా చిత్తూరు నుండి విచ్చేసిన ఎం కొర్నిలియస్ పాల్ హాజరై వాక్య పరిచర్య చేశారు. కొర్నిలియర్ పాల్ రచించిన పుస్తకాలను ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు రావూరి విక్టర్ పాల్ చేతుల మీదుగా సమావేశానికి హాజరైన సేవకులకు ఉచితంగా పంపిణీ చేయించారు. సమావేశానికి హాజరైన పాస్టర్లను ఉద్దేశించి, ఫెడరేషన్ కార్యక్రమాల ఉద్దేశించి ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ పి జాన్ వెస్లీ విలువైన విషయాలను పంచుకున్నారు. సేవకుల ఉద్దేశించి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కారుమూరి జకరయ్య మాట్లాడుతూ పాస్టర్లకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు. అవసరమైనచోట క్రైస్తవులకు స్మశాన వాటికల ఏర్పాటు అంశంపై ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఫెడరేషన్ సంకల్పించినట్లు చెప్పారు. ఫెడరేషన్ పట్టణ అధికార ప్రతినిధి ఎం లాజరస్, బిషప్ డేవిడ్ పాల్ పాస్టర్లను ఉద్దేశించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమావేశ కార్యక్రమాలను పాస్టర్లు సిహెచ్ ఎబినైజర్, పి జానేష్, ఎన్ ధనరాజ్ లు పర్యవేక్షించారు. సమావేశాలకు హాజరైన పాస్టర్లకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాలను ఫెడరేషన్ కార్యదర్శి రావూరి పాల్ రాజ్ నిర్వహించారు. సమావేశపు ముగింపు ప్రార్థన ఆశీర్వాదాలను ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఆర్ డానియల్ అందజేశారు. ఈరోజు మాములుగా జనరల్ గా సమావేశంలో ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## ఆభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో జానపద కళా వేడుకలు

**తెనాలి మున్సిపాలిట, ఆగష్టు21,(ప్రభాతవార్త):** జనజీవన స్రవంతిలో జానపదానికి విడదీయలేని సంబంధమని, పూర్వకాలంలో ఆ బాల గోపాలాన్ని ఉర్రూతలూగించిన జానపద కళారూపాలు, మనసును ఆకట్టుకునేవి అని వక్తలుఅన్నారు. జానపద కళ శ్రమైక జీవన సౌందర్యానికి అద్దం పట్టే శతాధిక జానపద కళారూపాలు, తెలుగువారి కళాపిపాసాన్నివాడవాడల చాటిన వైభవంచరిత్రలో కలిసిపోతుందని, జానపదాన్ని రక్షించుకోవాల్సిన అవసరం,ఈ తరం వారికి ఎంతైనా ఉందని అన్నారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల జానపద కళారూపాలను పోల్చుకుంటే, తెలుగు రాష్ట్రాల్లో ఉన్నన్ని జానపద కళారూపాలు వేరే ఏ దేశంలో లేవని ఇది నిత్య సత్యమని వక్తలు కొనియాడారు.




**అభ్యుదయ కళా సమితి తెనాలిఆధ్వర్యంలో ..**

22 సాయంత్రం 4:00 నుండి కళా ఉత్సవాలు శివాజీ చౌక్ నుండి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం వరకువివిధజానపదకళారూపాలైన కోలాటం, చెక్కభజన, డప్పు వాయిద్యాలు తదితర జానపద విన్యాసాలతో ఊరేగింపు సాగుతుందని తెలిపారు. అనంతరం దేవస్థానం ఆవరణలో జానపద కళారూపాలు, జానపద గీతాలు, పెద్దల సందేశాలు ఉంటాయని తెలిపారు.సమావేశంలోఆభ్యుదయకళాసమితివ్యవస్థాపక ఆద్యక్షులు బొల్లిముంతకృష్ణ,బెల్లంకొండ వెంకట్,దేవరపల్లి నీలాంబరం,యం. వి.రఘునాదరావు, బీమేశ్వరప్రసాద్,అనురాధ,వెంకటరమణ,కె.మోనిక,వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాసవీమాత సన్నిధిలో అలరించిన భక్తి సంగీత విభావరి

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట 21(ప్రభాతవార్త):** శ్రావణ శుక్రవార వరలక్ష్మి వ్రతం నేపధ్యంలో, శ్రీవాసవీమాత సన్నిధానంలో, శుక్రవారం సాయంత్రం అలరించిన భక్తి సంకీర్తనా విభావరి.స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం ఓపెన్ ఆడిటోరియంలో, రేడియో, టివి, గాయకులు, ముంబై కి చెందిన, సంకీర్తనాకారిణి, నారాయణం వరలక్ష్మి, సిహెచ్. రాజ్యలక్ష్మి, కె. శాంతి బృందం, రాగతాళ యుక్తంగా ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. ఓబొజ్జ గణపయ్య, బుజ్జి గణపయ్య అంటు గణపతి కీర్తిస్తూ ప్రారంభమైన సంకీర్తనా గానంలో, శ్రీనివాస గోవిందా, శ్రీవెంకటేశ గోవిందా, బ్రహ్మ కడిగిన పాదము వంటి కీర్తనలు రాళతాళ యుక్తంగా ఆలపించి సభికులను పరవశమింపజేశారు. ఈసందర్భంగా సంకీర్తనా కారిణి నారాయణం వరలక్ష్మి మాట్లాడుతు ఇదే ఆలయం ప్రాంగణంలో, 20సంవత్సరాలకు ముందు, సంకీర్తనలు చేశామని, మరలా ఇన్నాళ్ళకు అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. హనుమాన్ భక్తులు, ఆద్యాత్మిక సేవాభిలాషి వుప్పల వరదరాజులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



## తెనాలి పట్టణంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తెనాలి, ఆగస్ట 21,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని అధికారులు తెలిపారు.11 కె.వి. లైన్ మరమత్తులు, లైన్ లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించు పనులు జరుగుతున్న కారణముగా తెనాలి పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డు,నాజర్ పేట,గురవయ్య కాలనీ, ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేయుచున్నామని, శనివారం ఉదయం 8:30 గంటల నుండి మధ్యానం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, కావున వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించగలరని, ఎ.పి.సి.పి.డి.సి.యల్, తెనాలి ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రావణమాసశోభలో శ్రీ అష్టలక్ష్మి అమ్మవారు

**తెనాలి,ఆగస్ట21,(ప్రభాతవార్త):** శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా, పట్టణంలోని కొత్తపేట శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో, శ్రీ అష్టలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో, భక్తులకు దర్శనమిచ్చారు.

**శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు:**

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా, బోస్ రోడ్డు లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మరియు శ్రీ నగరేశ్వర స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వరలక్ష్మి వ్రతం సందర్భముగా పట్టణం లోని మహిళలందరూ ఉదయాన్నే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని శ్రీ వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి గాజులతో అలంకరణ చేశారు ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.



# డిగ్రీ ఉన్నా యువతకు ఏవీ ఉద్యోగాలు?

## నీతి ఆయోగ్ ప్రత్యేక నివేదిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారతదేశంలో ఉన్నత విద్య పూర్తిచేస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతున్నా, వారి అర్హతకు తగిన ఉద్యోగాలు పొందడంలో తీవ్రంగా విఫల మవుతున్నారని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని కళాశాల విద్యకు, ఉద్యోగ మార్కెట్ అవసరాలకు మధ్య తీవ్ర అంతరం ఉందని తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. "వికసిత్ భారత్ 2047 కోసం నైపుణ్యాలపై పునరాలోచన పేరుతో ఆగస్టు మధ్యలో విడుదల చేసిన ఈ పత్రంలో పలు కీలక విషయాలను వెల్లడించింది. నివేదిక ప్రకారం, దేశంలో డిగ్రీ పూర్తి చేస్తున్న వారిలో కేవలం 8.25 శాతం మంది మాత్రమే తమ చదువుకు సంబంధించిన ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. కళాశాలల్లో బోధించే సిలబస్‌కు, పరిశ్రమల వాస్తవ అవసరాలకు మధ్య ఏమాత్రం పొంతన ఉండటం లేదని నీతి ఆయోగ్ తేల్చి చెప్పింది. చాలా విద్యాసంస్థల్లో పాఠ్యప్రణాళికలు కాలం చెల్లినవిగా ఉన్నాయని, అవి పరిశ్రమల డిమాండ్లకు అనుగుణంగా లేవని పేర్కొంది. బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సాధారణ డిగ్రీలు నేరుగా ఉద్యోగాలను అందించడంలో విఫలమవుతున్నాయని, కనీస స్థాయి ఉద్యోగాలకు కూడా అదనపు ప్రాక్టికల్ నైపుణ్యాలు అవసరమవుతున్నాయని వివరించింది. ఈ సమస్యపై విద్యార్థుల్లోనూ స్పష్టమైన అవగాహన ఉన్నట్లు నివేదిక తెలిపింది. తమ చదువులో నైపుణ్యాల కొరత ఒక ప్రధాన సమస్య అని 34 శాతం మంది విద్యార్థులు అభిప్రాయపడగా, ఇంటర్వ్యూలకు సరిగా సిద్ధం కాలేకపోతున్నామని మరో 18 శాతం మంది పేర్కొన్నారు. పరిమితంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగాల కోసం నెలకొన్న తీవ్రమైన పోటీనే ఈ సంక్షోభానికి నిదర్శనమని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. ఇటీవలి కాలంలో కేవలం 55వేల ప్రభుత్వ పోస్టుల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని తెలిపింది. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు నీతి ఆయోగ్ కొన్ని కీలక పరిష్కారాలను సూచించింది. 6వ తరగతి నుంచే విద్యార్థులకు ఉపాధి, వ్యవస్థాపక నైపుణ్యాలపై శిక్షణ ప్రారంభించాలి. అప్రెంటిస్‌షిప్‌లను ఉద్యోగాలు పొందేందుకు ఒక ప్రధాన మార్గంగా మార్చాలి. నియామకాల్లో డిగ్రీలకే అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా, అభ్యర్థుల వాస్తవ నైపుణ్యాలను అంచనా వేసే విధానం తీసుకురావాలి. డిగ్రీ కోర్సుల్లో పరిశ్రమలకు సంబంధించిన ప్రాక్టికల్ శిక్షణను తప్పనిసరి చేయాలి. కేవలం పట్టభద్రుల సంఖ్యను పెంచడం వల్ల ప్రయోజనం లేదని, నైపుణ్యాల అంతరాన్ని పూడ్చకపోతే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న లక్ష్యానికి ఆటంకం కలుగుతుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. దేశానికి ఉన్న జనాభా ప్రయోజనం, అవకాశంగా మారాల్సింది పోయి భారంగా మారే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది.




# ఎమ్మెల్యేలందరికి 'కారు' పథకం!

## తమిళ సీఎం విజయ్ ప్రతిపాదనను తిరస్కరించిన డీఎంకె

**చెన్నై, ఆగస్టు 21:** తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో కార్లు అందజేస్తామని ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను తమ పార్టీ తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 234మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గ పనుల నిమిత్తం ప్రభుత్వ వాహనాలను సమకూర్చుతామని ప్రకటించారు. వీటితో పాటు డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక నేపథ్యంలేని కొత్త ఎమ్మెల్యేలకు ఇది ఎంతో ఊరటనిస్తుందని, పారదర్శకమైన, అవినీతిరహిత పాలనకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రం అప్పుల్లో ఉందని చెబుతున్న టీవీకే ప్రభుత్వం, ఇప్పుడు ఎమ్మెల్యేలకు కార్లు పంపిణీ చేయడమేమిటని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఈ కార్లను తీసుకోబోరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించి, సొంత వాహనాలు లేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు. డీఎంకే విమర్శలపై మంత్రి ఆధవ్ అర్జున ఘాటుగా స్పందించారు. ఈ పథకం కింద సొంతంగా కారు లేని ఎమ్మెల్యేలకు మాత్రమే వాహనాలు కేటాయిస్తామని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది విలాసంకాదని, ప్రజాసేవకు అవసరమైన కనీస సదుపాయమని వ్యాఖ్యానించారు. అనేక బంగ్లాలు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎందుకు నివసిస్తున్నారని ఆయన నిలదీశారు. ముఖ్యంగా చిన్న పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ వాహనాలు ఎంతో అవసరమని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.

# షిర్డీ సాయిబాబాపై అభ్యంతర విడియోలు

## ఢిల్లీ కోర్టులో షిరిడి సంస్థాన్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** షిర్డీ సాయిబాబాపై యూట్యూబ్, ఇతర ఆన్‌లైన్ వేదికల్లో ఉన్న అభ్యంతరకర వీడియోలు, కథనాల తొలగింపు విషయంలో ఢిల్లీ హైకోర్టు మరోసారి జోక్యం చేసుకుంది. ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని యూఆర్ఎల్‌లు ఇంకా తొలగించలేదని షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ ఆశ్రయించడంతో కేంద్ర ప్రభుత్వం, గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ), గూగుల్‌కు ఉన్నత న్యాయస్థానం కొత్తగా నోటీసులు జారీ చేసింది. సాయిబాబాను చాంద్ మియా, జిహాదీ, హంతకుడు రేపిస్ట్, బ్రిటిష్ గూఢచారి, దొంగ వంటి తీవ్రమైన పదజాలంతో చిత్రీకరిస్తూ, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మార్ఫ్ చేసి నెల నుంచి కొన్ని వీడియోలు, కంటెంట్ ప్రచారంలో ఉన్నాయని శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డీ) తమ పిటిషన్‌లో ఆరోపించింది. ఈ కంటెంట్ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని పేర్కొంది. ఈ కంటెంట్ తొలగింపునకు మొదట యూట్యూబ్‌ను సంప్రదించగా, కోర్టు ఆదేశాలు లేకుండా కుదరదని వారు తిరస్కరించారు. దీంతో ట్రస్ట్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం, ఆగస్టు 11న ఈ అంశంపై 7 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ)ని ఆదేశించింది. ఆగస్టు 13న సమావేశమైన జీఏసీ, ఈ వీడియోలు మత విశ్వాసాలను దెబ్బతీస్తాయని, సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తాయని నిర్ధారించి, వాటిని తొలగించాలని ఆదేశాలు ఇచ్చింది. జీఏసీ ఆదేశాల తర్వాత కూడా కొన్ని వీడియోలు, సుమారు 200కు పైగా యూఆర్ఎల్‌లు ఇంకా ఆన్‌లైన్‌లోనే ఉన్నాయని ఆగస్టు 20న ట్రస్ట్ మళ్లీ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో హైకోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. కొత్త ఫిర్యాదులు వస్తే వాటిని కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను సెప్టెంబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అభ్యంతరకర కంటెంట్‌ను 24గంటల్లోగా తొలగించాలని ఇంటర్మీడియరీలకు ఆదేశాలు జారీ చేశామని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది.

# దేశభద్రతకు సరిహద్దుల పటిష్టత అత్యంత ఆవశ్యకం

## ఎస్ఎస్‌పి కేంద్రకార్యాలయ భవన నిర్మాణాలకు అమిత్‌షా భూమిపూజ



**కోల్‌కత్తా, ఆగస్టు 21:** కొత్తగా నిర్మించనున్న భారీ ఎస్ఎస్‌బీ పరిపాలనా భవనం సరిహద్దు రక్షణ చర్యలను నిరంతరం పర్యవేక్షించడానికి, పెద్ద ఎత్తున బలగాలను మోహరింపజేయడానికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. జాతీయ భద్రత విషయంలో కేంద్రం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశంలో శాం తిభద్రతలు వర్ధిల్లాలన్నా, పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశమంతటా సురక్షిత వాతావరణం నెలకొనాలన్నా సరిహద్దు వెంబడి శత్రువుల కదలికలను పూర్తిగా అరికట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగా భద్రతా బలగాలకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో అత్యంత వ్యూహాత్మక ప్రాంతమైన సిలిగురి కారిడార్ రక్షణను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నూతన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సిలిగురిలో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో సశస్త్ర సీమ బల్ ఫ్రాంటియర్ ప్రధాన కార్యాలయ పరిపాలనా భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన సభలో అమిత్ షా మాట్లాడారు. దేశ సరి హద్దులు బలోపేతం కానంత వరకూ భారత్ ఎంత మాత్రం సురక్షితంగా కాదని తేల్చి చెప్పారు. నలుమూలలా వ్యాపించి ఉన్న సరిహద్దులను మరింత పటిష్ట పర్చుకోవాల్సి ఉందని అన్నారు. సిలిగురి కారిడార్‌ను దేశంలో అత్యంత సున్నితమైన, భౌగోళిక వ్యూహాత్మక ప్రతిపత్తి కలిగిన ప్రాంతమని ఆయన వ్యాఖ్యా నించారు. ఇప్పటివరకు దీనికి తగిన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలను ప్రధాన భూభాగంతో అనుసంధానించే ఈ చికెన్స్ నెక్ ప్రాంత భద్రత దేశ సార్వభౌ మాధికారానికి ఎంతో కీలకమని అమిత్ షా అన్నారు. ఇక్కడ ఈ సందర్భంగా గత తృణ మూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అమిత్ షా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి చొరబాట్లను నిరోధించేందుకు కంచె వేయాలని కేంద్రం భావిం చినప్పటికీ దీనికి కావలసిన భూమిని కేటాయించడంలో గత మమత బెనర్జీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. సరిహ ద్దుల రక్షణ పటిష్ట పర్చడానికి తాము 2014 నుంచి దాదాపు 1,129 ఎకరాల భూమిని పదేపదే కోరుతున్నప్పటికీ నాటి పాలకుల నుంచి సరైన సహకారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సేనలను రాజకీయాలకు అతీతంగా చూడాలని అమిత్ షా ప్రజాప్రతి నిధులకు పిలుపునిచ్చారు.

# మోడీ మాదేవుడు.. ప్రెస్‌క్లబ్‌లో మోడీ చాలీసా




**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ప్రధాని నరేంద్ర మోడీని దేవుడిగా చిత్రీకరిస్తూ ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన మోడీ చాలీసా కార్యక్రమం పెనుదుమారం రేపింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. బీహార్ రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డుసభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోడీ శ్రీరాముడి రూపంలో చిత్రీకరించిన భారీ కటౌట్‌ను దేవుడి రూపంలో నిలబెట్టి, జైజై మోడీ, హర్‌హర్ మోడీ అంటూ నినాదాలు చేస్తూ హారతులు ఇచ్చారు. ఈ ఘటనపై తీవ్రవ్యతిరేకత రావడంతో ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) వెంటనే స్పందించి వివరణ ఇచ్చింది. ఈ కార్యక్ర మంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ కోసం నిర్వాహకులు హాల్‌ను అద్దెకు తీసుకున్నారని, కానీ వారు నిబంధనలను ఉల్లంఘించి మతపరమైన కార్యక్రమాన్ని నిర్వ హించారని పీసీఐ ఎక్స్ వేదికగా తెలిపింది. విషయం తెలియగానే తమ అధికారులు జోక్యం చేసుకుని కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపివేశారని పేర్కొంది. ఈ కార్యక్రమాన్ని బీహార్ ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు వైస్‌ప్రెసిడెంట్ రాజన్ సింగ్ గట్టిగా సమర్థించుకున్నారు. మోడీ ప్రభుత్వం వల్లే తమ కమ్యూనిటీకి తొలిసారిగా హక్కులు, ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన అన్నారు. అందుకే తాము ఆయన్ను దైవంగా భావిస్తున్నామని తెలిపారు.

# వ్యూహం మార్చిన రాహుల్..

## జెన్‌జీ, యువతుల సమస్యలపైనే ఎక్కువ ఫోకస్



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారీ సభలు, సుదీర్ఘ సమయం ప్రసంగాలు, రాజకీయ నినాదాలు లాంటి సంప్రదాయ ప్రచారానికి భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడు యువతతో నేరుగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జనరేషన్‌జెడ్ (జెన్‌జీ), యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో ముఖాముఖి చర్చిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగానూ అదే తరహా సంభాషణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. యువతను చేరుకునే ఈ ప్రయత్నం ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంతో మరింత ఊపందుకుంది. పోటీ పరీక్షల ఒత్తిడి, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో జాప్యం వంటి సమస్యలపై ఇందులో చర్చలు జరిగాయి. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్ వంటి కేంద్రాల్లో మొదలైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించింది. ఇటీవల పూణెలో జరిగిన కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ యువతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కెరీర్‌లో ఎదురయ్యే అడ్డంకులు, భద్రత, ఉద్యోగ ప్రదేశాల్లో పరిస్థితులు, కుటుంబం, సమాజం విధించే ఆంక్షలపై వారితో మాట్లాడారు. సమాజం తమను ఎలా చూస్తోంది భయాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు ఎలాంటి హింసను ఎదుర్కొం టున్నారు. అది ఎక్కడ జరుగుతోంది వంటి అంశాలపై యువతులు తమ అనుభవాలను పంచుకోవాలని రాహుల్ కోరారు. మహిళా సహచరులు పంచుకున్న వ్యక్తిగత అనుభవాలను కూడా రాహుల్‌గాంధీ చర్చకు తీసుకొచ్చారు. శ్రద్ధ పేరుతో నియంత్రణ, చిన్న వయసులో పెళ్లి, పితృస్వామ్య భావజాలం, నైతిక పోలిసింగ్, భద్రత, వైద్య సదుపాయాల కొరత, వ్యక్తిగత నిర్ణయాలపై ఆంక్షల వంటి అంశాలు చర్చకు వచ్చాయి. డిజిటల్ వేదికల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నలుసమాధానాలు, రీల్స్ వంటి సులభమైన ఫార్మాట్లతో యువతను చేరుకుంటున్నారు. గిగ్ ఎకానమీలో ఉద్యోగ భద్రత, మానసిక ఆరోగ్యం వంటి ఆధునిక సమస్యలపై మాట్లాడుతున్నారు. రాహుల్‌గాంధీ వ్యూహంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అన్నారు. భారీ ప్రసంగాల నుంచి నేరుగా సంభాషణ వైపు ఆయన అడుగులు వేస్తున్నారు. యువత ఏం ఆలోచిస్తోంది ఏ సమస్యలను ఎదుర్కొంటోంది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ సంభాషణను ఏకపక్ష ప్రసంగం నుంచి రెండు వైపుల చర్చగా మార్చడమే ఈ వ్యూహం లక్ష్యంగా కనిపిస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## పశ్చిమాసియాను వీడిన యుఎస్ యుద్ధనౌక




**వాషింగ్టన్, ఆగస్టు 21:** అమెరికా యుద్ధనౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా సముద్రజలాల నుంచి తిరుగుప్రయాణం మొదలుపెట్టింది. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో గత 9నెలల నుంచి ఆయుద్ధనౌక హర్ముజ్ సమీపంలో ఉన్నది. అయితే ఇరాన్‌పై యుద్ధంచేసిన ఆ యుద్ధనౌక సైనికులు ప్రస్తుతం మానసికంగా, శారీరకంగా క్షీణించినట్లు తెలిసింది. ఆహార నిల్వలు కూడా తగ్గడంతో యుద్ధనౌక వెనుతిరుగుతున్నట్లు భావిస్తున్నారు. శాన్‌డియాగోకు నౌకపయనమైనట్లు తెలుస్తోంది. దీని స్థానంలో యుఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్ యుద్ధనౌక అక్కడకు చేరుకుని ఆపరేషనల్ డ్యూటీస్ నిర్వర్తించనున్నది.

## 22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్



**మొగదిషు, ఆగస్టు 21:** యెమెన్, సోమాలియా తీరాల్లో వేర్వేరు ఘటనల్లో 22 మంది భారతీ యులతో ప్రయాణిస్తోన్న రెండు వాణిజ్య నౌకలను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. ఈ విషయాన్ని సోమాలియా షిప్పింగ్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. అధికారులు వెల్లడించిన ప్రకా రం ఈ నెల 17న సోమాలియా తీరంలో కామెరూన్ పతాకంతో వెళ్తోన్న 'లుటుఫ్' అనే కార్గో నౌక హైజాక్ అయ్యింది. తుర్కియే ఆయుధాలను తరలిస్తోన్న ఆ నౌకలో 10మంది సిబ్బంది ఉండగా. వారిలో ఆరుగురు భారతీయులు కాగా మిగిలినవారు తుర్కియే, జార్జియా, సెర్బియాకు చెందిన వారు.

## అలాస్కాలో కుప్పకూలిన చార్టర్ విమానం: 8మంది మృతి




**వాషింగ్టన్, ఆగస్టు 21:** అమెరికాలోని అలాస్కాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ అలాస్కాలోని మారుమూల ప్రాంతంలో ఓచార్టర్ ప్లేన్ కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 8మంది మృతిచెందినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. ప్రమాదానికి గురైన విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులుఉన్నట్లు అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు (ఎన్‌టీఎస్‌బి) అలాస్కా ప్రాంత అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. గురువారం యాంకరేజ్ నుంచి విమానం బయలుదేరి కేప్ న్యూనెహామ్ ప్రాంతానికి చేరుకుంటుండగా ప్రమాదం జరిగింది.

## హత్యకేసులో శిక్ష అనుభవిస్తున్న 105యేళ్ల వ్యక్తి విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** మర్డర్ కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న 105ఏళ్ల వ్యక్తిని రిలీజ్ చేయనున్నారు. ఆ కేసును శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. అతనిపై ఉన్న జీవితకాల శిక్షను ఎత్తివేసింది. అతని వయసును దృష్టిలో పెట్టుకుని సుప్రీం తన తీర్పును వెలువరించింది. రసిక్ చంద్ర మోండల్‌పై 1994లో అతను 68 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మర్డర్ కేసు నమోదు అయ్యింది. ఆ కేసులో 2024 నవంబర్ 29 వరకు జైలులో ఉన్నాడు. ఆ ఏడాది అతనికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరీ చేసింది. అయితే ఆకేసును మూసివేస్తున్నట్లు శుక్రవారం కోర్టు తెలిపింది.

## సమాజ్‌వాది పార్టీలో చేరిన షయాన్ మసూద్



**లక్నో, ఆగస్టు 21:** ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేత, సహారన్‌పూర్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌కు రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అల్లుడు షయాన్ మసూద్ కాంగ్రెస్‌ని వీడి, సమాజ్‌వాదీపార్టీ(ఎస్పీ)లో చేరారు. ఈ పరిణామం పశ్చిమ యూపీరాజకీయాల్లో చర్చనీ యాంశంగా మారింది. లక్నోలోని సమాజ్‌వాదీపార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ సమక్షంలో షయాన్‌మసూద్ అధికారికంగా పార్టీలో చేరారు.

## కుప్పకూలిన గని: 100 మందికిపైగా మృతి



**బాంగ్యుయ్, ఆగస్టు 21:** ఆఫ్రికాలో పెను విషాదం చోటుచేసుకుంది. కామె రూన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (సీఎఆర్) సరిహద్దులో ఉన్న ఓ బంగారు గని కుప్పకూలడంతో 100మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పో యారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జంబోయే గ్రామంలో ఈ ఘోర దుర్ఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కామెరూన్ ఈస్ట్ రీజియన్ గవర్నర్ గ్రెగోయిర్ వోంగో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన గని సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ భూ భాగంలో ఉందని తెలిపారు. ఈ ఘటనలో సుమారు ముగ్గురి నుంచి ఐదుగురు కామెరూన్ జాతీ యులు మరణించి ఉంటారని అంచనా వేశారు.

# రాజధానిలో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ కేసులు

## పరిస్థితిని సమీక్షించిన కేంద్రమంత్రి జెపి నడ్డా




**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశంలో వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో పాటు మారుతున్న ఉష్ణోగ్రతలు ప్రజారోగ్యానికి సవాలుగా మారాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో ఉక్కపోత, తేమతో కూడిన వాతావరణం కారణంగా స్వైన్ ఫ్లూ (హెచ్1ఎన్1) కేసులు వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వ్యాధి పరిస్థితులు, ఆసుపత్రుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్‌తో పాటు పలువురు సీనియర్ వైద్యాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో భాగంగా దేశవ్యాప్తంగా నమోదు అవుతున్న ఊపిరితిత్తుల సంబంధిత ఇన్ఫెక్షన్లు, తీవ్రమైన శ్వాసకోశ సమస్యల ట్రెండ్స్‌ను మంత్రి నిశితంగా పరిశీలించారు. వ్యాధి తీవ్రతను అంచనా వేయడానికి ల్యాబ్ పరీక్షలు, నమూనాల సేకరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నడ్డా స్పష్టం చేశారు. ఢిల్లీ ఆసుపత్రుల్లో బెడ్లు, మందులు సిద్ధం హైఅలర్ట్‌లో ఉన్న రాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సన్నద్ధతను ప్రత్యేకంగా సమీక్షించారు. బాధితులకు తక్షణ వైద్యం అం దించేందుకు అవసరమైన ఐసోలేషన్ వార్డులు, ఐసీయూ బెడ్లు, ప్రాణరక్షక మందులను సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్ట మైన మార్గదర్శకాలు ఇచ్చారు. ముందస్తు ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు.

# జ్యుడీషియల్ సర్వీసుల్లోకి వచ్చే అభ్యర్థులకు

## యేడాది న్యాయవాద ప్రాక్టీస్ తప్పనిసరి



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. సివిల్ జడ్జి (జూనియర్‌డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసు కునే అభ్యర్థులకు మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గిం చింది. మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనను తొలగిం చాలన్న అభ్యర్థనను పూర్తిగా తోసిపుచ్చనప్పటికీ, యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బం దిని దృష్టిలో ఉంచుకుని మార్పులు చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ అంశంపై జస్టిస్ వినోద్ చంద్రన్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుల ప్రత్యక్ష నియా మకాలకు కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, నిబంధనలు కఠినంగా ఉండి యువ లా గ్రాడ్యుయేట్లకు ఇబ్బంది కలగకూడదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 2025 మే 20 నుంచి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు హాజరయ్యే లా గ్రాడ్యుయేట్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకుసుప్రీంకోర్టు మినహాయింపు నిచ్చింది. ఈకాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రెయినీజ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులవుతారు. అలానే వీరు స్టేట్ జ్యుడీషియల్ అకాడమీలో ఒక సంవత్సరం పాటు శిక్షణ పొందాలి.

# ఆసుపత్రి నుంచి జైలుకు ఇమ్రాన్‌ఖాన్



**రావల్పిండి, ఆగస్టు 21:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఇస్లామాబాద్‌లోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. దీంతో ఆయన్ను తిరిగి అడియాలా జైలుకు తరలించారు. వైద్యుల బృందం ఆయనను పరీక్షించి జైలులో కొనసాగేందుకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారించినట్లు పాకిస్థాన్ మీడియా కథనాలు వెలువడ్డాయి. పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తరార్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ నేత్ర వైద్య నిపుణుడు, కార్డియాలజిస్ట్, ఫిజీషియన్ సహా నిపుణుల బృందం ఇమ్రాన్ ఖాన్‌కు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. వైద్యులు ఆయనను మెడికల్‌గా ఫిట్‌గా ప్రకటించారు. పరీక్షల ప్రక్రియ పూర్తైన తర్వాత తిరిగి అడియాలా జైలుకు తరలించారని పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను ప్రైవేట్ ఆసుపత్రి అయిన షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఆయనను ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తీసుకెళ్లినట్లు మంత్రి అత్తావుల్లా తరార్ తెలిపారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌ను అర్ధరాత్రి సమయంలో వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి ఆసుపత్రికి తరలించారు. పరీక్షల అనంతరం తిరిగి జైలుకు తరలించినట్లు జియో న్యూస్ పేర్కొంది.

# ప్రతి ప్రశ్నకు రూ.200 వసూలు

## ఆన్సర్ కీ ఛాలెంజ్ ఫీజుపై ఎన్‌టిఎ స్పష్టత




**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** యుజిసి నెట్ ఆన్సర్ కీపై అభ్యంతరాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్ణయించిన ఫీజుపై విమర్శలు వస్తున్నాయి. ప్రతి ప్రశ్నకు (యుజిసి నెట్) రూ. 200 చొప్పున అంటే అభ్యర్థులపై అధిక భారం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌టిఎ దీనిపై స్పందిస్తూ ఫీజు చెల్లింపు ప్రక్రియపై వివరణ ఇచ్చింది. అభ్యంతరాలు సరైనవతే రీఫండ్ ఉంటుందని స్పష్టం చేసింది. 'ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా ఈ ఆన్సర్ కీ ఛాలెంజ్ సిస్టమ్‌ను రూపొందించాం. ఒక ప్రశ్నకు సంబంధించిన సమాధానంపై ఎవరైనా విద్యార్థి అభ్యంతరం వ్యక్త చేస్తే దాన్ని సబ్జెక్ట్ నిపుణులు పరిశీలిస్తారు. ఒకవేళ సదరు విద్యార్థి అభ్యంతరం సరైనది అయితే.. ఆన్సర్ కీని సవరిస్తాం. కొత్త సమాధానం పరీక్ష రాసిన విద్యార్థులందరికీ వర్తిస్తుంది. సదరు అభ్యర్థి ఛాలెంజ్ సరైనదే అని రుజువైతే ఆ ప్రశ్నకు ప్రతి ప్రశ్నకు రూ.200 చొప్పున ఫీజును నిర్ణయించాం. అంతేగానీ దీన్నుంచి లాభం పొందడానికి కాదు' అని ఎన్టీఏ వెల్లడించింది.

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జెఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు, పిహెచ్‌డి ప్రోగ్రాముల్లో ప్రవేశం కోసం నిర్వహించిన సిఎస్ఐఆర్-యుజిసి నెట్ ప్రాథమిక కీను ఎన్‌టిఎ ఇటీవల విడుదల చేసింది. ఆన్సర్ కీలో ఏదైనా సమాధానం తప్పుగా ఉందని అభ్యర్థులు భావిస్తే ప్రతి ప్రశ్నకు రూ. 200 చెల్లించి కీపై తమ అభ్యంతరాలను తెలియచేయొచ్చని ప్రకటించింది. జూన్ 22 నుంచి 30 వరకు 87 సబ్జెక్టుల్లో యుజిసి నెట్ పరీక్షను నిర్వహించింది. అయితే, ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నపత్రాల్లో వివిధ రకాల లోపాలపై ఫిర్యాదులు రావడంతో ఆ పరీక్షలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ సబ్జెక్టులకు సెప్టెంబరులో మరోసారి పరీక్ష నిర్వహించనుంది.

MN 10 final:MN 10 final 01/01/2001 10:11 Page 1



## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

### -భక్తులతో పోటెత్తిన కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైకి అమ్మవారిని వేంచేపుచేసి వ్రతాలను నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతాలను ఆచరించారు. అర్చకస్వాములు వ్రతానికి సంబంధించిన క్రతువును వివరించారు. మహిళా భక్తులకు పూజ యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ పూజా విధానిన్న



సూచిస్తూ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కోటా రవిశంకర్ నేతృత్వంలో సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## ఎన్నారై ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

### 750 మందికి వైద్య పరీక్షలు,ఉచిత మందులు

**మంగళగిరి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజి, జనరల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో డా. తులసీదేవి పోలవరపు జ్ఞాపకార్థం దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాల ఆవరణలోఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు కలిపి సుమారు 750



మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. సాధారణ వైద్యం, చిన్నపిల్లల వైద్యం, కంటి వైద్యం, చెవి ముక్కుగొంతు, ఎముకలుకీళ్ళ వైద్యం, స్త్రీల వైద్యం అనే 6 విభాగాలలో నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సమగ్ర పరీక్షలు, ప్రాథమిక రోగనిర్ధారణ పరీక్షలు, ఉచిత చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ పాలకమండలి సెక్రటరీ సోము కృష్ణమూర్తి, అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, ఫౌండర్ డైరెక్టర్ డా పోలవరపు రాఘవరావు, ఫౌండర్ డైరెక్టర్ డా ఎన్ . లక్ష్మి, డీన్ డాక్టర్ జి శ్రీనివాసరావు, మెడికల్ సూపరింటెండెంట్ కావూరి కృష్ణప్రసాద్ (బాబు), కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రవీంద్రదితర వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## గుంటూరు సమగ్ర ప్రభుత్వ హాస్పటల్లో పౌష్టికాహార పదార్థాలు పంపిణీ

**గుంటూరు విద్య ఆగస్టు 20 ప్రభాతవార్త :** అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు గుంటూరు జిల్లాలో ఎంతో ఘనంగా సంబరాలతో జరుగుతున్నాయి. దానిలో భాగంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర హాస్పటల్లో ( కాన్పులు ప్రసూతి వార్డులలో ) సుమారు 130 మంది పైగా మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమం అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్ర బాబు ఆధ్వర్యంలో సీనియర్ ఫ్యాన్స్ అందరూ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట డాక్టర్ జి దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేయడం జరిగింది. అలాగే ప్రొఫెసర్ దుర్గాకుమారి ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొనడం జరిగింది. డాక్టర్ దుర్గాప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరంజీవి ఎంతో సంస్కారవంతమైన మానవతావాది అని కొనియాడారు. మేకల రవీంద్ర బాబు మాట్లాడుతూ చిరంజీవి చేస్తున్న వందల వేల సామాజిక సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వారికి భారతరత్న అవార్డు ఇవ్వడం ఎంతైనా సమంజసం అని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీనియర్ అభిమానులు ఎ .శంకర్ రెడ్డి , సిహెచ్ వేణుమాధవ్ , ఆళ్లహరి, సూరిబాబు, శరత్బి, గిడుదూరి సత్యం, బద్రి,మొక్క మాట రమేష్, మాధవరావు, అన్వర్ భాష ఎండి, ఎస్ బాలకృష్ణ,యుగంధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**గుంటూరు విద్య ఆగస్టు 21 ప్రభాతవార్త :** వర్షాకాలంలో డెంగ్యూ, వైరల్ జ్వరాలు, హెచ్1ఎన్1 వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు లెప్టోస్పైరోసిస్ వంటి సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వర్చువల్ డాక్టర్ కన్సల్టేషన్లు, హోమ్ హెల్త్ కేర్ సేవలను స్టార్ హెల్త్ మరింత బలోపేతం చేసింది. ప్రజలు కూడా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తగా ఉండాలని సూచించింది. 2025 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026లో రాష్ట్రంలో హోమ్ హెల్త్ కేర్ సేవల వినియోగం దాదాపు 13 రెట్లు పెరిగినట్లు సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా డెంగ్యూ, వైరల్ జ్వరాలు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల చికిత్స కోసం ఈ సేవలను అధికంగా వినియోగించినట్లు తెలిపింది. సాధారణ ప్రజలు కూడా స్టార్ హెల్త్ కస్టమర్ యాప్ ద్వారా 24 గంటల పాటు ఉచిత వర్చువల్ డాక్టర్ కన్సల్టేషన్ పొందవచ్చు. సకాలంలో వైద్య సలహాలు తీసుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను త్వరగా ప్రారంభించవచ్చని స్టార్ హెల్త్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీ తెలిపారు.

## ఎరువుల షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

### -మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 21,ప్రభాతవార్త:** ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాల్సిందేనని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొంటామని మండల వ్యవసాయాధికారి పి .ప్రియదర్శిని హెచ్చరించారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు, మండల కేంద్రమైన చేబ్రోలులోని ఎరువుల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నకిలీ డిఏపి ఎరువులను విక్రయిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు జైలుకు పంపుతామన్నారు. ప్రతి షాపులో స్టాక్ బోర్డులు, ఎరువులకు సంబంధించిన రిజిష్టర్లను సక్రమంగా నమోదు చేయాలన్నారు. భౌతిక నిల్వలు, ఈపాస్ మిషన్‌లోని స్టాకు, డిఏపి ఇన్వాయిస్‌లను ప్రియదర్శిని పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఎరువుల దుకాణదారులు కూడా తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే ఎఫ్‌సిఓ-1985చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డిఏపికి కొరతలేదన్నారు. రైతులు ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు.



## కళ్ళలో కారం చల్లి ఛోరీకి పాల్పడిన మహిళ

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని విద్యానగర్‌లో ఓ వ్యక్తి కళ్ళలో కారం చల్లి బలవంతంగా ఆభరణాలు దోచుకెళ్ళిన సంఘటన అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విద్యానగర్‌లో నివాసం ఉంటున్న గడ్డం రత్తయ్య ఇంట్లోకి సువర్ణ అనే మహిళ వచ్చి మంచినీళ్ళు అడిగి, ఆ తర్వాత అతని కళ్ళల్లో కారం చల్లి, అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలను, నగదును బలవంతంగా దోచుకెళ్ళినట్లు రత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సంఘటనా స్థలాన్ని అర్బన్ పోలీసులు సందర్శించి, బాధితుడి, సాక్షుల వివరాలను నమోదు చేసుకున్నారు. గడ్డం రత్తయ్య వద్ద గతంలో పనిచేసిన మహిళే ఈ దురాగతానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలిని గుర్తించి, పట్టుకొని, చట్టపరమైన చర్యలు తీసుకొంటామని అర్బన్ సిఐ ఆర్ఎస్ కిషోర్‌కుమార్ తెలిపారు.

# జీవితంలో అన్నీ ఉండాలి

### -విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 21,ప్రభాతవార్త:** విద్యార్థుల జీవితాల్లో(సంతోషం, బాధ, కష్టాలు, నష్టాలు, ఒడిదొడుకులు) అన్నీ ఉండాలని...అప్పుడే వారు ఉన్నతంగా ఎదుగుతారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండల పరిధి, వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. సభకు ముఖ్య అతిథిగా



హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర లావు రత్తయ్య మాట్లాడుతూ ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో మా కళాశాలను ఎంచుకుని విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి అనేది సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని చెప్పారు. విద్యార్థులకు నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పంచసూత్రాల(ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ప్లానింగ్, ట్రైనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, కౌన్సిలింగ్ సిస్టమ్, సీఆర్‌టీ తరగతులు, బోధనా పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులందరూ మీ పిల్లలను బాగా ప్రోత్సహించినట్లయితే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారన్నారు. విద్యార్థులందరూ చదువులో మాత్రమే కాకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందన్నారు. వారిలో కమ్యూనికేషన్, టీమ్ స్పిరిట్ పెంచడానికి కళాశాలలో ఎప్పుడూ ఏదో ఒక ఈవెంట్స్‌ను నిర్వహిస్తామని తెలియజేశారు. ఇప్పటివరకు విద్యార్థులు పరీక్షలు రాయడానికి మాత్రమే ప్రిపేర్ అయివుంటారని, ఇప్పటి నుంచి మాత్రం జీవితంలో నెగ్గడానికి ప్రిపేర్ అవ్వాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉద్యోగాలలో మాంద్యం వేళ విద్యార్థులందరికీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇవ్వడం ద్వారా, 2022-2026బ్యాచ్ విద్యార్థులు 75శాతంపైగా ఉద్యోగాలు సాధించారని తెలిపారు. మరో అతిథి విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈఏపిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన అత్యధిక మంది విద్యార్థులు తమ కళాశాలలో చేరడం ఆనందంగా ఉందన్నారు. మా సంస్థలో పనిచేస్తున్నటువంటి ప్రతి అధ్యాపకునికి ఓరియంటేషన్ ప్రోగ్రాం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి 20మంది విద్యార్థులకు ఒక అధ్యాపకున్ని నియమించి కౌన్సిలింగ్ చేయడం వల్ల విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరం నుండి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్, విద్యార్థులను గ్లోబల్ కోడింగ్ ప్లాట్‌ఫామ్ అయినటువంటి లీట్ కోడ్, కోడ్ చెఫ్, హ్యాకర్ రాంక్‌లలో ప్రాక్టీసు చేయించడం వల్ల విద్యార్థులు మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధిస్తున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండు వారాలపాటు ప్రత్యేకంగా నిర్వహించే ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. ఈ యొక్క ఇండక్షన్ ప్రోగ్రాంలో ఫిజికల్ ఆక్టివిటీస్, కెరీర్ కౌన్సిలింగ్, కెరీర్ ఆప్షన్స్, టూల్స్, లాబ్స్, టూల్స్, ప్లాట్‌ఫామ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రూ.6లక్షల నుండి రూ.9లక్షల వార్షిక వేతనం సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఇటీవల గర్ల్స్ ఎన్‌సీసీ బెటాలియన్లో బీ సర్టిఫికెట్స్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వర్సిటీ అడ్వైజర్, మాజీ డీజీపి మాలకొండయ్య, విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

### -పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళా భక్తులు -భక్తుల రాకకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేసిన కార్యనిర్వహణాధికారి

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** గుంటూరు పట్టణం, ఆర్.అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతాల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజా



కార్యక్రమాలు, వ్రతాలు జరిగాయి. వందలాది మంది భక్తులు కుంకుమార్చనల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రాకకు తగ్గట్లుగా కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు. అర్చకస్వాములు విశ్వనాథశర్మ, సత్యనారాయణమూర్తి పూజా కార్యక్రమ వివరాలను వివరించారు. వ్రతాలకు సంబంధించిన పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. వ్రతాలు ఏ విధంగా ఆచరించాలో తెలియజేస్తూ, వ్రతాన్ని ఆచరించడం ద్వారా కలిగే ఫలితాన్ని కూడా భక్తులకు వివరించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బాపట్ల వెంకటేశ్వరరావు, మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ళ సత్యం, కాకుమాను శ్రీనివాసరావు, కొత్తూరు సుబ్బారావు, మాధవరావు, అరవపల్లి శ్రీనివాసరావు, కిషోర్, అమరా శ్రీనివాసు, కోట ధనలక్ష్మి, శ్రీదేవి, రాధిక, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## సోనియాగాంధీపై కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

### -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** పార్లమెంట్ సభ్యురాలు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖామంత్రి హెచ్‌డీ కుమారస్వామి తమ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, సోనియా గాంధీకి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ డిమాండ్ చేశారు. 80వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వందేమాతర గీతం ఆలపించే సమయంలో సోనియాగాంధీ చుట్టూ అల్లుకున్న వివాదం నేపథ్యంలో కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలపై దిలీప్ స్పందిస్తూ సోనియాగాంధీలో ప్రవహించేది ఇటలీ రక్తమని అందుకే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వందేమాతరం ఆలపించే సమయంలో అభ్యంతరం తెలిపారని కేంద్ర మంత్రి కుమారస్వామి అనడం వారి బానిస, కుంచిత మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. వందేమాతర గీతం ఆలపించే సమయంలో వయోభారం రిత్యా ఖర్గేకి కుర్చీ వేయమని సోనియా అన్నారే గానీ, వందేమాతర గీతాన్ని ఎక్కడా ఆపమని చెప్పలేదన్నారు. ఆ కార్యక్రమంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా ఆలపించడం జరిగిందన్నారు. దీనిపై బిజెపి అనవసర రాద్ధాంతం చేస్తుందన్నారు. 1937నుండి నేటి వరకు వందేమాతర గీతంలోని మొదటి రెండు చరణాలే పాడడం జరుగుతోందన్నారు. దేశ సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా, దేశ ప్రజలమధ్య వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టేందుకే పూర్తి చరణాలు పాడాలని బిజెపి చట్టం చేయడం దేశంలో మతపరమైన అలజడులను ఉసిగొల్పడమేనన్నారు. ఇక కుమారస్వామి జీవితానికి ఇదే ఆఖరి పదవని, అది కాపాడుకునే ప్రయత్నంలోనే సోనియా గాంధీపై జుగుప్సాకర వ్యాఖ్యలు చేసి వారి దిగజారుడు మనస్తత్వాన్ని మరోసారి రుజువు చేసుకున్నారని అన్నారు. రాజకీయాలలో భావ వైరుధ్యాలు ఉండాలి కానీ, ఇలా భావ దారిద్ర్యం ఉండకూడదన్నారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలను నడవలేక బిజెపి పాదాక్రాంతం చేసిన ఆత్మాభిమానం లేని నాయకులు పదవుల్లో కొనసాగేకంటే గౌరవప్రదంగా రాజకీయాల నుండి వైదొలగడం మించిదని హితువు పలికారు.



## గుంటూరులో కార్డన్ సెర్చ్

**గుంటూరు క్రైమ్, ఆగస్టు21, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇజ్రాయిల్‌పేట, మణిపురం ఫ్లైఓవర్ సమీప ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున 05:00 గంటల నుంచి 08:00 గంటల వరకు విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు.

ఈ కార్డన్ సెర్చ్‌ను ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీతారాం పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట, లాలాపేట, ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది మరియు ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించగా 46 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు సంబంధించిన పత్రాలు అసంపూర్తిగా లేదా సక్రమంగా లేనట్లు గుర్తించారు. సంబంధిత వాహనాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నారు. పోలీసులు నిర్వహిస్తున్న ఇటువంటి తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం నేరాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం మరియు శాంతిభద్రతలను పరిరక్షించడం. కార్డన్ సెర్చ్ అనంతరం సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, మత్తు ఇంజెక్షన్లు, మత్తు మాత్రల వినియోగం



వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, కలిగి ఉండటం, విక్రయించడం, అక్రమ రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్.డి.పి.ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అదేవిధంగా, తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించగలమని అధికారులు పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 150 మంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మరియు సంకల్పం ప్రతిజ్ఞ చేయించారు.

గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నేర నియంత్రణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రత కోసం ప్రత్యేక నిఘా, వాహన తనిఖీలు, కార్డన్ సెర్చ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై సమాచారం అందించి సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసులు కోరారు.

## బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుంది

### -డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరీముల్లా

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ సంస్థ అండగా ఉంటుందని తహశీల్దార్ కార్యాలయ సూరిటెండెంట్(డిప్యూటీ తహశీల్దార్) షేక్ కరీముల్లా అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు



గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇంటిని కోల్పోయిన దోమాడ అంజలి కుటుంబానికి రెడ్‌క్రాస్ సంస్థ తరపున నిత్యావసరాలు, బియ్యం, వంట సామాగ్రి, వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి ఆర్ఎస్ కిరణ్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అవసరార్థులకెందరికో రెడ్‌క్రాస్ సంస్థ చేయూతనందిస్తుందన్నారు. సమాజాన్ని చైతన్యపరచడంలో కానీ, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రత్యేకమైన భూమిక పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

## అప్పు ఇవ్వలేదని వృద్ధుని పై మరో వృద్ధుడు దాడి

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** డబ్బులు అప్పు ఇవ్వలేదనే కారణంతో ఓ వృద్ధుడు మరో వృద్ధుడిపై దాడికి దిగిన సంఘటన పొన్నూరు రూరల్ ఎస్సై వాగాల శ్రీహరి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి సాంబయ్యను అదే గ్రామానికి చెందిన శరాబంది డబ్బులు అప్పుగా అడిగాడు. దీంతో సాంబయ్య డబ్బులు అప్పుగా ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో శరాబంది అనే వృద్ధుడు సాంబయ్య అనే వృద్ధుడిపై కత్తితో దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు దేవిరెడ్డి సాంబయ్యకు తీవ్ర గాయాలు కావడంతో నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. రూరల్ ఎస్సై వాగాల శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

### -ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్

**పొన్నూరు, ఆగస్టు 21,ప్రభాతవార్త:** పొన్నూరు పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 22వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు. పొన్నూరు విద్యుత్ ఉపకేంద్రం-1లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 5ఎంవిఏ నుంచి 8ఎంవిఏకు పెంచుతున్న కారణంగా 33కెవి ఎబి స్విచ్, 33కెవి,హెచ్‌వి బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అందుకు సంబంధించిన పట్టణపరిధిలోని వివరాలను పట్టణ ఎఈ ఆర్.వి. శంకరరావు వివరిస్తూ సాంబశివనగర్, కోర్టు ఏరియా, మీనా అపార్టుమెంట్ ఏరియా, తెలగపాలెం, షరాఫ్ బజారు, వన్‌వే రోడ్డు, శంకరమఠం, ఆంజనేయస్వామి టెంపుల్, పోలీస్ స్టేషన్,తహాశీల్దార్ కార్యాలయం, మునిసిపల్, ఎంపిడిఓ కార్యాలయం, ఎరుకలవాడ, డివిసి కాలనీ, ఎన్జీవో కాలనీ, జిబిసిరోడ్డు, బ్రాహ్మణ బజారు, వైష్ణమి నగర్, ఫైర్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రూరల్ పరిధిలోని వివరాలను ఏఈ ఎస్.నాగరాజు వివరిస్తూ కట్టెంపూడి అడ్డరోడ్డు, మునిపల్లె, గోళ్ళమూడిపాడు, పచ్చలతాడిపర్రు, దొప్పలపూడి, బ్రాహ్మణకోడూరు, దండమూడి, ఆరెమండ, జూపూడి, మన్నవ, ఆలూరు, తాళ్ళపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించాలన్నారు.

## అంగరంగ వైభవంగా స్వామివార్ల పల్లకి ఊరేగింపు సేవ

ఎ కొండూరు, ఆగష్టు 21, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో ఈ నెల 19 నుండి ప్రారంభమైన శ్రీ శివదత్త సాయి మందిర ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి మేళతాళాలతో కనకతప్పట్లతో తీన్‌మార్ కోలాటాలతో శివుడు వినాయకుడు బాబా దత్తాత్రేయ విగ్రహాలను అంగరంగ వైభవంగా గ్రామంలో ట్రాక్టర్లపై ఊరేగించి పూజలు వ్రతాలు నిర్వహించారు. శనివారం సాయి మందిరం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రవాసాంధ్రుడు గుంటక సుదర్శన రెడ్డి (అమ్ములురెడ్డి) హేమలత దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. దూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ఈ కార్యక్రమంలోపాల్గొంటున్నారు. ఆదివారం రాత్రితో శివదత్త సాయి మందిర ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవాలు ముగుస్తాయని శుక్రవారం సాయిమందిరం సత్యహరిశ్చంద్ర వారణాసి ఘట్టం నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎన్నారై గుంటక అమ్ములు రెడ్డి (యుఎస్ఎ) తెలిపారు.

# సనాతనధర్మ స్ఫూర్తితో భక్తులకు దుర్గమ్మ ప్రసాదం

- నూతన ప్రసాద భవనాల ప్రారంభోత్సవంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- దుర్గమ్మ ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం


నూతన ప్రసాద భవనాలు ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** దుర్గమ్మని దర్శించుకునే ప్రతి భక్తునికి సనాతన ధర్మ స్ఫూర్తితో శ్రీ అమ్మవారి అన్న ప్రసాదాలు, లడ్డూ, పులిహోర తదితర ప్రసాదాలు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం వైభవోపేతంగా శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం, శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం మంత్రి ఆనం ప్రారంభించారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ఆనం శ్రీకారం చుట్టారు రూ.26 కోట్లతో నిర్మించిన కనకదుర్గ అన్నప్రసాద సదనం, రూ.26.50 కోట్లతో నిర్మించిన శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనంను కూడా ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.52.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ రెండు భవనాల ద్వారా అన్నప్రసాదం, మహాప్రసాదాల తయారీ, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ మరింత సమర్థవంతంగా సిబ్బంది నిర్వహిస్తారన్నారు. ఒకేసారి 800 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా కనకదుర్గ అన్నప్రసాద సదనంలో ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో రెండు భవనాల్లో యాంత్రీకృత వంటశాలలు ఏర్పాటు చేసి భక్తులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులను నిరంతరం అభివృద్ధి చేస్తామన్నారు. రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం, శాశ్వత పార్కింగ్ సదుపాయాలపై కార్యాచరణ రూపొందించామన్నారు. అత్యవసర సమయాల్లో రాకపోకలు సజావుగా సాగేలా రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, త్వరితగతిన నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కుమ్మరి పాలెం నుంచి 700 మీటర్ల మేర ఈ ఘాట్ రోడ్డు నిర్మించేందుకు ఇప్పటికే ఆర్ అండ్ బి, ఓ కన్సల్టెన్సీ సంస్థకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి నూతన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులతో కలిసి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. మహాప్రసాద భవనంలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల ఆశీస్సులు పొందారు. ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద నగదు చెల్లించి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, 20సూత్రాలఅమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ సేవలో విఐపిలు:**
దుర్గమ్మని శుక్రవారం రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కొలుసు పార్థసారధి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యన్నారాయణ చౌదరి (సుజనా చౌదరి) దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీస్సులు, ప్రసాదాలు అందజేశారు.

**- ఖడ్గమాల పూజలో పురందేశ్వరి:**
శుక్రవారం ఖడ్గమాల పూజలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని శ్రీ కనకదుర్గమ్మని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు, ప్రసాదములు అందజేశారు.

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బి సూర్యచంద్రరావు నాయుడు శుక్రవారం రు.1,00,166ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతరం గాలింపు

- 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తోపాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా

# డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ


ఎన్‌జిఓ సంఘం రాష్ట్రఅధ్యక్షులు విద్యాసాగర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ విజయవంతం కావటంపై ఉద్యోగులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన తమ కల నెరవేరటంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని ఏపిఎన్‌జిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌జిఓసంఘం రాష్ట్రఅధ్యక్షులు ఏ.విద్యాసాగర్‌ను కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సత్కరించారు. తమ సమస్య పరిష్కారానికి ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ చేసిన కృషి మరువలేదని కొనియాడారు. తమ సమస్యను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళటంలో సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, కార్యదర్శి రమణలు ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీహెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు కరెడ్ల అంజనీకుమార్, కార్యదర్శి శ్రీదేవి, ఇతర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# బిసి వర్గాల అభ్యున్నతే రాష్ట్ర అభ్యున్నతి

- టిడిపి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర

**నెల్లూరు(వైద్యం), ఆగస్టు 21 ప్రభాతవార్త:** బిసిలకు దేశంలో మొట్టమొదటిసారి రిజర్వేషన్లు కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుకే చెందుతుంది. బిసి వర్గాల అభ్యున్నత రాష్ట్ర అభివృద్ధిని భావించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో బిసి వర్గాలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం సంతోషకర విషయం అని నెల్లూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లోకేష్ ప్రతి ప్రాంతంలో బిసి వర్గాల సమస్యలపై వారితో నేరుగా మాట్లాడుతూ పరిస్కరిస్తున్నారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత 12 సంవత్సరాలుగా బిసి వర్గాలకు చెందిన నేతలే పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. కూటమి పార్టీల నిర్ణయం మేరకు డిప్యూటీ సీఎం పదవిని పవన్ కల్యాణ్‌కి కేటాయించారు. గత ప్రభుత్వంలో ఐదు మంది ఉపముఖ్యమంత్రులు ఉంటే పేరుకే పదవులు ఉన్నాయి. పెత్తనం పై వారు చేశారు. వైసిపి హయాంలో బలహీన వర్గాలు పనిచేసే పరిస్థితి లేదు. సకల శాఖామంత్రి కనుసన్నల్లోనే పరిపాలన సాగేది. బిసిలకు ఇస్తున్న రిజర్వేషన్ అడ్డుకోవాలని చూసింది ఎవరు? వైసిపి కాదా.. రిజర్వేషన్ అడ్డుకునేందుకు వైసిపి కుట్రలు పన్నుతోంది. అందుకు నిదర్శనమే అనిల్ కుమార్ యాదవ్ ప్రెస్ మీట్ అని అన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావు శ్రీకారం చుట్టిన బిసి సాధికారతను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు అవకాశం ఇవ్వడం వల్లే ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలుగా రాణిస్తున్నారు. బిసిలను గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయికి ప్రోత్సహించిన ఘనత టిడిపిదే. బీసీలకు రిజర్వేషన్ పేటెంట్ హక్కు తెలుగుదేశం పార్టీది. అనిల్ కుమార్ యాదవ్ ప్రెస్‌మీట్ పెట్టి టిడిపి కుట్రలు చేస్తోందని ఆరోపిస్తున్నారు. అసలు తెలుగుదేశం పార్టీనే బిసిలకు రిజర్వేషన్లు తీసుకురాకపోయింటే అనిల్ కుమార్ యాదవ్ కార్పొరేటర్‌గా పోటీ చేసేవారా? ఈ స్టేజి మీద ఉన్న ప్రతి ఒక్కరూ రిజర్వేషన్లను ఉపయోగించుకుని ఈ స్థాయికి ఎదిగిన వాళ్లమే. వైసిపి హయాంలో 16,800 మంది బిసి నేతలు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకత్వం కోల్పోయారు. రాజకీయంగా నిరాదరణకు గురయ్యారు. 70 వేల బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయలేకపోయారని ఆయన అన్నారు.

# ఎపిఎండిసికి 'బెస్ట్ స్టేట్ లింక్డ్ ఇష్యూయర్' పురస్కారం


ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ స్టేట్ లింక్డ్ ఇష్యూయర్' అవార్డును అందుకుంటున్న ఎపిఎండిసి ఎండి ప్రవీణ్ కుమార్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎండిసి)కు ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ స్టేట్ లింక్డ్ ఇష్యూయర్' అవార్డు లభించింది. ముంబైలో నిర్వహించిన అసోచామ్ జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ఎపిఎండిసి మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. కార్పొరేట్ బాండ్ మార్కెట్ ద్వారా సెక్యూర్డ్ నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్స్(ఎన్‌సిడి) జారీ చేసి విజయవంతంగా రూ.9,000 కోట్లను సమీకరించిన ఎపిఎండిసి ప్రతిష్ఠాత్మక ఆర్థిక కార్యక్రమానికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థగా ఇంత భారీ స్థాయిలో నిధులను సమీకరించడం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా ఎపిఎండిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వం, మార్గదర్శకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే బాండ్ జారీ విజయవంతం కావడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ, పరిశ్రమలు, గనులు, భూగర్భశాస్త్ర శాఖ, ఇతర సంస్థలు, ఏజెన్సీలకు ఎపిఎండిసి కృతజ్ఞతలు తెలియజేసింది.

# విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో శిక్షణ

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ఐదురోజుల శిక్షణాకార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. విజయవాడ ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టిఐహెచ్) ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ నుండి 21వతేదీ వరకు ఐదురోజులపాటు విద్యార్థులకు పారిశ్రామిక ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించటం, వినూత్న పరిష్కారాలను రూపొందించటం, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయటం, వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా 21 వినూత్న వ్యాపార ఆలోచనలను విద్యార్థులు నిపుణుల ముందు ప్రదర్శించారు. ఆర్‌టిఐహెచ్ విజయవాడ సీఈఓ డాక్టర్ హరిబాబు పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో పీబీ. సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.


# ఎపిపిఎస్‌సిపై జగన్ వన్నీ అబద్ధాలే!

- శాప్ చైర్మన్ రవి నాయుడు



**తిరుపతి(హెల్త్), ఆగస్టు 21 ప్రభాతవార్త:** పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి నిజాలు మాట్లాడితే అతని తల వేయి ముక్కలవుతుందని, నిజాలు చెప్పవద్దని అతని తండ్రి అతనికి సూచించాడని శాప్ చైర్మన్ రవి నాయుడు ఎద్దేవా చేశారు. గురువారం మీడియా సమావేశంలో జగన్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధపు మాటలని, స్వయాన డిఎస్సీ అభ్యర్థులు, ఆ పక్రియలో భాగస్వామ్యం అయిన అధికారులు చెబుతున్న పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రవి నాయుడు ఆరోపించారు. శుక్రవారం తిరుపతిలో విలేకరులతో మాట్లాడుతూ గోల్డ్ మెడల్ దుర్గయ్య కోర్ట్‌కు సబ్మిట్ చేశారని, అలాగే అవుట్ సోర్సింగ్ ఎంప్లాయ్ నవీన్ ఐడిని లాగిన్ క్లోజ్ చేస్తారనేది కూడా తెలియదని, ఇతనికి ఉద్యోగం ఇవ్వాలంటున్నాడో, ఇవ్వవద్దంటున్నాడో కూడా క్లారిటీగా జగన్ చెప్పడం లేదన్నారు. టెట్ క్వాలిఫై అయిన వారికి మాత్రమే టీచర్ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఏ ప్రక్రియ ఏ సమస్థ ద్వారా ఉద్యోగాలు వస్తాయో! తెలియని అతను ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేయడం సిగ్గుచేటన్నారు. ఎపిపిఎస్‌సిని భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్ అని, డిఎస్సీ, ఎపిపిఎస్సీ అంటే ఏమిటో? అనేది జగన్ తెలుసుకోవాలన్నారు. 2016లో ప్రజా ప్రభుత్వం గ్రూప్ వన్ పోస్ట్ పివి సింధుకు ఇవ్వడం జరిగిందని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను అదే తరహాలో గుర్తించాలని చెప్పారే తప్ప అందరికీ గ్రూప్ వన్ ఉద్యోగాలు ఇవ్వమని కాదని, మెడల్ అంటే బిల్ల కాదు గౌరవం అన్నారు. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. జగన్ ఆడే పబ్జి గేమ్ స్పోర్ట్స్ కోటాలో లేనందువలన ఈ రాద్ధాంతం అంతా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, గంగమ్మ గుడి డైరెక్టర్ వినుకొండ వెంకట్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వి ఎం శ్రీధర్, తెలుగు యువత నాయకులు కొట్టే హేమంత్ రాయల్, గంగమ్మ గుడి మాజీ డైరెక్టర్ గంజి సుధాకర్ రెడ్డి, ముని రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, డ్రంకన్ టెస్ట్‌లో సంజూష్‌కు నెగెటివ్



**హైదరాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ మాదాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిందితుడుగా వున్న జనసేన ఎంపి లింగమనేని రమేష్ కు మారుడు సంజూష్‌కు డ్రగ్స్, డ్రంకన్ పరీక్షల్లో నెగెటివ్‌గా వచ్చింది. ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం వేళ జరిగిన ప్రమాదంలో ఓ యువతి మరణించడం తెలిసిందే. ఈ సమయంలో సంజూష్ కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపినట్లు పోలీసులు తేల్చారు. ప్రమాదం తరువాత సం జూష్ గాయపడ్డ యువతిని తన కారులోనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించింది. దీని తరువాత సంజూష్ జరిగిన ప్ర మాదంపై మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మాదాపూర్ పోలీసులు సంజూష్‌పై కేసు నమోదు చేసి అతను నడిపిన కారు ను జప్తు చేశారు. సంజూష్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారించిన పోలీసులు అతనికి డ్రంకన్ పరీక్షలు మొదట నిర్వహించారు. అన ంతరం డ్రగ్స్ టెస్ట్ కోసం పోలీసు స్టేషన్‌లోనే అతని నుంచి రక్త నమూనాలను తీసుకున్నారు. కాగా ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు శు క్రవారం వచ్చాయి. ప్రమాదం జరిగిన సమయంలో కారు నడిపిన సంజూష్ మద్యం సేవించి లేదని, అంతకు ముందు అతను ఎలాంటి డ్రగ్స్ కూడా తీసుకోలేదని పరీక్షలో తేలిందని కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్ మీడియాకు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో నిందితుడి తండ్రి ఎంపి లింగమ నేని రమేష్ తమపై ఎలాంటి ఒత్తిడి తేలేదని, అంతా చట్ట ప్రకారమే జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కేసులో కారును జప్తు చేసి నిందితు డికి నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇచ్చామని, దీనిపై తదుపరి విచారణ సాగుతుందని డిసిపి తెలిపారు.

# రైజ్‌కేంద్రంలో మినీఎక్స్‌పోను సందర్శించిన కలెక్టర్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మహిళలు ఏర్పాటు చేసిన మినీ ఎక్స్‌పోను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, డిల్లీనుండి వచ్చిన ఓడిఓపి అధికారి ఇషాదీప్‌సింగ్‌లు సందర్శించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్‌కేంద్రంలో క్రాఫ్ట్‌అండ్ ఆర్ట్స్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈప్రదర్శనలో మహిళలు రూపొందించిన పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందించటం ద్వారా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సది వ్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# విశాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత

- రూ.1,500 కోట్లతో ఎస్ టి పి ప్రాజెక్టులు... శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు వినియోగించేలా చర్యలు. రోడ్లు, వీధి దీపాల పనులకు అత్యవసర ప్రాతిపదికన ప్రాధాన్యత.
- వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలు... 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు.
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ.

**విశాఖపట్నం, ఆగస్టు 21 ప్రభాతవార:** విశాఖ నగరంలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, మురుగునీటి నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు. శుక్రవారం విఎంఆర్డిఏ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు,, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విఎంఆర్డిఏ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎం సీ అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టవలసిన కార్యక్రమాలు, ప్రతిపాదిత ప్రాజెక్టు పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి, ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. విశాఖకు గోదావరి జలాలు రానున్న నేపథ్యంలో వాటి నిల్వకు అవసరమైన ప్రాంతాలను గుర్తించామని, సుమారు రూ.1,000 కోట్లతో తాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే ప్రతి ఇంటికీ రోజుకు 135 లీటర్ల నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. గోదావరి జలాలతో విశాఖ తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందన్నారు. మురుగునీటి శుద్ధి కోసం సుమారు రూ.1,500 కోట్లతో ఎస్ టి పి ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్నామని, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు అందించడం ద్వారా మంచినీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. డేటా సెంటర్ల వల్ల విశాఖలో నీటి సమస్య ఏర్పడుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. నగరంలో రోడ్లు, వీధి దీపాల పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. రహదారి పనుల జాప్యంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డితో చర్చించామని, అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే పనులను వేగవంతం చేస్తామన్నారు. వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలను నిర్మించి, అర్హులకు సుమారు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, కోర్టు తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తదుపరి చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ సమీక్షలో గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి. విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ, వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి మేయర్‌గా నేర చరితులు వద్దు!

**తిరుపతి, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, ఆధ్యాత్మిక నగరంగా తిరుపతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అలాంటి పవిత్ర నగరానికి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే వారు ప్రజాసేవకు ప్రతిరూపంగా ఉండాలి తప్ప, నేరాలు, దౌర్జన్యాలు, అక్రమాలతో సంబంధం ఉన్న వ్యక్తులు కాకూడదని ఎపి చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి అన్ని రాజకీయ పార్టీలను కోరారు. రాబోయే తిరుపతి నగర పాలక సంస్థ ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపికలో నేర చరిత్రను ప్రధాన ప్రమాణంగా పరిగణించాలని ఆయన సూచించారు. కేవలం గెలుపు అవకాశాలు, ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం ప్రజాస్వామ్యానికి, తిరుపతి ప్రతిష్ఠకు మంచిది కాదన్నారు. నగర అభివృద్ధి, పారిశుద్ధం, ట్రాఫిక్, పర్యావరణ పరిరక్షణ, ప్రజా భద్రత, పట్టణ ప్రణాళిక వంటి అంశాలపై అవగాహనతో పాటు ప్రజల సమస్యల పట్ల సున్నితత్వం ఉన్న వ్యక్తి మేయర్‌గా ఉండాలని ఆకాంక్షి ంచారు. అందువల్ల రాజకీయ పార్టీలు నేర చరిత్ర లేని, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం ఉన్న, సామాజిక స్పృహ, సేవా దృక్పథం, విద్య, నైతిక విలువలు, దూరదృష్టి కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి

# గ్రామ రెవెన్యూ సహాయకులు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఏ)లు దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చూపుతూ విఆర్‌ఏలు కంట కన్నీళ్లు తెప్పిస్తుందని ఈ విషయం ప్రభుత్వాలకు శాపం అన్న సంగతి ప్రభుత్వం వెంటనే గుర్తెరగాలని ఎపి విఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష. ప్రధాన కార్యదర్శులు నల్లిపోగు నాగేశం, గుజ్జుల ఈశ్వరయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. గత 9సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కోరుతూ ఎక్కని గడప లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి విఆర్‌ఏలకు "పే స్కేల్" ఇవ్వాలని, నామిని వీఆర్‌ఏలను వెంటనే రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి. ముఖ్యమంత్రి హయాంలో చేసిన విధంగా ఒకే దపా "వన్ టైం సెటిల్ మెంట్" ద్వారా రెవెన్యూ శాఖలో ఉన్న అన్ని ఖాళీలను వీఆర్‌ఏలచే భర్తీ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం స్థానిక సంస్థలు ఎన్నికలు సమీపిస్తున్నందున వెంటనే వీఆర్‌ఏల సమస్యలు అత్యంత ప్రాధాన్యతగా ప్రభుత్వం భావించి పరిష్కరించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్ల పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** నగరంలోని ఎస్ఆర్ నగర్ చౌరస్తా వద్ద శుక్రవారం నాడు కర్నాటకకు చెందిన డిఫెన్స్ లిక్కర్‌ను అబా ్కరీ పోలీసులు పట్టుకున్నారు. ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా వున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద గల బ్యాగులను సోదాచేయగా నాలుగు కర్నాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను వెలుగు చూశాయి. దీని తరువాత అతన్ని గట్టిగా నిలదీస్తే ఇదే ప్రా ంతంలోని గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి నుంచి ఈ మద్యం బాటిళ్లను కొన్నట్లు తెలిపాడు. అనంతరం గోవర్ధన్ రెడ్డి ఇంటికి వెళ్లిన పోలీసులు అతని ఇంటిని తనిఖీ చేయగా 51 కర్నాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు లభించగా వాటిని కూడా జప్తు చేశారు. కర్ణాటకలోని పలు ప్రాంతాలలో మిలట రీలో పనిచేసే కొందరు వ్యక్తుల నుంచి వీరు ఈ మద్యం బాటిళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి జంట నగరాలలో మద్యం ప్రియులకు లేదా కల్తీ సరుకో అని నిర్ధారించేందుకు పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

# గోదావరి ఘటనపై విజయసాయిరెడ్డి ప్రశ్నల వర్షం

**విశాఖపట్నం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గోదావరిలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఘటనపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి వస్తున్న ఆరోపణలు, మత మార్పిడికి సంబంధించిన అంశాలపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్సీపీలు సూటిగా సమాధానం చెప్పాలని, ఖీఎక్స్ ఖీ వేదికగా డిమాండ్ చేశారు. నూకరాజు కుటుంబం గోదావరిలో దూకడానికి కారణం 'లవ్ జీహాద్' అని తెలిసినా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మత మార్పిడికి సాదిక్ ఖాన్ ఒత్తిడి చేశారన్న ఆరోపణలను ఆషామాషీ అంశంగా ఎందుకు చూస్తున్నారని నిలదీశారు. గోదావరిలో దూకి మృతి చెందిన సౌజన్య తన భర్త జగదీశ్వర్‌రెడ్డి మరణానికి కూడా సాదిక్ కారణమని తన మరణ వాంగ్మూలంలో పేర్కొన్నారని విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ వ్యవహారాన్ని లవ్ జీహాద్, హత్యగా ఎందుకు పరిగణించడం లేదని, హిందూ బీసీలు, హిందూ రెడ్డి సామాజిక వర్గంపై దాడిగా ఎందుకు భావించడం లేదని టీడీపీ, బీజేపీ రాష్ట్ర నాయకత్వాలను ప్రశ్నించారు. మనుషులను హత్య చేసి మత మార్పిడులకు పాల్పడుతున్న మాఫియాలు ఏపీలో గ్రామగ్రామాన వివిధ పేర్లతో విస్తరిస్తున్నాయన్న ఆరోపణలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. మైనారిటీ ఓట్ల కోసమేనా ఈ మౌనం అని నిలదీశారు. మత మార్పిడుల నిరోధానికి చంద్రబాబు ప్రభుత్వం చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. సాదిక్ ఖాన్ ఇప్పటివరకు ఎందుకు పట్టుబడలేదని, లేక అతడిని పట్టుకునే ఉద్దేశం లేదా అని ప్రశ్నించిన విజయసాయిరెడ్డి.. అతడు ఏ రాజకీయ పార్టీ కార్యకర్త, 2024 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రచారం చేశాడనే వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదని నిలదీశారు. సౌజన్య, జగదీశ్వర్‌రెడ్డి దంపతుల కుమారుడు రియాన్ష్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శించి కుటుంబానికి అండగా నిలవాలని ఎందుకు భావించలేదని ప్రశ్నించారు.

# ఇందిరమ్మ ఇల్లు పేరుతో మహిళపై అత్యాచారం!

**ఆత్మకూరు(ఎం), ఆగస్టు 21, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందనే ఆశను ఆసరాగా చేసుకుని ఓ మహిళపై అత్యా చారం జరిగినట్లు ఆరోపణలు కలకలం రేపు తు న్నాయి. ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, ఇంటి నిర్మాణానికి సిమెంట్ బస్తాలు ఇస్తానని చెప్పి ఇంటికి పిలిపించి అత్యాచారం చేశాడని స్థానిక నేతపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. బాధితురాలి భర్తకు విషయం తెలియడంతో గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వ హించినట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టవద్దంటూ బాధితురాలిని, ఆమె భర్తను బెదరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# శ్రీలంకతో రెండో టెస్ట్‌లో కుల్దీప్‌పై వేటు!




## ధ్రువ్ జురెల్ స్థానంలో సర్ఫరాజ్
## టీమిండియాలో స్వల్ప మార్పులు

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 23 నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటిసి 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది. తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్, రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తాచాటగా, జడేజా 4వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది.

అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు. మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించే అవకాశాలు కూడా పరిశీలనలో ఉన్నాయి. అయితే కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనాలు కూడా ఉన్నాయి. ఇక తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బిసిసిఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు.

మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా, దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు.

తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకో నున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకీబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.



## 15 యేళ్ల తర్వాత భారత్‌కు.. మహిళల డబుల్స్ ట్రీసా-గాయత్రి పతకం

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 15 ఏళ్ల తర్వాత భారత్‌కు మహిళల డబుల్స్ పతకాన్ని ట్రీసాగాయత్రి ఖరారు చేశారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌లు నాలుగో సీడ్ జియా యి ఫాన్-జాంగ్ షు జియాన్‌లపై అద్భుత విజయం సాధించి పతకాన్ని ఖాయం చేసుకున్నారు. తొలి గేమ్‌లో వెనుకబడినప్పటికీ, వారు పుంజుకుని క్వార్టర్‌ఫైనల్‌లో నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన జియా, ఆమె కొత్త భాగస్వామి జాంగ్‌లను 16-21, 21-15, 21-13 తేడాతో ఓడించారు. ప్రపంచ 39వ ర్యాంకర్ అయిన ట్రీసాగాయత్రి, ప్రపంచ 4వ ర్యాంకర్ అయిన చైనా జోడీతో జరిగిన గత మూడు మ్యాచ్‌లలో ఓడిపోయినందున, ఈ మ్యాచ్‌లో బలహీనమైన జట్టుగా బరిలోకి దిగారు. ఫేవరెట్‌లుగా మ్యాచ్‌ను ప్రారంభించిన చైనా జోడి 6-0 ఆరంభ ఆధిక్యాన్ని సంపాదించింది. భారత జోడీ కొన్ని అనవసర తప్పిదాలు చేసి, 2-9 తేడాతో మరింత వెనుకబడ్డారు. అయితే చైనా షట్లర్లను గందరగోళానికి గురిచేసి వరుసగా ఐదు పాయింట్లు సాధించారు. ట్రీసా జోడీ పలు అనవసర తప్పిదాల కారణంగా చైనా జంట 5-1తో ఆరంభ ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో గాయత్రి ద్వయం కొన్ని మంచి నెట్ షాట్‌లతో మరోసారి పుంజుకుని, లోటును పూడ్చి, గేమ్‌ను 7-8తో తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. కొన్ని అద్భుతమైన స్మాష్‌లతో పోరాటాన్ని కొనసాగించి, 11-10 ఆధిక్యంతో రెండవ మిడ్‌గేమ్‌లోకి ప్రవేశించారు. గాయత్రి విన్నర్ పాయింట్లు సాధించడంతో భారత జోడి తమ ఆధిక్యాన్ని 13-10కి పెంచుకుంది. మూడవ గేమ్‌లోఒత్తిడికి లోనైన చైనా షట్లర్లు అనవసర తప్పిదాలు చేయడంతో, భారతీయులు 9-4తో భారీ ఆధిక్యాన్ని సాధించారు. చివరి ఎండ్స్ మారే సమయానికి, భారత్ 11-5 ఆధిక్యంతో భారీ విజయాన్ని అందుకున్నారు.

## డ్యూరాండ్ కప్.. ఫైనల్‌కు మోహన్ బగాన్



**షిల్లాంగ్:** డ్యూరాండ్ కప్ 2026 సెమీఫైనల్‌లో మోహన్ బగన్ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ నార్త్ ఈస్ట్ యునెటెడ్ ఎఫ్‌సిపై పెనాల్టీల్లో విజయం సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించింది. షిల్లాంగ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి 0-0తో ముగిసిన రెండో సెమీఫైనల్‌లో, పెనాల్టీల ద్వారా మెరైనర్స్ (మోహన్ బగాన్) జట్టు హైలాండర్స్‌పై 4-3 తేడాతో విజయం సాధించింది. తొలి 20 నిమిషాల్లో ఇరు జట్లు మిడ్‌ఫీల్డ్‌లో పట్టు సాధించడానికి ఇబ్బంది పడ్డాయి. దాడి చేసే అవకాశాలను సృష్టించుకునే ప్రయత్నంలో ఇరు జట్లు తరచుగా డిఫెన్సివ్ లైన్ మీదుగా లాంగ్ బాల్స్ పంపడానికే మొగ్గు చూపాయి. అరగంట తర్వాత అలాద్దీన్ అజరాయీ కొట్టిన వాలీ గోల్ పోస్ట్‌ను తృటిలో తప్పించుకుంది. ఈ సమయంలో ఇరు జట్లు చెరో మూడు కార్నర్‌లను సంపాదించాయి. తొలి అర్ధభాగం మాదిరిగానే రెండో అర్ధభాగం కూడా అదే రీతిలో సాగి ఇరు జట్లు స్పష్టమైన అవకాశాలను పొందలేకపోయాయి. చివరికి, నిర్ణీత సమయం ముగిసేసరికి మ్యాచ్ 0-0తో ముగియడంతో, ఇరు జట్లు పెనాల్టీ షూటౌట్‌కు సిద్ధపడ్డాయి. రెండు జట్లు తమ మొదటి మూడు పెనాల్టీలను విజయవంతంగా మార్చుకున్న తర్వాత, షూటౌట్ హోరాహోరీగా సాగింది. నార్త్‌ఈస్ట్ యునైటెడ్ తరఫున నాలుగో కిక్ కొట్టడానికి రాబిన్ యాదవ్ ముందుకు రాగా, అతని ప్రయత్నాన్ని కైత్ అద్భుతంగా అడ్డుకున్నాడు. తర్వాత జేమీ మెక్లారెన్ గోల్ చేసి మోహన్ బగాన్‌ను ఆధిక్యంలోకి తీసుకువెళ్లాడు. అనంతరం కైత్ మరో అద్భుతమైన సేవ్‌తో పార్థిబ్ గొగోయ్ కొట్టిన షాట్‌ను అడ్డుకోవడంతో, మోహన్ బగాన్ ఫైనల్‌కు చేరింది.





## ప్రపంచ రెజ్లింగ్..కాజల్‌కు స్వర్ణం తను, సవితకు రజతాలు

**స్లోవేకియా:** స్లోవేకియాలో జరిగిన అండర్20 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన కాజల్ ధోచక్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మహిళల 76 కేజీల విభాగంలో తిరుగులేని విజయం సాధించి, వరుసగా రెండో స్వర్ణ పతకాన్ని గెలుచుకోవడం ద్వారా కాజల్ అంతర్జాతీయ రెజ్లింగ్‌లో తన అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగించింది. 18 యేళ్ల భారత క్రీడాకారిణి ఫైనల్‌లో చైనాకు చెందిన జింగ్రు సన్‌ను 7-0 తేడాతో ఓడించి ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకుంది. భారత రెజ్లర్ ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా తన ప్రచారాన్ని పూర్తి చేసింది. ఆమె జపాన్‌కు చెందిన మియు తకయామాపై ఫాల్ ద్వారా విజయంతో ప్రారంభించి, ఆ తర్వాత టర్కీకి చెందిన ఎల్మిరా యాసిన్‌పై 14-0 తేడాతో గెలిచి, సెమీఫైనల్స్‌లో అమెరికాకు చెందిన పైపర్ ఫౌలర్‌ను 6-0 తేడాతో ఓడించింది. అండర్20 ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో సన్‌తో జరిగిన తొలి రౌండ్ పోరుకు ఈ ఫైనల్ రీమ్యాచ్ జరిగింది, అందులో కూడా భారత కాజల్ విజయం సాధించింది. స్టెప్‌అవుట్ ద్వారా కాజల్ 1-0 ఆధిక్యం సాధించి, ఆ తర్వాత డబుల్‌లెగ్ టేక్‌డౌన్ చేసి స్కోరును 3-0కి చేర్చింది. అనంతరం, ఓపెన్ హ్యాండ్స్ ఉపయోగించినందుకు సన్‌కు హెచ్చరిక జారీ చేయడంతో, కాజల్ ఖాతాలో మరో పాయింట్ చేరింది. ఆ తర్వాత కాజల్ మరో టేక్‌డౌన్ సాధించి 7-0 తేడాతో విజయాన్ని పూర్తి చేసింది. అలాగే 72 కేజీల ఫైనల్‌లో తను శర్మ జపాన్‌కు చెందిన చిసాటో యోషిడాతో హోరాహోరీగా తలపడినా, పాయింట్ల పరంగా 3-5 తేడాతో ఓడిపోయి రజత పతకంతో సరిపెట్టుకుంది. ఫైనల్‌లో జపాన్‌కు చెందిన సకురా ఒనిషి చేతిలో 12-2 తేడాతో టెక్నికల్ సుపీరియారిటీతో ఓడిపోవడంతో, 62 కేజీల విభాగంలో సవిత మరో రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

## ప్రపంచ ఛాంపియన్‌షిప్.. వరుస ఓటములతో సత్విక్-చిరాగ్ నిష్క్రమణ



**కొలంబో:** లియాంగ్‌వాంగ్ చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి పాలైన సత్విక్‌చిరాగ్, బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల నుండి నిష్క్రమించారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్‌ల చేతిలో 18-21, 9-21 తేడాతో ఓడిపోయిన భారత జోడీ సత్విక్ సాయి రాజ్, రంకిరెడ్డి-చిరాగ్ శెట్టిలు ఛాంపియన్‌షిప్స్ నుండి నిష్క్రమించారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా రెండోసారి సెమీఫైనల్ స్థానంపై కన్నేసిన ఈ జోడీ తొలి గేమ్‌ను నెమ్మదిగా ప్రారంభించారు. ఆట ఆరంభంలోనే చైనా ఆటగాళ్ల పదునైన స్మాష్‌లను ఎదుర్కోవడంలో వారు విఫలమయ్యారు. లియాంగ్-వాంగ్‌లు సునాయాసంగా 3-0 ఆధిక్యం సాధించినప్పటికీ, సత్విక్-చిరాగ్ జోడీ నెమ్మదిగా మ్యాచ్ లయకు కుదురుకుంది. ఇరు జట్లూ పాయింట్లు సాధించేందుకు వంతులవారీగా ప్రయత్నిస్తుండగా, సగం మ్యాచ్ ముగిసేసరికి సత్విక్-చిరాగ్ ద్వయం సాధించిన ఒక పాయింట్ స్వల్ప ఆధిక్యం ఈ మ్యాచ్ ఎంత హోరాహోరీగా సాగిందో స్పష్టం చేసింది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత్ జోడీ ప్రత్యర్థులపై రెండు పాయింట్ల ఆధిక్యాన్ని కొనసాగించారు. కానీ చైనీయులు పుంజుకుని స్కోరును 18-18తో సమం చేశారు. లియాంగ్ కొట్టిన స్మాష్‌ను చిరాగ్ అందుకోలేకపోవడంతో స్కోరు 19-18కి చేరింది. రెండవ గేమ్‌లో, భారత్ జోడీ 6 పాయింట్ల ఆధిక్యాన్ని కోల్పోవడంతో సగం ఆట ముగిసేసరికి స్కోరు 5-11గా ఉంది. కానీ క్షణాల్లో చైనీయులు 35 నిమిషాల పాటు సాగిన పోరులో భారతీయులపై సునాయాసంగా విజయం సాధించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించారు.

# దేశీయ మొబైల్ ఫోన్ తయారీకి కేంద్రం కొత్తస్కీం



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశీయ మొబైల్ ఫోన్ తయారీని మరింత బలోపేతం చేయడంతో పాటు భారతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్ల అభివృద్ధికి మద్దతు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్‌ను నోటిఫై చేసింది. దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం, భారతీయ బ్రాండ్లను విస్తరించేందుకు ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం.ఈ పథకాన్ని రెండు లక్ష్య విభాగాలుగా రూపొందించారు. టార్గెట్ సెగ్మెంట్1 కింద మొబైల్ ఫోన్ల తయారీని ప్రోత్సహించనుండగా, టార్గెట్ సెగ్మెంట్2 కింద భారతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్లకు మద్దతు అందించనున్నారు.టార్గెట్ సెగ్మెంట్2 కింద అర్హత పొందిన దరఖాస్తుదారులకు ఒక ఏడాది గెస్టేషన్ పీరియడ్ ఇవ్వనున్నారు. ఈ సమయంలో కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు పథకం కింద నిర్దేశించిన అర్హత ప్రమాణాలను చేరుకోవచ్చు. ఆర్థిక ప్రోత్సాహకాలకు అర్హత పొందుతాయి. భారత్‌లో రిజిస్టర్ అయి ఉన్న మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు 2026 ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.10,000 కోట్ల టర్నోవర్ సాధించి ఉంటే ఎంపిఎంఎస్ కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హత పొందుతాయి.ఇప్పటికే మార్కెట్లో ఉన్న భారతీయ బ్రాండ్లు ఆర్థిక ప్రోత్సాహకాలు పొందాలంటే మరింత కఠినమైన నిబంధనలను పాటించాలి.

ఆయా కంపెనీలు ప్రోత్సాహకాలు కోరుకునే ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం అమ్మకాలపై అదనంగా రూ.5,000 కోట్ల అమ్మకాలను సాధించాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు 2026 ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.1,000 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. దేశీయ మొబైల్ ఫోన్ తయారీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు భారతీయ బ్రాండ్లు తమ ఉత్పత్తుల స్థాయి, మార్కెట్ వాటాను విస్తరించేందుకు ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తయారీదారులు, భారతీయ బ్రాండ్ల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెంపుతో పాటు బ్రాండ్ అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది.ఇప్పటికే ఉన్న బ్రాండ్లకు ఇచ్చే ప్రోత్సాహకాలను అదనపు అమ్మకాలతో అనుసంధానం చేయడం ఈ పథకంలోని మరో కీలక అంశం. ఇఎంఎస్ సంస్థలకు రూ.1,000 కోట్ల టర్నోవర్ పరిమితిని విధించడం ద్వారా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ తయారీదారులను కూడా ఈ పథకం పరిధిలోకి తీసుకురావడంతో పాటు దేశంలోని మొత్తం ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ అభివృద్ధికి ఊతం లభించనుంది.

# గ్రామీణ భారత్‌కు స్టార్‌లింక్ ఎంతోమేలు



**న్యూయార్క్, ఆగస్టు 21:** భారత్‌లో ఇంటర్నెట్ సదుపాయం అంతగా లేని ప్రాంతాలకు స్టార్‌లింక్ ఉపయోగపడుతుందని స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు శాటిలైట్ ఇంటర్నెట్ మేలు చేస్తుందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ వాణిజ్య సేవలు ఇంకా ప్రారంభం కాలేదు. అనుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. సొంత సోషల్‌మీడియా ఎక్స్‌లో పోస్ట్‌కు స్పందిస్తూ మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2026 మే నాటికి దేశంలో 11,256 గ్రామాలకు 4జీ సదుపాయం లేదని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఇంటర్నెట్ వినియోగంలో భారీ తేడా ఉందని వివరించారు. 2026 మార్చి నాటికి భారత్‌లో 109.3 కోట్ల ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల వాటా 44.087 కోట్లు. గ్రామీణ ప్రాంతాల్లో 100 మందికి 48.31 ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాల్లో ఈ సంఖ్య 126.80గా ఉంది. మారుమూల గ్రామాలు, పర్వత ప్రాంతాలు, దీవులు, విపత్తుల ప్రభావిత ప్రాంతాల్లో శాటిలైట్ ఇంటర్నెట్ ఉపయోగపడే అవకాశం ఉంది. ఇలాంటి చోట్ల భౌగోళిక పరిస్థితులు,మౌలిక వసతుల కొరత వల్ల సంప్రదాయ టెలికాం సేవలు అందించడం కష్టంగా ఉంటుంది. దేశంలో భారత్‌నెట్ ద్వారా 8.5 లక్షల రూట్ కిలోమీటర్లకు పైగా ఫైబర్ వేశారు. సుమారు 2.21 లక్షల గ్రామ పంచాయతీలను సేవలకు సిద్ధం చేశారు. స్టార్‌లింక్ సేవలు ప్రారంభం కావాలంటే నియంత్రణ అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపు పూర్తి కావాలి. ఈ ప్రక్రియ పూర్తయితే మారుమూల ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో వచ్చే అవకాశం ఉంది.


SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**సాధారణ / కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం**

భారతీయ స్టేట్ బ్యాంకు సాధారణ / కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

ప్రకటన నం. CRPD/SCO/2026-27/11 (కాంట్రాక్ట్ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|
| డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డివిపి) – సైబర్ ఇన్నోవేషన్ & సిమ్యులేషన్ ల్యాబ్ | 1 | 35 | 45 |
| డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డివిపి) – పౌర కేంద్రీకృత కార్యక్రమాలు | 1 | | |
| డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డివిపి) – సైబర్ సెక్యూరిటీ | 2 | | |

(సాధారణ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | గ్రేడ్ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|---|
| డిప్యూటీ మేనేజర్- ఏఐ- స్పెషలిస్ట్ | 25 | ఎంఎంజిఎస్-II | 25 | 35 |
| డిప్యూటీ మేనేజర్- సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ | 3 | | | |
| డిప్యూటీ మేనేజర్- ఐటీ సెక్యూరిటీ నిపుణుడు | 2 | | | |

ప్రకటన నం. CRPD/SCO/2026-27/12 (సాధారణ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | గ్రేడ్ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|---|
| మేనేజర్ (మానవ వనరుల ప్రణాళిక & నియామకం) | 1 | ఎంఎంజిఎస్-III | 28 | 40 |
| మేనేజర్ (లెర్నింగ్ & డెవలప్‌మెంట్) | 1 | ఎంఎంజిఎస్-III | 28 | 40 |

ప్రకటన నం. CRPD/SCO/2026-27/13 (కాంట్రాక్ట్ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|
| వైస్ ప్రెసిడెంట్ (ఎంటర్‌ప్రైజ్ & టెక్నాలజీ ఆర్కిటెక్ట్) | 1 | 40 | 48 |
| డిప్యూటీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్) | 1 | 42 | 50 |

అర్హతా ప్రమాణాలు (వయస్సు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings** లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తుని నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు - **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **(https://bank.sbi/web/careers/post-your-query)**లో లభించును.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **07.08.2026** నుండి **27.08.2026** వరకు.

స్థలం: ముంబై
తేది: 07.08.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)


# జ్యుయెలరీ కంపెనీలషేర్లు ర్యాలీ!




**ముంబయి, ఆగస్టు 21:** బంగారం ధరలు భారీగా పెరగడంతో శుక్రవారం నగల కంపెనీల షేర్లు దూసుకెళ్లాయి. టాటా గ్రూప్‌కు చెందిన టైటాన్ కంపెనీ, సెంకో గోల్డ్, కళ్యాణ్ జువెల్లర్స్ ఇండియా సహా పలు జ్యువెలరీ స్టాక్స్‌లో ఇన్వెస్టర్ల కొనుగోళ్లు పెరిగాయి.స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ షేరు గరిష్ఠంగా 4.07 శాతం లాభపడగా, సెంకో గోల్డ్ షేరు 3 శాతానికి పైగా పెరిగింది. కళ్యాణ్ జువెల్లర్స్ ఇండియా షేరు 2 శాతానికి పైగా లాభపడగా, టైటాన్ కంపెనీ షేరు సుమారు 0.5 శాతం పెరిగింది.బంగారం ధరల్లో చోటుచేసుకున్న భారీ పెరుగుదలే జువెల్లరీ షేర్ల ర్యాలీకి ప్రధాన కారణంగా నిలిచింది. విలువైన లోహాలు, ఆభరణాల రంగంలో పనిచేస్తున్న కంపెనీలపై ఈ పరిణామం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. కమోడిటీ మార్కెట్లో ఎంసిఎక్స్‌లో బంగారం ధర 10 గ్రాములకు రూ.1.60 లక్షల స్థాయిని దాటగా, వెండి ధర కిలోకు రూ.2.46 లక్షలు దాటింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో ఎంసీఎక్స్ బంగారం ధర 10 గ్రాములకు రూ.6,600కు పైగా పెరగగా, వెండి ధర కిలోకు రూ.13వేలకు పైగా ఎగిసింది.విలువైన లోహాల ధరలు వేగంగా పెరగడంతో జువెల్లరీ షేర్లు ఇన్వెస్టర్ల దృష్టిలో కొనసాగుతున్నాయి. అధిక బులియన్ ధరలు ఆభరణాల డిమాండ్, కంపెనీల మార్జిన్లు, ఇన్వెంటరీ విలువలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశాలను ఇన్వెస్టర్లు పరిశీలిస్తున్నారు. ఎస్‌బిఐ సెక్యూరిటీస్‌లో ఫండమెంటల్ రీసెర్చ్ హెడ్ సన్నీ అగర్వాల్ మాట్లాడుతూ బంగారం ధరలు గణనీయంగా పెరగడం వల్ల కంపెనీల వద్ద ఉన్న ఇన్వెంటరీ విలువ పెరుగుతోందని, దీంతో ఆర్గనైజ్డ్ జువెల్లరీ కంపెనీల ఆదాయ వృద్ధికి మద్దతు లభిస్తోందని తెలిపారు.సురక్షిత పెట్టుబడులకు డిమాండ్, ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో బంగారం ధరలు బలపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న పండుగలు, వివాహాల సీజన్ కూడా నగల డిమాండ్‌కు అదనపు ఊతమిచ్చే అవకాశం ఉందన్నారు.అధిక బంగారం ధరలు ఉన్నప్పటికీ నగల కొనుగోళ్లలో స్థిరమైన డిమాండ్, కొత్త స్టోర్ల విస్తరణ, అసంఘటిత రంగం నుంచి ఆర్గనైజ్డ్ రిటైలర్ల వైపు వినియోగదారుల మళ్లింపు వంటి అంశాలు కూడా జువెల్లరీ కంపెనీలకు అనుకూలంగా మారుతున్నాయి. ప్రముఖ కంపెనీల తాజా వ్యాపార అప్‌డేట్లు కూడా డిమాండ్ బలంగా ఉన్నట్లు సూచిస్తున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదిక ప్రకారం, భారత్‌లో ఆర్గనైజ్డ్ జువెల్లరీ రిటైల్ రంగం రానున్న సంవత్సరాల్లో మరింత వేగంగా అభివృద్ధి చెందనుంది. ఈ ట్రెండ్‌ల నుంచి లబ్ధి పొందేందుకు టైటాన్ కంపెనీ, కళ్యాణ్ జువెల్లర్స్ ఇండియా అత్యుత్తమ స్థానంలో ఉన్నాయని మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. టైటాన్ షేరు లక్ష్య ధరను రూ.6,000, కళ్యాణ్ జువెల్లర్స్ లక్ష్య ధరను రూ.800గా నిర్ణయించింది. పీఎన్ గాడ్గిల్ జువెల్లర్స్ షేరుపై బైరేటింగ్‌ను కొనసాగిస్తూ ధరను రూ.800గా పేర్కొంది. సెంకో గోల్డ్‌పై మాత్రం 'న్యూట్రల్ రేటింగ్‌ను కొనసాగిస్తూ ధరను రూ.430గా నిర్ణయించింది.ఎస్‌బిఐ సెక్యూరిటీస్‌కు చెందిన సన్నీ అగర్వాల్ టాప్ పిక్స్‌లో టైటాన్ కంపెనీ, స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ ఉన్నాయి.

## స్వల్పమార్పులతోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ వారాంతంలో మందగమనం...




**ముంబయి, ఆగస్టు 21:** భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ చుట్టూ నెలకొన్న పరిస్థితులు, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో ఉండటంతో శుక్రవారం దేశీయఈక్విటీ మార్కెట్లు స్వల్ప మార్పులతో ముగి శాయి. నిఫ్టీ 24,250 మార్కు పైన స్థిరపడింది. మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు కనిపించగా ఎఫ్‌ఎంసీజీ, ఆటో, కెమికల్ షేర్లు నష్టపోయాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 3.11 పాయింట్లు స్వల్పంగా పెరిగి 77,540.83 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 20.15 పాయింట్లు లాభపడి 24,252 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.12 శాతం, స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.31శాతం చొప్పున పెరి గాయి. బీఎస్‌ఈలో 2,250 షేర్లులాభపడగా, 2,092 షేర్లు నష్టపో యాయి. మరో 243 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 50 సెంట్లు తగ్గి 93.28 డాలర్లకుచేరింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. గత సెషన్‌లో 95.7475 వద్ద ముగిసిన రూపాయి శుక్రవారం 95.7300 వద్ద కొనసాగింది. నిఫ్టీ మీడియాసూచీ 2.13 శాతం పెరిగింది. నెట్‌వర్క్18 మీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ 8.69శాతం, జీఎంటర్‌టైన్‌మెంట్ 5.21 శాతం, సారేగామ ఇండియా 2.32 శాతం, పివిఆర్ ఐనాక్స్ 1.47 శాతం, ప్రైమ్ ఫోకస్ 1.36శాతం, హాత్‌వేకేబుల్ డేటాకామ్ 1.05 శాతం చొప్పున లాభ పడ్డాయి. సన్‌టీవీ నెట్‌వర్క్ 0.58 శాతం, టిప్స్ మ్యూజిక్ 0.41 శాతం, డీబీ కార్ప్ 0.39 శాతం చొప్పున నష్టపోయాయి. ప్యాటర్న్ (ఇండియా) 2.43 శాతం, రైల్‌టెల్ కార్పొరేషన్ 2.26 శాతం పెరిగాయి. సాత్విక్ గ్రీన్ ఎనర్జీ 5.04 శాతం దూసుకెళ్లింది. లెమన్ ట్రీ హోటల్స్ 0.23 శాతం లాభపడింది.టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 0.80 శాతం, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ 0.82 శాతం చొప్పున తగ్గాయి. వాల్చంద్‌నగర్ ఇండస్ట్రీస్ 1.27 శాతం పెరిగింది.ఐసీఐసీఐ బ్యాంక్ 0.53 శాతం లాభపడింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14